www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 246 | సోమవారం 26-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

భువిని వీడిన

అతిలోక సుందరి




శ్రీదేవి భౌతికకాయం....


మృతికి కొన్ని గంటల ముందు...

గుండెపోటుతో శ్రీదేవి హఠాన్మరణం

- శనివారం రాత్రి 11గంటలకు అస్వస్థత
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- దేశమంతా దిగ్భ్రాంతి
- 54 ఏళ్లు.. 50 ఏళ్ల సినీ ప్రస్థానం
- నేడు ముంబైలో అంత్యక్రియలు

వార్తలు, కథనాలు లోపలి పేజీల్లో

అందం, అభినయంతో భారతీయ సినీ ప్రేక్షకుల మనసులను దోచిన అతిలోకసుందరి శ్రీదేవి మరిలేరు. ఆమె సొగసు ఆకర్షణీయం. ఆమె నటన అనిర్వచనీయం. ఆమె హావభావాలు అద్భుతం. వెండితెరపై ఆ గ్లామర్‌కు మరో తార్కాణం లేదు. అందం అంటే శ్రీదేవినే. అలా మాయ చేసింది ఆమె అభినయం. సినీ ప్రేక్షకులలో గుబులు పుట్టించిందామె. తళుకులు. అపురూప సౌందర్యం ఒక్కటే కాదు, అద్వితీయ నటన ఆమె టాలెంట్. ముఖకవళికలే కాదు, ఆమె స్వరం కూడా సుమధురమే. తేలికైన హావభావాలు ఆమె నటనకు గీటురాయి. . భాష ఏదైనా.. అందులోని మాధుర్యాన్ని తన డైలాగ్‌లతో రక్తికట్టించింది.

ఏపీకి ప్రత్యేక హోదా, హామీల అమలు కోసం

అంతిమ పోరాటం


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన మధు తదితరులు

- ప్రత్యక్ష ఆందోళనకు అంతా సిద్ధం కావాలి
- బీజేపీ-టీడీపీ మభ్యపెట్టే మాటలు మానాలి
- ఢిల్లీలోనే తాడోపేడో తేల్చుకుందాం
- పౌరసమాజం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : అంతిమ పోరాటం ద్వారానే రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా సాధ్యమవుతుందని వక్తలు స్పష్టం చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఢిల్లీలో తాడోపేడో తేల్చుకోవడానికి ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏపీ ప్రజలను నాలుగేళ్లుగా మాయమాటలతో మభ్యపెడుతున్న బీజేపీ-టీడీపీలు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్ పౌరసమాజం ఆధ్వర్యంలో ఆదివారం దాసరిభవన్‌లో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఆలోచనపరుల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా సాక్షాత్తు పార్లమెంటులో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో చేసిన చట్టం ప్రకారం ఏపీకి ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాల్సిందేనన్నారు. ఏపీ ప్రజలు కొత్తగా ఏమీ అడగడం లేదని, విభజన హామీలనే అమలు చేయాలని కోరుతున్న విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10 ఏళ్లు కాదు 15 ఏళ్లు కావాలని.. తర్వాత హోదా సంజీవని కాదని.. హోదా కంటే మేలైన ప్రత్యేక ప్యాకేజీ వస్తుందని నాలుగేళ్లుగా కాలక్షేపం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ హోదా ఇవ్వాల్సిందేనని మాట మార్చడం ద్వారా భూమి గుండ్రంగా

- మిగతా 2 లో

కార్పొరేషన్‌లకు

ఎన్నికలు లేనట్లే?

- విశాఖ, గుంటూరు, తిరుపతి, ఒంగోలులకు..
- స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు
- ఆలోగా కోర్టు కేసులు, ఇతర సమస్యల పరిష్కారం
- ప్రభుత్వ నిర్ణయంపై పలు పార్టీల నేతల్లో నిరాశ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి గ్రేటర్ విశాఖ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశాలు లేవు. ఈ నాలుగు కార్పొరేషన్‌లతోపాటు పలు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు కొన్నేళ్లుగా ఎన్నికలు నిర్వహించటంలేదు. వార్డుల విభజన, కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు నిలిచిపోయాయి. గత ఏడాది కాకినాడ కార్పొరేషన్‌తోపాటు ఎన్నికలు నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో స్థానిక సంస్థల పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చెందుతున్నారు. మరో ఏడాదిన్నరలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాదదైనా ఎన్నికలు జరిగే అవకాశం

- మిగతా 2 లో

రుణమాఫీలో కార్పొరేట్‌కే పెద్దపీట

- వ్యవసాయంకన్నా ఏడు రెట్లు అధికం
- తేటతెల్లమైన ప్రభుత్వరంగ బ్యాంకుల పక్షపాతం

9లో

మహిళల నేతృత్వంలో అభివృద్ధి దిశగా భారత్

- ప్రధాని నరేంద్ర మోడీ

9లో

తల్లి కర్కశం....

- గుక్కపట్టి ఏడుస్తోందని చెత్త కుండీలో పడేసిన వైనం
- చిన్నారి మృతి

9లో

టెక్నాలజీలో మనమే ఫస్ట్

సీఐఐ సదస్సులో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆధునిక సాంకేతిక పద్దతులను ఉపయోగించుకుని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్య పెట్టుబడుల సదస్సులో రెండో రోజు ఆదివారం ఉదయం టెక్నాలజీ ఫర్ టుమారో అనే అంశంపై నిర్వహించిన సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అశాస్త్రీయ పద్ధతిలో విభజింపబడిన రాష్ట్రం తొలినాళ్లలో రాజధానిలేక మౌలిక సదుపాయాలుకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు విజన్ 2050తో ప్రపంచంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రైమరీ, సర్వీస్, ఇండస్ట్రీస్ సెక్టార్లతో పాటు నాలెడ్జి అండ్ స్కిల్ డెవలప్‌మెంట్‌తో 7 మిషన్స్, పవర్, గేస్, రోడ్, వాటర్ ఐదు గ్రిడ్లను అమలు చేస్తున్నామన్నారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా ఇప్రగతి బయో మెట్రిక్ హాజరు ద్వారా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అమలు చేయడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. ఎక్కడా లేని సహజవనరులు రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం, రవాణా సౌకర్యం, మానవ వనరులు, నీటి లభ్యత, ముడి ఖనిజ లభ్యతతో పాటు 24 గంటలూ విద్యుత్

- మిగతా 2 లో



ఆదివారం విజయవాడలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే

ప్రత్యక్ష కార్యాచరణ

రాజకీయ పార్టీల ప్రకటన

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని వామపక్షాలు, వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్, జనసేన పార్టీలు ప్రకటించాయి. న్యాయసమ్మతమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంఘీభావంతోపాటు సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలిపాయి.

3లో

మంగళగిరి టెక్ పార్కులో భారీ అగ్నిప్రమాదం


2లో

ఇదీ లోకం!


మా ప్రభుత్వం చాలా బాగా పనిచేస్తోంది.. సాయం కోసం మీరు కేకలు వేస్తోంటే 'బుందేల్‌ఖండ్' కు ఇచ్చాం!

స్మగ్లింగ్ అడ్డా...

బెజవాడ...!



- రైల్వేస్టేషన్ కేంద్రంగానే
- అంతంత మాత్రంగానే భద్రత
- తూతూమంత్రంగా తనిఖీలు
- ప్రతిపాదనల్లోనే లగేజీ స్కానర్లు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : దక్షిణ భారతదేశానికి కేంద్ర బిందువైన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు స్మగ్లింగ్‌కు అడ్డాగా నిలుస్తోంది. విజయవాడను కేంద్రంగా చేసుకుని స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. గోల్డ్ బిస్కట్‌లు, గంజాయి, నక్షత్ర తాబేళ్లు, రెండు తలల పాములతోపాటు తరచూ ఆయుధాలు, డ్రగ్స్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఆసియాలోనే అతి పెద్దదైన ఆటోనగర్‌లోనూ స్మగ్లింగ్ అడ్డాలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే జిలిటెన్ స్టిక్స్, ఆయుధాలు, గంజాయి విజయవాడ కేంద్రంగా అక్రమంగా రవాణా అయిన ఘటనలు ఉన్నాయి. రాయలసీమలో పెద్ద ఎత్తున స్మగ్లింగ్ జరిగే ఎర్ర చందనం సైతం విజయవాడ మీదగా ఇతర ప్రాంతాలకు తరలుతోంది. ఎప్పుడో ఒక్కసారి మాత్రమే అధికారులు స్మగ్లర్లపై దాడులు చేస్తారు. దీంతో రాష్ట్రం మీదగా స్మగ్లింగ్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధానమైన విజయవాడ రైల్వే జంక్షన్ స్మగ్లింగ్‌కు అడ్డాగా నిలుస్తోంది. దేశంలోనే ఏ1 రైల్వేస్టేషన్‌గా ఉన్న విజయవాడలో తనిఖీలు పెద్దగా ఉండకపోవటంతో స్మగ్లర్లు తమ పనిని సులువు చేసుకునేందుకు రైల్వేస్టేషన్‌ను వినియోగించుకుంటున్నారు. దీనికితోడు స్టేషన్‌లో భద్రత, రక్షణ వ్యవస్థలు పటిష్టంగా లేకోవటం స్మగ్లర్లకు కలిసివస్తోంది. విజయవాడ రాజధానిగా మారిన తర్వాత రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించారేగానీ, భద్రతా చర్యలు చేపట్టడంలో అటు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) వైఫల్యం చెందాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, దేశరాజధాని ఢిల్లీ, వాణిజ్య రాజధాని ముంబై తదితర ప్రాంతాలకూ విజయవాడ రైల్వే జంక్షన్ నుంచి రైళ్లు నడుస్తున్నాయి. ప్రతి రోజూ సుమారు 300 రైళ్లలో లక్షన్నర మంది రాకపోకలు సాగిస్తున్నారు. అలాంటి పెద్ద రైల్వే జంక్షన్‌లో భద్రత డొల్లగానే ఉంది. ఐదారేళ్ల క్రితమే స్టేషన్‌లో ఎయిర్‌పోర్టు తరహాలో లగేజీ

- మిగతా 2 లో



మళ్లీ పోటీచేయను : టెమర్

రియో డి జనీయిరో : ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న అధ్యక్ష ఎన్నికలలో తాను పోటీచేయబోనని బ్రెజిల్ అధ్యక్షుడు మైఖేల్ టెమర్ చెప్పారు. ఆయన మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను మళ్లీ పోటీచేయనున్నట్టు జిన్హువా వార్తాసంస్థ అందిచిన సమాచారాన్ని తిరస్కరించారు. మాజీ అధ్యక్షురాలు దిల్మా రౌసెఫ్‌పై అవినీతి ఆరోపణలను బనాయించి ఆమెను పదవిచ్యుతురాలిని చేసి 2016లో ఉపాధ్యక్షునిగా ఉన్న టెమర్ అధ్యక్షపీఠాన్ని కైవసం చేసుకున్నారు. టెమర్ మళ్లీ పోటీచేస్తారని గత వారం రోజులుగా వార్తలు వస్తున్నాయి. దేశంలో శాంతి, భద్రతల పరిస్థితి గణనీయంగా దిగజారిపోయింది. ఈ దశలో ఆయన మళ్లీ పోటీచేస్తారన్న వార్తలను తిరస్కరించారు. సామాజిక భద్రతా సంస్కరణలకు రాజ్యాంగాన్ని సవరించే ప్రయత్నం టెమర్ చేయనున్నట్టు ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ నెల 19వ తేదీన ఈ ప్రతిపాదనపై ఓటింగ్ జరగవలసి వుంది. ఓటింగ్ జరిగితే పార్లమెంట్‌లో ప్రభుత్వం ఓడిపోయే అవకాశం ఉండడంతో టెమర్ ఆ ప్రతిపాదన విరమించుకున్నాడు.

సిరియాలో కాల్పులు విరమించాలి : గుటెర్రస్



ఐరాస : సిరియాలో 30 రోజుల కాల్పుల విరమణను అమలు చేయాలని భద్రతామండలి చేసిన తీర్మానాన్ని తక్షణం అమలు చేయాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోని గుటెర్రస్ కోరారు. రష్యా తోడ్పాటుతో ఎలాంటి జాప్యం లేకుండా కాల్పుల విరమణ ఒప్పందం జరగాలని భద్రతా మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. తిరుగుబాటుదారులు తిష్టవేసుకుని కూర్చున్న ఘౌట ప్రాంతంలో సిరియా యుద్ధవిమానాలు దాడులు చేశాయని, తక్షణం కాల్పుల విరమణ జరగాలని భద్రతామండలి కోరింది. ఆ ప్రాంతంలో తక్షణం కాల్పుల విరమణ అమలుజరిపి తీవ్రంగా గాయపడిన బాధితులకు, ప్రజలకు మానవతా సహాయం, ఇతర సేవలు అందించేందుకు వీలుగా భద్రతమైన వాతావరణాన్ని కల్పించాలని గుటెర్రస్ కోరినట్టుగా ఐరాస ప్రతినిధి స్టీఫెన్ డుజరిక్ తెలిపారు. సిరియాలో కాల్పుల విరమణకు తక్షణం పూనుకోవాలని రష్యా కూడా కోరింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మాక్రాన్, జర్మనీ ఛాన్సలర్ ఏంజలా మర్కెల్ కాల్పుల విరమణపై సంప్రదింపులు జరిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

అమెరికా ఆంక్షలు యుద్ధ చర్యే

ఉత్తరకొరియా తీవ్ర ఆగ్రహం



సియోల్ : తమపైన కొత్తగా అమెరికా విధించిన ఆంక్షలు యుద్ధచర్యే అని ఉత్తరకొరియా తీవ్ర ఆగ్రహం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ఏనాడులేనంతగా అత్యధిక ఆంక్షలను ఉత్తరకొరియాపై విధించారు. ఉత్తరకొరియా తన అణుకార్యక్రమాన్ని నిలిపివేసేందుకే ఈ ఆంక్షలు విధించినట్టు ట్రంప్ చెప్పుకున్నారు. ఉత్తరకొరియాకు చెందిన దాదాపు 50 షిప్పింగ్ కంపెనీలపైన, నౌకలపైన, వాణిజ్యంపైన ఈ ఆంక్షల ప్రభావం పడుతుంది. గతంలోనే తాము చెప్పినట్టుగా ఈ ఆంక్షలను యుద్ధచర్యగా పరిగణిస్తున్నామని ఉత్తరకొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనను కేసీఎన్ఏ వార్తా ఏజెన్సీ అందించింది. అమెరికా వాస్తవంగా తమతో కరకుగా వ్యవహరించినట్లైతే అత్యంత తీవ్రంగా తిప్పికొడతామని ఉత్తరకొరియా హెచ్చరించింది. ఆంక్షలు విధించడం పిరికిలక్షణమని పేర్కొన్నది. ఇప్పుడు విధించిన చివరి ఆంక్షలు కూడా పనిచేయకపోతే రెండో దశ చర్యలకు పూనుకుంటామని, అవి చాలా కఠినంగా ఉంటాయని ట్రంప్ ఆంక్షలు విధిస్తూ చెప్పారు. అయితే, ఎలాంటి కఠినచర్యలు అనేది ఆయన వివరించలేదు. దీనికి ఉత్తరకొరియా స్పందిస్తూ మా మార్గంలో మేము అమెరికాకు సమాధానం చెపుతాం. రెచ్చగొడితే తగిన విధంగా సమాధానం ఉంటుంది. ఆంక్షలు విధించడం ద్వారా మమ్మల్ని మార్చాలని చూస్తున్నారు. మా గురించి తెలియకపోవడం వల్లనే ఇలా చేస్తున్నారని ట్రంప్ మీద ఉత్తరకొరియా మండిపడింది. ఇప్పటికే మా వద్ద శక్తిమంతమైన అణ్వాయుధం ఉంది. మమ్మల్ని మేము రక్షించుకునేందుకు న్యాయ ఆయుధం ఉంది. అని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ పేర్కొన్నది. దక్షిణ కొరియాలో జరిగిన వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు ఉత్తర కొరియా సైనిక జనరల్ కిమ్ యాంగ్ చోల్ బయలుదేరే ముందుగా అమెరికా ఈ ఆంక్షలను ప్రకటించింది. రెండు కొరియాల మధ్య సయోధ్య కోసం చర్చలు జరిగేందుకు తగిన వాతావరణం ఏర్పడుతున్న దశలో ట్రంప్ ఆంక్షలు విధించి సామరస్య వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకవైపు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్, మాజీ ప్రధాన కార్యదర్శి బాన్‌కీ మూన్‌లు ఉభయ కొరియాల మధ్య చర్చలు జరగాలని, అందుకు అమెరికా కీలకపాత్ర వహించాలని సూచించిన నేపథ్యంలో ట్రంప్ చర్యలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయి.

అమెరికా ఆంక్షలపై చైనా నిరసన

బీజింగ్ : తమ కంపెనీలపై అమెరికా ఆంక్షలు విధించినందుకు చైనా తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఉత్తరకొరియాతో అక్రమ ఆర్థిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయని ఆరోపిస్తూ చైనా కంపెనీలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఉత్తరకొరియాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ 50కి పైగా కంపెనీలు, నౌకలు, వాణిజ్య సంస్థలపైన అమెరికా ఆంక్షలు విధించింది. ఉత్తరకొరియా తన అణుకార్యక్రమాన్ని నిలిపివేసేందుకే ఈ ఆంక్షలని అమెరికా చెప్పుకున్నది. ఆంక్షలకు గురైన కంపెనీలు ఉత్తరకొరియా, చైనా, సింగపూర్, తైవాన్, హాంగ్‌కాంగ్, మార్షల్ ఐలాండ్స్, టాంజానియా, పనామా తదితర దేశాలలో రిజిస్టర్ అయి ఉన్నాయి. గత ఏడాది ఉత్తరకొరియా పలుమార్లు అణుక్షిపణులను ప్రయోగించినప్పుడు అటు ఐక్యరాజ్య సమితి, ఇటు అమెరికా ఆంక్షలు విధించాయి. తమ కంపెనీలపైన ఏకపక్షంగా ఆంక్షలు విధించారని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జంగ్ షియాంగ్ వ్యాఖ్యానించారు.

చైనా అధ్యక్షుడి గడువు పరిమితి రద్దు



బీజింగ్ : చైనా అధ్యక్ష పదవికి విధించిన రెండుసార్లు గడువు పరిమితిని రద్దు చేయాలని పాలక కమ్యూనిస్టు పార్టీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలు జరిగితే ప్రస్తుత అధ్యక్షుడు జిన్‌పింగ్ అధ్యక్షుడుగా రెండుసార్లు తన పదవీకాలాన్ని పొడిగించేందుకు అవకాశం కలుగుతుంది. ప్రస్తుత నిబంధన ప్రకారం 2023తో ఆయన పదవీకాలం పూర్తి అవుతుంది. పార్టీ ప్రతిపాదన అమలుజరిగితే ఆ తరువాత కూడా ఆయనే అధ్యక్షునిగా కొనసాగవచ్చు. పార్టీ నియమావళిలో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులలో రెండుసార్లకు మించి కొనసాగరాదు. అయితే, పార్టీ నియమావళిలో ఈ క్లాజును సవరించాలని కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ప్రతిపాదించినట్టుగా జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. కమ్యూనిస్టు పార్టీ ప్లీనం సమావేశం ఈ ప్రతిపాదనను ఆమోదించినట్లైతే ప్రస్తుతం అత్యంత శక్తిమంతమైన నాయకునిగా ఉన్న 64 ఏళ్ల జిన్‌పింగ్ మరోసారి కూడా పదవిలో కొనసాగవచ్చు. ప్రస్తుతం ఆయన రెండవసారి అధ్యక్ష పదవిని అలంకరించి పరిపాలిస్తున్నారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, సర్వసైన్యాధ్యక్షుడిగా ఉన్నారు. ఏడుగురు సభ్యులతో కూడిన సెంట్రల్ కమిటీ గత ఏడాది జిన్‌పింగ్‌ను రెండుసార్లకు మించి పదవిలో కొనసాగించాలని భావించింది. ఆ నాటి నుంచి జిన్‌పింగ్‌ను చైనాలో అత్యున్నత స్థాయి శక్తిమంతమైన నాయకుడిగా పార్టీలోని అన్ని విభాగాలు పరిగణిస్తున్నాయి. మూడు దశాబ్దాలుగా సమష్టి నాయకత్వ సూత్రాన్ని చైనా అనుసరిస్తున్నది. 2013లో మొదటిసారి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని చేపట్టారు. 2016లో పార్టీ సెంట్రల్ కమిటీ ఆయనను అత్యంత కీలక నాయకునిగా ప్రకటించింది. ఐదేళ్లకొకసారి జరిగే పార్టీ మహాసభ జిన్‌పింగ్ సైద్ధాంతిక సూత్రీకరణలను పార్టీ నియమావళిలో చేర్చింది. జిన్‌పింగ్‌ను అధ్యక్ష పదవిలో నిరవధికంగా కొనసాగించేందుకు కూడా అవకాశాలున్నాయి. రాజ్యాంగం ప్రకారం జిన్‌పింగ్ రెండుసార్లు అధ్యక్ష పదవిలో కొనసాగిన తరువాత పదవీవిరమణ చేయాల్సి ఉంటుంది. మొదటిసారి అధ్యక్ష పదవీకాలం పూర్తికావచ్చింది. మార్చి 5వ తేదీన రెండోసారి పదవీకాలం ప్రారంభమవుతుంది. పార్లమెంట్ ఆమోదంతో రెండోసారి ఆయన పదవిలో కొనసాగుతారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి సంబంధించి నిరవధికంగా కొనసాగే అవకాశం కూడా ఉన్నది.

సోమాలియా పేలుళ్లలో మృతులు 38

మొగదీష్ : సోమాలియా రాజధాని మొగదీష్ నగరంలో రెండు కారుబాంబు పేలుళ్లు జరిగిన దుర్ఘటనల్లో మృతుల సంఖ్య 38కి పెరిగిందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. పేలుళ్లు జరిగిన వెంటనే మృతుల సంఖ్య 18గా భావించారు. 20 మందికి గాయాలైనట్టుగా వెల్లడైంది. మృతిచెందిన, గాయపడిన వారంతా పౌరులేనని అధ్యక్షభవన వర్గాలు తెలిపాయి. అధ్యక్ష భవనాన్ని, ఒక హోటల్‌ని లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి కారుబాంబు దాడులు జరిపారు. ప్రభుత్వం మొగదీష్‌లో టెర్రరిస్టులు దాడి జరిపే అవకాశం ఉందని హెచ్చరించిన రెండు రోజుల అనంతరం ఈ బాంబుదాడులు జరిగాయి. ఈ దాడికి తామే కారణమని అల్‌షబాబ్ టెర్రరిస్టు గ్రూప్ ప్రకటించింది. ఈ గ్రూప్ తరచుగా సోమాలియా, ఆఫ్రికా తూర్పు ప్రాంతాలలో దాడులు జరుపుతోంది. గత డిసెంబరులో మొగదీష్ నగరంలోని పోలీసు అకాడమి లోపల ఆత్మాహుతి బాంబుదాడి జరిగి 18 మంది పోలీసు అధికారులు చనిపోయారు. అలాగే, గత అక్టోబరు 14, 28 తేదీలలో బాంబుదాడులు జరిగాయి. ఈ దాడుల్లో 350 మంది మృతిచెందగా, 400 మందికి గాయాలయ్యాయి.

పారిస్ ఒప్పందం భారత్, చైనాలకే మేలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాతపాట

వాషింగ్టన్ : పారిస్ వాతావరణ ఒప్పందంపైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి ఎంతమాత్రం మారలేదు. మళ్లీ పాతపాటే పాడుతున్నాడు. పారిస్ ఒప్పందం భారత్, చైనాలకే ప్రయోజనం కలిగిస్తుందని, తమ దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకం కల్పిస్తుందని ట్రంప్ మరోసారి విమర్శించారు. అభివృద్ధి చెందిన దేశాలు ఈ ఒప్పందం వల్ల ప్రయోజనం పొందగా, తమకు ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. పారిస్ ఒప్పందం ద్వారా మమ్మల్ని దెబ్బకొట్టారు. దాన్ని అమలు జరిపితే మా దేశంలో పరిస్థితి విధ్వంసకరంగా ఉండేది అని కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ అన్నారు. మా వద్ద చమురు, గ్యాస్ వనరులు అపారంగా ఉన్నాయి, సాంకేతిక పరిజ్ఞానం బ్రహ్మాండమైనది, గతంలో ఏనాడు లేనన్ని సౌకర్యాలున్నాయి. ఇంధన వనరులు అపారంగా ఉన్నాయి. తమ దేశంలో బొగ్గు నిల్వలు కూడా మెండుగా ఉన్నాయని భారత్, చైనాలు చెపుతున్నాయి. అయితే, వాటిని వారు వాడడంలేదు. అంటే దీని అర్థం ఏమిటి? ఇతర దేశాలతో మేము పోటీపడకుండా ఉండాలన్నమాట అది ఎన్నటికీ జరగదని వారికి చెప్పాం. భారత్, చైనాలకు మేము చెల్లించాల్సి వస్తోంది. ఎందుకంటే? అభివృద్ధి చెందిన దేశాలుగా భావించాలని అవి కోరుకుంటున్నాయి. అమెరికా అభివృద్ధి చెందింది. అయినా మేము వారికి చెల్లిస్తున్నాం. 2020 నాటి నుంచి కర్బనపు వాయువులను తగ్గించేందుకు వీలుగా పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ వాతావరణ సదస్సులో 196 దేశాలు పాల్గొన్ని ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇంతవరకు జరిగిన అంతర్జాతీయ సదస్సులలో కెల్లా పారిస్ ఒప్పందమే అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు.

ఆఫ్ఘన్‌లో 9 మంది తాలిబన్ల హతం

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్ ఉత్తరప్రాంతంలోని బగ్లాన్ రాష్ట్రంలో జాతీయ రక్షణ, భద్రతా దళాలు నిర్వహించిన దాడుల్లో కనీసం 9 మంది తాలిబాన్లు హతమైనట్టుగా తెలుస్తోంది. అల్‌బర్జి-24 ఆపరేషన్‌లో తొమ్మిది మంది తీవ్రవాదులు హతమైనట్లుగా సైనిక వర్గాలను ఉటంకిస్తూ ఖమా వార్తా సంస్థ తెలిపింది. మిలిటెంట్లను నియంత్రించేందుకు టలా బర్ఫత్ జిల్లాలోని టర్మిష్ లోయ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద భద్రతా దళాలు ఈ దాడులు జరిపాయి.

అంతిమ పోరాటం!

(మొదటిపేజీ తరువాయి)

ఉందని మరోసారి రుజువు చేశారని విమర్శించారు. హోదా ఇవ్వాల్సిన బాధ్యత ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న బీజేపీ, టీడీపీలదేనని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాల్లోపు హోదా, విభజన హామీలు, లోటుబడ్జెట్‌ను సాధించుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి మేలు జరగదన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. హోదా విషయమై రాష్ట్రంలో చర్చ జరుగుతోందే తప్ప ఢిల్లీలో జరగడం లేదన్నారు. కలిసొచ్చే పార్టీలు, సంఘాలతో కలసి ఆందోళనలు చేయడం ద్వారా ఉద్యమ సెగ ఢిల్లీని తాకాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి పిలుపు మేరకు వామపక్షాలు, కాంగ్రెస్, వైసీపీ, జనసేన సహా పలు రాజకీయపార్టీలు, వివిధ సంఘాలను కలుపుకొని మార్చి 6వ తేదీ నుంచి ఢిల్లీలో పార్లమెంటు వద్ద ధర్నాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలందరూ కలసి ఒకే వాణిని వినిపించాలన్నారు. లేదంటే చరిత్రహీనులుగా మారడం ఖాయమని రామకృష్ణ హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ ఫిబ్రవరి 1న కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయని తెలిపారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై తొలిసారిగా వామపక్షాలు గళం విప్పి 8వ తేదీన బంద్‌కు పిలుపునిస్తే టీడీపీ సహా అన్ని రాజకీయపార్టీలు రోడ్డుపైకి వచ్చాయన్నారు. ఇంత జరుగుతున్నా కూడా ఇంకా బీజేపీ, టీడీపీలు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. రాష్ట్రానికి న్యాయం జరగాలంటే 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' తరహాలో మరో మహోద్యమం చేయాల్సిందేనన్నారు. పోలవరం నిర్మాణంపై బీజేపీ కుట్రను బయటపెట్టకుండా టీడీపీ పెద్ద తప్పిదాన్ని చేసిందని విమర్శించారు. పార్లమెంటు సమావేశాల తర్వాత ఏపీలో పెనుమార్పులు సంభవించడం ఖాయమని మధు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జనవిజ్ఞానవేదిక అధ్యక్షుడు వి లక్ష్మణరెడ్డి, ప్రత్యేక హోదా సాధన సమితి ప్రతినిధి టి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రత్యేక తరగతి హోదాతోనే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించగలదన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పెట్టుబడులను రాబట్టేందుకు మూడేళ్లుగా నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సుల్లో ఒప్పందాలు తప్ప ఆచరణను నోచుకోకపోవడం విచారకరమన్నారు. హోదా వస్తే రాయితీలుంటాయి కనుక పరిశ్రమలు తప్పనిసరిగా వస్తాయన్నారు. అందరూ ఒకేతాటిపైకి వచ్చి హోదా కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన పౌరసమాజం వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి దానీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం దక్షిణా రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమ ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జె గౌతం, కొలనుకొండ శివాజీ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, సీపీఎం నేత వైవీ రావు, సీపీఐ నేత దోనేపూడి శంకర్, వైసీపీ నేత కొణిజేటి రమేష్, రాజకీయ విశ్లేషకుడు సయ్యద్ రఫీ, సామాజిక కార్యకర్త మహబూబ్ ఆజాం, టీడీపీ అధికార ప్రతినిధి దింటకుర్తి వీరరాఘవ, ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రధాన కార్యదర్శి జి రంగన్న, రాజకీయకార్యకర్త చుండూరి రాజేంద్రప్రసాద్, పౌరసమాజం అధ్యక్షుడు భూమన్, ఉపాధ్యక్షుడు సీహెచ్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ...!

(మొదటిపేజీ తరువాయి)

స్కానర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చింది. అది ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. దీనికితోడు విజయవాడ రైల్వే జంక్షన్ చుట్టూ ఓపెన్‌గా ఉండటంతో భద్రతలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే స్మగ్లర్లకు బాగా కలిసివస్తోంది. ఎక్కడ నుంచి ఎక్కడికైనా విజయవాడ మీదగా స్మగ్లింగ్ చేసుకోవచ్చని స్మగ్లర్లు భావిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎంతో ప్రధానమైన విజయవాడలో స్మగ్లింగ్ విషయంలో పలు శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఎవరికి వారు తమకెందుకులే అనే ధోరణితో వ్యవహరిస్తుండటంతో స్మగ్లర్లు తమ పనిని ఎంచక్కా పూర్తి చేసుకుంటున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలలో ఎయిర్‌పోర్టు తరహాలో బస్ స్టేషన్, రైల్వేస్టేషన్‌లో స్కానర్లు ఉన్నాయి. ఆ నగరాల స్థాయిలో ఉన్న విజయవాడలో మాత్రం స్కానర్ల ఏర్పాటుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం.

నక్షత్ర తాబేళ్లపై డీఆర్ఐ దాడితో... :

ఇటీవల విజయవాడ రైల్వే స్టేషన్‌లో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) నక్షత్ర తాబేళ్ల అక్రమ రవాణాపై దాడులు చేయడంతో మరోసారి బెజవాడ స్మగ్లింగ్ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఇతర రాష్ట్రాలకు రైళ్లలో నక్షత్ర తాబేళ్ల రవాణా అవుతున్నట్లు సమాచారం అందటంతో చెన్నై నుంచి డీఆర్ఐ బృందాలు ప్రత్యేకంగా విజయవాడ చేరుకున్నాయి. పక్కా సమాచారంతో దాడులు చేయటంతో నక్షత్ర తాబేళ్ల అక్రమ రవాణా గుట్టు బయటపడింది. డీఆర్ఐ తనిఖీలు చేసేంత వరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకుగానీ, ఇతర నిఘా వ్యవస్థలకుగానీ ఈ వ్యవహారం తెలియకపోవటం గమనార్హం. గతంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లోనే అక్రమంగా రవాణా అవుతున్న బంగారపు బిస్కెట్లను కూడా తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి.

గంజాయి రవాణా గురించి ప్రత్యేంగా చెప్పాల్సిన అవసరమే లేదు. రైల్వే పార్శిల్ సర్వీసు ద్వారా పెద్ద ఎత్తున గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. ఈ విషయం ఆర్పీఎఫ్, జీఆర్పీ, విజయవాడ నగర పోలీసులతోపాటు నిఘా వ్యవస్థలకు తెలుసు. కాని ఎప్పుడోగానీ దాడులు చేయరు. ఇక ఆసియాలోనే పెద్దదైన విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ద్వారా కూడా అక్రమ రవాణా జరుగుతోంది.

భద్రత గాలికొదిలేశారు... :

విజయవాడలోని రైల్వేస్టేషన్, బస్ స్టేషన్‌తోపాటు ప్రధాన ప్రాంతాలలో భద్రతను గాలికొదిలేశారు. ఎక్కడా సరైన నిఘా, భద్రత లేకపోవటంతో స్మగ్లర్లు తమ పనిని సులువుగా పూర్తి చేసుకుంటున్నారు. డీఆర్ఐ, కస్టమ్స్ విభాగాలు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించకపోవటం వల్లే అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులలో కొందరికి స్మగ్లింగ్ వ్యవహారం తెలిసినా పట్టించుకోవటంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడ రైల్వేస్టేషన్‌లో లగేజీ స్కానర్ల కోసం 2009లో ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు వెళ్లినా, ఇంతవరకు అనుమతి లభించలేదు. మరోవైపు విజయవాడ పీఎన్‌బీఎస్‌లోనూ లగేజీ స్కానర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతసేపు రాజకీయ ప్రయోజనాల కోసమే పాకులాడే ప్రజా ప్రతినిధులు, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు అక్రమ వ్యాపారం, రవాణా, భద్రతపై దృష్టి సారించకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైల్వేస్టేషన్, బస్ స్టేషన్‌లో ఎటు నుంచి అయినా నిఘా నేత్రాలకు చిక్కకుండా ఉడాయించే వెసులుబాటు ఉంది. దీంతో పార్శిల్ సర్వీసుల ద్వారా అక్రమంగా వస్తువులను రవాణా చేస్తున్నారు. రాజధాని నేపథ్యంలోనైనా విజయవాడలో భద్రతను కట్టుదిట్టం చేయటంతోపాటు తనిఖీలు ముమ్మరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంగళగిరి టెక్ పార్కులో భారీ అగ్నిప్రమాదం

రెండు ఐటీ కంపెనీలు దగ్ధం

విశాలాంధ్ర, మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని జాతీయ రహదారి వెంబడి వున్న ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎన్ఆర్‌టీ) టెక్ పార్కులో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో రెండు ఐటీ కంపెనీలు అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఈ అగ్ని ప్రమాదానికి కారణమై వుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ గత నెల 17వ తేదీన ఎన్ఆర్‌టీ టెక్ పార్కులో 16 ఐటీ శిక్షణా సంస్థలకు ప్రారంభోత్సవాలు చేశారు. వీటిలో ఇప్పటికే కొన్ని కార్యకలాపాలు ప్రారంభించగా మరికొన్ని సంస్థల్లో ముగింపు పనులు జరుగుతున్నాయి. నాలుగైదు ఫ్లోర్లలో ఏర్పాటవుతున్న ఐటీ కంపెనీలకు సంబంధించి కుర్చీలు,ఇతర ఫర్నిచర్ వస్తువులను గ్రౌండ్‌ఫ్లోర్‌లో తయారు చేస్తున్నారు. నిత్యం కూలీలు వచ్చి కుర్చీలను తయారు చేస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఐటీ కంపెనీలు తెరుచుకోలేదు. ఒకరిద్దరు మాత్రమే వచ్చి కార్యాలయంలో పని చేసుకుంటున్నారు.గ్రౌండ్‌ఫ్లోర్‌లో యథావిధిగా ఇద్దరు, ముగ్గురు కూలీలు వచ్చి కుర్చీల తయారీలో నిమగ్నమైవున్నట్లు బిల్డర్ తరపు ప్రతినిధులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో విద్యుత్తు బోర్డు నుంచి మంటలు చెలరేగి ప్రక్కనే వున్న కుర్చీలకు అంటుకున్నట్లు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సందర్భంలో ప్లాస్టిక్, సింథటిక్ మెటీరియల్‌తో తయారు చేస్తున్న షుమారు 200 కుర్చీలు వున్నాయి. గాలి తీవ్రత ఎక్కువగా వుండటంతో క్షణాల్లో మంటలు వ్యాపించి ఎగువ వున్న మొదటి అంతస్తును తాకాయి.అక్కడి నుంచి విద్యుత్ లైన్లు, పైపులైన్ల గుండా రెండవ అంతస్తుకు మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగినట్లు గుర్తించిన మిగతా బ్లాకులోని సిబ్బంది కూడా భయంతో పరుగులు తీసారు.స్థానికులు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ కావడంతో అన్ని గదులను అద్దాలతో మూసివేశారు. ఎటునుంచి లోపలకు వెళ్లాలో ఫైర్ సిబ్బందికి తెలియక తడబాటుకు గురయ్యారు. లోపలి నుంచి మంటలు, పొగ బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది.దీంతో అద్దాలను పగులగొట్టి లోపలకు వెళ్లారు.అప్పటికే వేడి తీవ్రత, పొగ ఎక్కువగా ఉండటంతో పోలీసులు బయట నుంచి స్థానికుల చేత రాళ్లతో అద్దాలను పగులగొట్టించారు.దీంతో కొద్దిగా ఉపశమనం లభించింది. మూడవ అంతస్తులోకి కూడా మంటలు వ్యాపించినప్పటికీ పెద్దగా నష్టం వాటిల్లలేదు. మొదటి అంతస్తులో ఉన్న దార్విజెంట్ ఇంటిలిజెన్స్ ఇన్‌స్పైర్డ్, మూడవ అంతస్తులో ఉన్నయఅద్వైత్ అల్గారిథమ్ కంపెనీలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. ఫర్నిచర్, సీలింగ్, కంప్యూటర్లు, ఏసీలు ఇతర పరికరాలు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక పరికరాలు ఉన్నప్పటికీ వాటికి ఎక్కడా కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో స్మోక్ సెన్సార్లు, స్ప్రింక్లర్లు తదితర పరికరాలు పనిచేయలేదు. ఆస్తినష్టం సంగతి అటుంచితే ఏళ్ల తరబడి దాచుకున్న కంప్యూటర్ డేటా కోల్పోయామని ఐటీ కంపెనీల ప్రతినిధులు వాపోయారు.రావులు తమ సిబ్బందితో కలసి మంటలను అదుపు చేశారు.

లోతుగా విచారణ చేపడతాం... అర్బన్ ఎస్పీ విజయారావు

ప్రమాదానికి గల కారణాలపై లోతుగా విచారణ చేపడతాం. విద్యుత్ షార్ట్ సర్క్యూటా, లేక ఇతరత్రా కారణాలేమైనా వున్నాయా అనేది విచారణలో తేలుతుంది.సీసీ కేమేరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు చేపడతాం.దర్యాప్తు అనంతరం ప్రమాద కారణాలను వెల్లడిస్తాం. ఆస్తినష్టం వివరాలను సంబంధిత శాఖ ప్రకటించాల్సివుంది.



కనెక్షన్లు లేకపోవడంతో భారీ నష్టం... రీజినల్ ఫైర్ అధికారి, మురళీ మోహన్

అగ్నిమాపక శాఖ తరపున ఎన్ఓసీ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ సేఫ్టీ ప్రికాషన్స్ పూర్తయిన తరువాత మరో సర్టిఫికెట్ తీసుకోవాల్సి వుంది.ప్రస్తుతం అగ్నిమాపక పరికరాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.ఫైర్ సేఫ్టీ కనెక్షన్లు లేకపోవడంతోనే భారీ నష్టం వాటిల్లింది. స్మోక్ సెన్సార్లు, స్ప్రింక్లర్లు సకాలంలో పని చేయలేదు. భవనం మొత్తం అద్దాలతో మూసివేయడంతో లోపలికి ప్రవేశించడం కష్టతరమైంది. అద్దాలు పగులగొట్టి ఫైర్ సిబ్బంది ఆస్తినష్టాన్ని తగ్గించగలిగారు.

టెక్నాలజీలో మనమే ఫస్ట్

(మొదటిపేజీ తరువాయి)

సౌకర్యం, 21 రోజుల్లో పరిశ్రమలకు అనుమతి లాంటివి అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర జనాభా మొత్తం 4.37 కోట్లు కాగా ఇందులో 2.23 కోట్లు పురుషులు, 2.11 కోట్లు స్త్రీ జనభాగా ఉందన్నారు. ట్యాంపరింగ్‌కు ఏమాత్రం అవకాశంలేని పన్నెండెంకల 28818224703 నెంబర్‌ను భూఅధార్ యూనిక్ నెంబర్‌గా పరిచయం చేశామన్నారు. ఈ సదస్సులో దేశ విదేశాల నుంచి హాజరైన కార్బన్ క్లీన్ సొల్యూషన్ లిమిటెడ్ కో ఫౌండర్, సీఈఓ ప్రతీఖ్‌బంబ్, సోలామ్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఫౌండర్ నితిన్ సిసోడియా, నెదర్లాండ్స్ ప్లాంట్ సీఈఓ మార్జోలిన్, హెల్డర్ ఫిన్ లాండ్ లేట్నీయర్ ఇంక్ కో ఫౌండర్ ఫీటర్, వెస్తార్‌బాకా ఐర్లాండ్ సెట్‌సీ ఫౌండర్ సీఈఓ రోబోలెస్లీ తో పాటు సిబత్రాదాస్, అమిత్ నారాయణ్ వంటి ప్రముఖులను ముఖ్యమంత్రి ఈసందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి సురేష్‌ప్రభు, రాష్ట్ర మంత్రులు పత్తిపాటి పుల్లారావు, అచ్చెన్నాయుడు, నారాలోకేష్‌లతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు లేనట్లే?

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందేమోనని నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ ఏడాది కూడా ఎన్నికలు ఉండకపోవచ్చనే సంకేతాలను ప్రభుత్వం ఇచ్చేసింది. 2014 మార్చిలో రాష్ట్రంలోని విజయవాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, కడప, నెల్లూరు, చిత్తూరు అనంతపురం కార్పొరేషన్‌లతోపాటు 92 మున్సిపాల్టీలు, నగర పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. వీటికంటే ముందే గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉంది. కొత్తగా ఆవిర్భవించిన కార్పొరేషన్‌లలో సమీప గ్రామాల విలీనంపై కొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో పలు కార్పొరేషన్‌లలో ఎన్నికలపై కోర్టు స్టే ఇచ్చింది. దీంతో ఆయా కార్పొరేషన్‌లలో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అనేకే సంవత్సరాలుగా అధికారుల పాలనపై రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ఎన్నికలను నిర్దిష్ట కాలానికే నిర్వహిస్తున్న ప్రభుత్వం, స్థానిక సంస్థల విషయంలో మాత్రం రాజకీయజోక్యం, కోర్టు కేసులతో వాయిదా వేయటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. తాము గెలిచే అవకాశం లేదనే ఉద్దేశంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీయే ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోంది. గత ఏడాది కాకినాడ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించటంతో, తమ కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరుగుతాయని అన్ని పార్టీల నేతలు భావించారు. అయితే కోర్టు కేసులు, ఎన్నికల నిర్వహణపై ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపాదనతో, ఆ నాలుగు కార్పొరేషన్‌లతోపాటు పలు మున్సిపాల్టీలకు ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపించటంలేదు. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది. అదే సమయంలో ఈ నాలుగు కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని మున్సిపల్‌శాఖ మంత్రి పీ నారాయణ 'విశాలాంధ్ర'కు చెప్పారు. స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ఏడాదిలో ముగుస్తుందని, ఆ తర్వాత అన్నింటికీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. సాక్షాత్తు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణే ఎన్నికలు ఉండవని స్పష్టం చేయటంతో విశాఖ, గుంటూరు, తిరుపతి, ఒంగోలులోని రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇదిలావుండగా, ఎన్నికలనాటికి కోర్టు కేసులు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి నారాయణ తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఆశాఖమంత్రి కిమిడి కళా వెంకట్రావు హామీ ఇచ్చినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. కార్మికులు ఈనెల 20వ తేదీ నుంచి తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న దృష్ట్యా వారి సమస్యలపై మంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. ఈవిషయమై సోమవారం అధికారులతో మాట్లాడి కార్మికులతో చర్చలు జరుపుతామని, చర్చల ద్వారా కాంట్రాక్టు కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని రామకృష్ణ పేర్కొన్నారు.

ఆక్వా జోన్ల జీవో 8 రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆక్వా జోన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు-8ను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అధికంగాను, కోస్తా జిల్లాల్లో యధేచ్ఛగాను కొనసాగుతున్న చెవరుల తవ్వకాలను ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవట్లేదని ఎద్దేవా చేశారు. చట్ట విరుద్ధంగా ఏర్పాటైన కాలుష్య కారక రొయ్యల చెరువులను ధ్వంసం చేయాలని ఆయన డిమాండు చేశారు. కోస్తా జిల్లాల్లో అక్రమ ఆక్వా చెరువులతో వేలాది గ్రామాల్లో కాలుష్యం విపరీతంగా పెరుగుతోందని, ప్రజలు తాగడానికి నీరులేకుండా పోయిందని పేర్కొన్నారు.



జెండాలు కాదు.. హోదా ఎజెండాతో ముందుకు

కేంద్రం మెడలు వంచి హోదా సాధించాలి

ముప్పాళ్ళ నాగేశ్వరరావు

విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విభజన చట్టంలో పొందు పరిచిన హామీల అమలు సాధనకోసం పార్టీల జెండాలతో కాకుండా ఒకే ఎజెండాతో (హోదా) రాజకీయాలకు అతీతంగా పోరాడాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులో ఎపికి ప్రత్యేక హోదా విభజన చట్టంలో హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సాధన సమితి జిల్లా అధ్యక్షులు సంషేర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ మాట్లాడుతూ హోదా విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 5 కోట్ల ఆంధ్రులను మోసం చేశారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీకి హోదా అవసరమని చెప్పడం అభినందనీయమన్నారు. అయితే రాజకీయ ఎజెండాతో కాకుండా తెలుగు ప్రజల ప్రయోజనంకోసం ఉద్యమంలోకి కలిసి రావాలని కోరారు. కేంద్ర బడ్జెట్ తరువాత అన్ని వర్గాలలో హోదాకోసం ప్రజా ఉద్యమం రావడం శుభ పరిణామం అన్నారు. రాష్ట్ర విభజన నుండి గడిచిన నాలుగేళ్ళలో సీపీఐ హోదాకోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న విషయం గుర్తు చేశారు. దీనిలో భాగంగానే ఈనెల 8న వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతం అయ్యిందన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలో బంద్‌లో పాల్గొనడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుండి హోదా ఉద్యమం ఢిల్లీకి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. ఈనెల 1న గుంటూరులో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈనెల 6, 7, 8న ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చామన్నారు. ప్రకాశంజిల్లాలో 2, 3న మండల కేంద్రాలలో నిరసన దీక్షలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాజకీయ ప్రయోజనాలు కాకుండా ప్రజల ప్రయోజనాలకోసం అన్ని రాజకీయపార్టీలు ముందుకు వచ్చి అవసరమైతే ప్రధామంత్రి నరేంద్రమోడి ఇంటిని, పార్లమెంట్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఏది ఏమైనా బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపే ఏపీకి ప్రత్యేక హోదా విభజన చట్టంలో పొందుపర్చిన అంశాలను సాధించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమయం ఒక నెల మాత్రమే ఉందని, హోదా ఉద్యమం గ్రామస్థాయి నుండి ఢిల్లీ వరకు తీసుకెళ్ళి కేంద్ర మెడలు వంచి హోదా సాధించాలని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపియం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర నాయకులు క్రాంతి కుమార్, జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు, రంగా కిసాన్ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ళ వెంకటేశ్వర్లు, చుంచు శేషయ్య, ప్రముఖ న్యాయవాది హనుమారెడ్డి, సిపిఐ నాయకులు ఎస్‌డి సర్దార్, ఆర్ వెంకట్రావు, ఆందే నాసరయ్య, వి హనుమారెడ్డి, కె వీరారెడ్డి, ఎస్‌డి మౌలాలి, కాసీం పీరా తదితరులు పాల్గొన్నారు.

'రూసా' ఏపీ ప్రాజెక్టు డైరెక్టరుగా హరిప్రసాదు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేసిన రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ (రూసా) స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరుగా కూనపరెడ్డి హరిప్రసాదును ప్రభుత్వం నియమించింది. ఈయన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు (ఐఐఎస్) బ్యాచ్-1991కు చెందిన అధికారి. సర్వశిక్ష అభియాన్ తరహాగా రూసా పనిచేస్తుంది.ఏడో తరగతి వరకూ విద్యను రూసా మెరుగు పరుస్తుంది. దేశ వ్యాప్తంగా విద్యను మెరుగు పరిచేందుకుగాను కేంద్ర ప్రభుత్వం రూసాను రూపొందించింది.వృత్తి రీత్యా అధికారి అయిన హరిప్రసాద్ 20 పుస్తకాల వరకూ రచించారు.దేశ వ్యాప్తంగా పలు కళాశాలల్లో సదస్సులు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకాశం జిల్లాలో సోపిరాల గ్రామంలో జన్మించిన ఈయన 1991లో యూపీఎస్సీ ద్వారా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసుకు ఎంపిక య్యారు. సర్వీసులో అధిక శాతం ఉత్తరభారత దేశంలో సేవలందించిన హరిప్రసాద్..నేటి నుంచి ఏపీ ఉన్నత విద్యాశాఖలో విధులు నిర్వహించనున్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ

రాజకీయ పార్టీల ప్రకటన



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని వామ పక్షాలు, వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్, జనసేన పార్టీలు ప్రకటించాయి. న్యాయసమ్మతమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంఘీభావంతో పాటు సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలిపాయి. ఇప్పటికైనా ప్రభుత్వం భేషజాలకు పోకుండా జాయింట్ యాక్షన్ కమిటీతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరాయి. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె రామకృష్ణ, పి మధు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల విషయంలో ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని జనవరిలో కార్మికులందరూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిస్తే 20 రోజుల సమయం కావాలని కోరారని, అయితే ఇప్పటి వరకూ పరిష్కరించలేదని తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సుమారు 24 వేల మంది కార్మికులు 20వ తేదీ నుండి సమ్మెలోకి దిగారన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం దానికి కారణమైన కార్మికులకు మాత్రం న్యాయబద్ధంగా వేతనం ఇవ్వడం లేదన్నారు. ఔట్‌సోర్సింగ్ పేరుతో కార్మికులకు ఇస్తున్న జీతంలో 43 శాతం కాంట్రా క్టర్లకు దోచి పెడుతున్నారని, అదే నేరుగా కార్మికులకు చెల్లిస్తే వచ్చే నష్టం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇంతవరకు రాష్ట్రంలో కనీస వేతనాలు బోర్డు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆదేశాలిచ్చినా ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావుకు విద్యుత్‌శాఖపై ఏ మాత్రమూ పట్టులేదన్నారు. ముఖ్యమంత్రి అన్నీ తానై చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసుత్తం సీఐఐ సదస్సులు నిర్వహిస్తున్న విశాఖపట్నం హుద్‌హుద్ తుఫానులో పూర్తిగా దెబ్బతింటే ఇదే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ప్రాణాలకు తెగించి రెండు రోజుల్లో పనులు చేసి విద్యుత్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికుల వల్లే అది సాధ్యమైందని కితాబిచ్చిన చంద్రబాబు, ఇప్పుడు వారిని పట్టించుకోకపోవడం దారుణ మన్నారు. టీడీపీ ప్రభుత్వం కేవలం వ్యాపార దృక్పథంతో పనిచేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వ చర్యలతో కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు నిరసన ప్రదర్శనలకు పిలుపు నిచ్చారని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే రాజకీయపార్టీలు ప్రత్యక్ష కార్యాచరణ చేపడతాయని వారు హెచ్చరించారు. వైసీపీ నాయకుడు వెల్లంపల్లి శ్రీనివాస్, జనసేన నాయకుడు పోతిన వెంకట మహేష్ ప్రత్యక్ష కార్యాచరణకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఇంకా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పొలారి, రామారావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు హరినాథ్, ఎంసీపీఐయూ నాయకుడు గొల్లపూడి ప్రసాదు, ఫార్వార్డ్‌బ్లాక్ నేత పీవీ సుందరరామరాజు, సీపీఐ (ఎంఎల్) నేత గుర్రం విజయకుమార్, ఆర్ఎస్పీ నాయకులు జానకిరాములు మాట్లాడారు.

లూలూమాల్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం

అఖిలపక్ష సమావేశంలో వక్తలు



విశాలాంధ్ర- విశాఖపట్నం : ప్రభుత్వం విశాఖలో విలువైన స్థలాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి లూలూ మాల్‌కు దొడ్డిదారిలో శంకుస్థాపన చేయడమే నిదర్శనమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెం కృష్ణాకాలజీ రోడ్డులో గల వైసీపీ కార్యాలయంలో వైసీపీ, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేవీఎస్ఎన్ మాట్లాడుతూ లూలూమాల్ శంకుస్థాపన ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కార్యక్రమాల షెడ్యూల్‌లో లేకపోయినా ప్రతిపక్షాలకు భయపడి సమ్మిట్ వేదికలోనే హడావిడిగా శంకుస్థాపన చేయడంలో అంతర్యమేమిటన్నారు.

ఈ భూ దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పోరాడుతాయని, దీని నిర్మాణాన్ని అడ్డుకుంటామని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఈ భూమిలో కార్పొరేట్‌లకు మేలుచేసే మాల్, స్టార్ హోటల్స్ నిర్మాణాలు ఎవరికోసమన్నారు. సేకరించిన భూమికి రెండు రెట్లు భూమి ఇవ్వడం, నగరంలో ఆరు చోట్ల విలువైన భూములను వ్యాపారులకు కట్టబెట్టడం చూస్తుంటే ఈ ప్రభుత్వానికి భూ దాహం ఎంత ఉందో అర్థమవుతుందన్నారు. రైతులు, సామాన్య ప్రజల నుంచి భూసేకరణ చేస్తే అరకొర పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వం భూమి కోల్పోయిన వారికి భూమి ఎక్కడైనా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. ఏపీఐఐసీ భూమి పక్కనే ఉన్న 3.40 ఎకరాలు తీసుకొని వారికి రెండు రెట్లు భూమి ఇవ్వడం భూ దోపిడే నన్నారు. లూలూ మాల్ నిర్మాణం ప్రారంభమైతే అఖిలపక్ష పార్టీలన్ని కలిపి అడ్డుకుంటాయన్నారు. వైసీపీ నగర అధ్యక్షులు మళ్ల విజయ్‌ప్రసాద్ మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లూలూ సంస్థతో లాలూచీపడి హుటాహుటిన శంకుస్థాపన చేసిందని అన్నారు. రూ. 160కోట్లతో నిర్మించే ఎన్ఏడి ఫ్లైఓవర్ శంకుస్థాపనకు హడావుడి చేసిన ముఖ్యమంత్రి వేలకోట్లతో నిర్మించే లూలూ మాల్ శంకుస్థాపన ఎందుకు దొడ్డిదారిలో చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. సీపీఎం నాయకులు కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం విలువైన ప్రభుత్వ భూములను అభివృద్ధి పేరిట దారాదత్తం చేస్తుందనడానికి నిదర్శనం లూలూ సంస్థకు భూ కేటాయింపులేనన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నగర కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం నాయకులు కృష్ణ, వైసీపీ నాయకులు వంశీకృష్ణ, కొయ్య ప్రసాద్‌రెడ్డి, పసుపులేటి ఉషాకిరణ్, కోలా గురువులు పాల్గొన్నారు.

సహకరించకుండా సమస్యలు సృష్టిస్తున్నారు

అమరావతిని దేశానికి రెండో రాజధానిగా ప్రకటించాలి

కేంద్రంపై మంత్రి పత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : విభజన హామీల అమలుకు సహకరించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి పత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. విశాఖలో ఆదివారం జరిగిన సిఐఐ సదస్సు రెండోరోజులో పాల్గొన్న పత్తిపాటి మీడియాతో మాట్లాడారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే అమరావతి నిర్మాణానికి సహకారం అందించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విభజన చట్టంలోని హామీల అమలుకు కృషి చేయాలన్నారు. అమరావతిని దక్షిణ భారతదేశంలో రెండో రాజధానిగా ప్రకటించాలన్నారు. రాయలసీమకు అన్యాయం చేస్తున్నారన్న బిజెపి నేతలపై ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబే రాయలసీమ వాసి అయినప్పుడు అన్యాయం ఎలా జరుగుతుందన్నారు. రాయలసీమ డిక్లరేషన్‌ను బిజెపి తెరపైకి తెచ్చినందున దానికి ఆ పార్టీ వాళ్లే సమాధానం చెప్పాలన్నారు. ఆ ప్రాంత అభివృద్ధికి వారే నిధులివ్వాలని, మూడున్నరేళ్లలో అన్నీ చేశామంటున్న బిజెపి నేతలు నామమాత్రపు నిధులతో ఎన్ని సంవత్సరాల్లో పూర్తి చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికీ రైల్వే జోన్ ఇవ్వలేదని, అమరావతి, పోలవరానికి నిధులు ఇవ్వలేదన్నారు. ప్రకటించిన 9 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు నిధులు విడుదల చేయలేదన్నారు. అభివృద్ధి చెందిన కర్నాటక, గుజరాత్, మహారాష్ట్రకు నిధులు ఇస్తూ, విడిపోయిన ఎపికి నిధులు ఇవ్వడం లేదు. పథకాలు ప్రకటించడమే కాకుండా వాటికి నిధులు ఇవ్వడం ఇవ్వాలన్నారు. కేంద్రం హామీల అమలు చేసిందీ లేనిదీ చూసి మార్చి 5 లోపు టిడిపి నిర్ణయం తీసుకుంటుందన్నారు.

సినీనటి శ్రీదేవి మృతికి సీఎం సంతాపం

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రముఖ సినీ నటి, అందాల తార శ్రీదేవి శనివారం రాత్రి దుబాయ్‌లో గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం ఉదయం విశాఖలోని భాగస్వామ్య సదస్సు ప్రారంభ సమయంలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, మంత్రులు, అధికారులు శ్రీదేవి మృతికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గొప్ప నటిని తెలుగు ప్రజలు కోల్పోయారని, ఆమె మరణం రాష్ట్రానికి తీరని లోటన్నారు. బహుముఖ నటిగా దేశ ప్రజలను అన్ని భాషల్లో అలరించిన నటీమణి శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

రఘువీరారెడ్డి సంతాపం

అమరావతి:నటి శ్రీదేవి మరణం సినీలోకానికి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతిచేకురాలని కోరుకుంటున్నట్లు పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు.నటి శ్రీదేవి మృతికి సంతాపం, ఆమె కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టెట్ పేపర్-2 పరీక్షలు ప్రారంభం

ఐదో రోజు తగ్గిన హాజరు శాతం -87.99శాతం మంది హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పేపర్-2 పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి.ఈ నెల 21 తేదీ నుంచి 24 వరకూ టెట్ పేపర్-1(ఎస్‌జీటీ) పరీక్షలు కొనసాగాయి. ఈ పరీక్షలకు దాదాపు 92శాతానికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఐదోరోజు ప్రారంభమైన పేపర్-2 పరీక్షలకు హాజరుశాతం తక్కువగా కన్పించింది. పేపర్-2 పరీక్షలకు తొలిరోజు ఉదయం సెషన్లో 19,825 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 16,884 (85.17శాతం)మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్లో 18,537 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 16,682 మంది(89.99శాతం) పరీక్ష రాశారు.రెండు సెషన్లు కలిపి పేపర్-2 పరీక్షలకు మొత్తంగా 38,362 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 33,566 (87.99శాతం) అభ్యర్థులు హాజరైనట్లు ఏపీ టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఏపీ టెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, ఆన్‌లైన్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

శ్రీసిటీలో రూ.3500 కోట్ల పెట్టుబడులు

భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో 14 కంపెనీలు ఒప్పందం

4వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు



విశాలాంధ్ర-తడ : శ్రీసిటీలో రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 14 కంపెనీలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఆదివారం ఒప్పందం చేసుకున్నాయి. విశాఖ పట్టణంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే తలారి ఆదిత్య, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సమక్షంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు అవగాహనా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులున్న శ్రీసిటీ తమ వ్యాపార గమ్యంగా వివిధ కంపెనీలు ఎంపిక చేయటం గర్వకారణమని అన్నారు. ఈ నూతన పెట్టుబడుల వలన మరిన్ని ఉపాధి అవకాశాలు వస్తాయని, తద్వారా ఆ ప్రాంతంలో ఆర్థికాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ 14 కంపెనీలలో 3 చైనా, 3 అమెరికా, 2 జపాన్, ఒకటి సింగపూర్ దేశాలకు చెందినవి కాగా మిగిలినవి మనదేశానికి చెందినవన్నారు.



విద్యుత్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్మికులు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు ప్రభుత్వం దిగిరావాల్సిందేనని పీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి అన్నారు. నగరంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన అందోళనకు రఘువీరారెడ్డి ఆదివారం మద్దతు తెలిపి మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. పక్క రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నా రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమం పట్టడంలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నా విద్యుత్ శాఖ మంత్రి కార్మికులతో చర్చలు జరపకుండా నియంతలా వ్యవహరించడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, నాయకులు ఎస్‌బాలపెద్దన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటా సత్యం, కేవీ రమణ, నాగరాజు, సీపీఎం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈ.నాగరాజు, ఈఎస్ వెంకటేష్, నాయకులు నాగమణి, గోపాల్, వెంకటనారాయణ, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం నాయకులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ సమ్మెలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు నాగార్జున, సూర్యనారాయణ, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలతో చెలగాటాలొద్దు

- హోదా ఇవ్వకపోతే బాబు, మోడీ గద్దెలు కూలడం ఖాయం
- బాప్ సభలో వక్తలు
- ఆందోళనకారుల అడ్డగింపు, ఉద్రిక్తత



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అలా కాకుండా ప్రజలను మరోసారి మోసం చేయడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పలువురు నేతలు హెచ్చరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేస్తూ బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్) అధ్వర్యంలో అదివారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద బాప్ అధ్యక్షులు పి.గౌతంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వీవీఆర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు సంఘీభావం తెలపడానికి విచ్చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదా రాకపోతే రాష్ట్రంలో టీడీపీ, కేంద్రంలో బీజేపీ ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ప్రత్యేహోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, హోదా విషయంలో చంద్రబాబు ఇంకా నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కేవలం ముడుపులకోసమే ఆనాడు ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించారని అయితే నిధుల దుర్వినియోగంపై కేంద్రం దృష్టి సారించడంతో మళ్లీ ఆయన ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతున్నారని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ హోదా కోసం త్వరలో ఢిల్లీలో జరిగే ధర్నాలో ఆంధ్రుల సత్తా ఏమిటో చూపిస్తామని చెప్పారు. హోదాకోసం జరుగుతున్న పోరాటంలో బాప్ వంటి ప్రజా సంఘాలు కీలక పాత్ర వహించాలన్నారు. రాష్ట్రాన్ని విభజించి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగు ప్రజలకు ద్రోహం చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం , భారతీయ జనతా పార్టీలు ఆంధ్ర ప్రజలకు తీరని అన్యాయం చేశాయన్నారు. కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వకపోగా ప్యాకేజీ విషయంలో కూడా రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన అన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించేందుకు అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగుతున్నామన్నారు. శాసనమండలి సభ్యుడు బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందన్నారు. గౌతంరెడ్డి, కృష్ణంరాజు మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు టీడీపీ, బీజేపీలకు ఓట్లు వేశారని అయితే ఈ రెండు పార్టీలు ప్రజలను దారుణంగా వంచించాయన్నారు. చంద్రబాబు పెట్టుబడుల కోసం 18 సార్లు విదేశీ యాత్రలు, మూడుసార్లు భాగస్వామ్య సదస్సులు నిర్వహించినా ప్రయోజనం లేకపోయిందని అంటూ వ్యాపార, పారిశ్రామిక వేత్తలతో కూడిన టీడీపీలో వంద కోట్లకు పైగా ఆస్తులు ఉన్న నాయకులు సుమారు 750 మంది ఉన్నారని వారితో ముందుగా సమావేశాలు పెట్టిఉంటే వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చి ఉండేవన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో పోలీసులు బైక్ ర్యాలీని అడ్డుకోవడంతో కొద్ది సేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు కె.సుబ్బరాజు, గఫూర్, సీపీఎం నాయకులు వై.వెంకటేశ్వర రావు, ముస్లింఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జలీల్, బ్రాహ్మణ సమాఖ్య గౌరవాధ్యక్షుడు, టీవీకేఎస్ శాస్త్రి, దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నత్తా నాగేశ్వరరావు, కార్మిక నాయకుడు దుర్గారావు, అమరావతి అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నీలం దుర్గారావు, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నీలం స్వరూపారాణి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, మారుతీ మహిళా సంఘం అధ్యక్షురాలు లక్కంరాజు సునీత, వెనుకబడిన తరగతుల సంఘం ప్రధాన కార్యదర్శి టీ. చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ల యజమానులకు ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ : సినిమా థియేటర్లలో ప్రదర్శించే ప్రకటనలకు సీబీఎఫ్‌సీ సర్టిఫికేషన్ ఉండాలన్న నిబంధనను తొలగించాలని థియేటర్ల యాజమాన్యాలు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం తోసిపుచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం సినిమాలు, సినిమాల ట్రైలర్లు, ప్రకటనలు, ప్రజా సేవా సందేశాలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) సర్టిఫికేట్ జారీ చేయవలసి ఉంటుంది. ఈ సర్టిఫికేట్ జారీ అయిన తర్వాత మాత్రమే వీటిని థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఉంటుంది. అయితే ప్రకటనలను టెలివిజన్‌లో ప్రసారం కోసం సర్టిఫై చేస్తారని, వాటికి మరోసారి సీబీఎఫ్‌సీ సర్టిఫికేషన్ అవసరం లేకుండా చేయాలని థియేటర్ల యాజమాన్యాలు కోరాయి. ఈ విజ్ఞప్తికి కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. కానీ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మాత్రం ఈ విధానం కొనసాగాలని తెలిపింది.

సాహితి

ఒక స్వదేశీ ప్రవాసి కన్నీటిలేఖ

ఎస్. హనుమంతరావు, ✆ : 88978 15656

సాహిత్యం కొందరికి కాలక్షేపపు బఠానీ. కాని జీవితాన్ని సీరియస్‌గా తీసుకునేవాళ్ళకి సాహిత్యం జీవితంతో సమానం. వేరుసెనగసాగు నేపథ్యంగా తన ప్రాంత జీవితాన్ని 'వొరుప్పోటు' దీర్ఘకవితగా రాసిన శ్రీ యాములపల్లి నరసిరెడ్డి లాంటి వారికి సారస్వతం ఒక సీరియస్ వ్యవహారం. అది బతుకుకు అసలు సిసలు నకలు.

కరువుకాటుకి తరచు గురిఅయ్యే అనంతపుర ప్రాంత అనంత విషాదాన్ని కవితావస్తువుగా ఈ కవి స్వీకరించడం లోనే తన ప్రాంత సమస్యలపట్ల ఆయన నిబద్ధత తెలుస్తుంది.

నగరాల్లో ఉండే వారికి వేరుసెనగ అంటే ఏ సాయంత్రమో బజార్లో వేడి వేడి వేరుసెనగ గింజల్ని కొనుక్కుని పొట్టు ఊదుకుంటూ తినడం లేదా బెల్లంతో చేసిన పల్లీ లడ్డూల్ని తినడం వరకే తెలుసు. వేరుసెనగ వెనుక ఉన్న బతుకుసెగ తెలియాలంటే ఈ కావ్యం చదివితీరాలి.

తన ప్రాంత భూములకు, వాతావరణానికి అనువైన పంట వేరుసెనగ అని చెబుతాడు కవి. బహుశా అందుకే కాబోలు ప్రభుత్వం జాతీయ నూనెగింజల పరిశోధనా సంస్థని అనంతపురంలో స్థాపించింది. ఈ సంస్థలోనే ప్రఖ్యాత సాహితీవేత్త డా. సర్దేశాయి తిరుమలరావు శాస్త్రవేత్తగా పనిచేశారు.

తన జీవితాలతో పెనవేసుకుపోయిన సెనక్కాయ గురించి చెబుతూ కవి 'ఏడాది పొడుగునా.. వస్తుమార్పిడి కవ్వే, శిస్తులు కట్టడానికవ్వే, పిల్లలు కవ్వే... పెండిండ్ల కవ్వే, పండుగలకవ్వే... సద్దిగంపలకవ్వే... తద్దినాల కవ్వే, కల్పతరువుగా... గెలుపుగుర్రాలుగా ఊరి వైభోగంలో ముఖ్య భూమిక పోషిస్తూ అవ్వే...అవ్వే..' అని అంటారు. మరోచోట 'మాకు చెనిక్కాయ అంటే చేతికందొచ్చిన పెద్ద కొడుకన్నట్టు' అని చెబుతారు.

వేరుసెనగసాగులో రానురాను వచ్చిన మార్పుని సూచిస్తూ 'స్థూలకాయుల్లా వాకిలిపట్టకుండా ఉన్న మూటలు, చేతిసంచులవుతూ' అంటారు కవి.

'ఆ నోట... ఈ నోట.. చెనిక్కాయల ఘనత కాస్తా, ఎడారి చెవినపడినట్టుంది' అని పగబట్టిన ప్రకృతి గురించి ప్రస్తావిస్తారు. ఈ సందర్భంలో ప్రకృతి గురించి చెబుతూ 'శీతకన్నుని పెద్దది చేసింది' అని కవి చక్కటి ప్రయోగం చేశారు.

ఆ ప్రాంత కర్షకుల దయనీయ స్థితిని చెబుతూ 'సందుల మార్చి తిరిగినా నక్షత్రకుల్లా... వెంటబడే చెప్పు దెబ్బల్లాంటి అప్పులోల్ల, అమ్మనా... బండబూతులు, కాసులకు కులమతాల్లేవు, రాల్చినోడికి వడ్డీల గుడ్లు పెట్టించి ముట్టజెప్పాల్సిందే' అని అంటారు.

అంతేకాదు పాలకవర్గపు అపసవ్య పద్ధతుల పట్ల వాటి డొల్లతనం వల్ల రైతాంగం పడే ఇబ్బందులపై కవి అక్షరాగ్రహం వెలిబుచ్చాడు. 'ఎవరైనా కళల కల్పవల్లి, సిరుల మహాలక్ష్మి మా ప్రాంతమని చెప్పుకుంటారు, కరువుల కాణాచి మా సీమ అని చెప్పుకునే దురదృష్టం మాకే పట్టింది' అని వాపోతాడు కవి మరోచోట. 'ఈ కావ్యాన్ని చదివి రైతుబిడ్డలందరికీ హృదయాల్లో అన్నం మెతుకంత అక్షరమంత చోటివ్వగలరని' పాఠకలోకాన్ని అభ్యర్థిస్తున్నాడు కవి. కవి ఆశయాన్ని నెరవేర్చే కావ్యమిది. పాఠకహృదయాల్ని కదిలించే కావ్యమిది.

అనంతపురం జిల్లాలో కొన్ని ప్రాంతాలు భవిష్యత్తులో ఎడారిగా మారే ప్రమాదం ఉందని కొందరి పర్యావరణ శాస్త్రవేత్తల భయం. ప్రకృతిని ఎదిరించడంలోనే మానవ విజయం దాగిఉంది. ఆ మానవ ప్రయత్నం అంటే.. శాస్త్ర, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయత్నాలు.. ఆ దిశగా సాగాలి. ఆ కోవలోనిదే ఈ కావ్యం అని భావించాలి. రాయలసీమ నుండి కరువు కథ లొచ్చినంత ఎక్కువగా కరువు కవిత రాలేదు. ఆ లోటుని ఈ కవి కొంతవరకు తీర్చాడు. వేరుసెనగల్ని ఉర్దూలో 'మూంపల్లీ' అని అంటారు. ఈ పదానికి అర్థం 'రత్నాల గింజ' అని. బహుశా వేరుసెనగ పొట్టు ఎర్రగా ఉంటుంది. కాబట్టి ఈ పేరు వచ్చి ఉంటుంది. ఒకప్పుడు రతనాల్ని బజార్ల కుప్పలుగా పోసి అమ్మితే రాయలసీమలో మళ్లీ ఇబ్బడిముబ్బడిగా వేరుసెనగ సాగి, కర్షకలోకానికి ఊరట లభిస్తే, రత్నాలసీమ అన్న పేరు రాయలసీమకి మరోరకంగా సార్థకమవుతుంది.



వేయించిన వేరుసెనగ పలుకుల్లా అనంతపుర మాండలిక పదాలు సహృదయ రసనకి రసగుళికల్లా రుచిగుళికల్లా తగులుతూనే ఉంటాయి కావ్యం నిండా. 'రాజినుక పోజినుక' (వచ్చే పోయే చినుకులు), 'అడ్డాదు' (అటూ ఇటూ తిరగడం), 'బొమ్మిడీలు' (కష్టాలు) కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఒకచోట కవి 'పచ్చటి ఉత్తర్వు' అని చక్కటి ప్రయోగం చేశారు. అంటే 'గ్రీన్ జీవో' లేదా 'గ్రీన్ ఫర్మానా' అన్న మాట.

ఈ కవిలో ఒక లోపం ఉంది. అది ఉపమానాలు శరపరంపర... పోలికల ఉప్పెన... ఇది కవితలో అందగించదు. మోతాదు మించితే మొదటికే మోసం. మహా రచయిత రావిశాస్త్రిగారే ఈ విషయంలో విమర్శ ఎదుర్కొన్నారు. ఈ కావ్యంలో చాలా వాక్యాలు 'అన్నట్టు' అన్న పదంతో ముగుస్తాయి. దీనివల్ల విసుగుపుట్టే అవకాశం ఉంది. కవితా చరణం చర్వితచరణం కారాదు. ఈ విషయంలో కవి జాగ్రత్త పడాలి.

దీర్ఘకవిత విషయంలో ఒక ప్రమాదముంది. కవికి ప్రతిభ లేకపోతే అది తేలిగ్గా వట్టి వచనమై తేలిపోతుంది. పాఠకుడి దృష్టిలో తేలికవుతుంది. ఈ కవి ఆ ప్రమాదంలో పడలేదు.

కరువు అయినా మరేదైనా ఏకరువు పెడుతూ పోతే అది సాహిత్యమవదు. సోది అవుతుంది. వస్తు శిల్పాలు సమతూకంగా కుదిరినపుడే పాఠక హృదయం పరవశమవుతుంది, పశమవుతుంది. ఈ కవి కాఫీ,చికోరిల ఫర్‌ఫెక్ట్ బ్లెండ్‌లా చక్కటి చిక్కటి కవిత్వాన్ని అందించి పాఠకులలో కరుణ రసోత్పత్తిని సాధించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కావ్యాలు ఈయన కలం నుండి వస్తాయని ఆశిద్దాం.


కవిత ముగిసేసరికి ఇది పాఠకులకి కవి రాసిన లేఖ అని తెలుస్తుంది. కవి తనని తాను 'స్వదేశ ప్రవాసి'గా సంబోధించుకున్నాడు. తెలంగాణాలో పాలమూరు ప్రాంతంలా అనంతపురంలో వలసలు ఒక విషాదం. కరువుదెబ్బకి ఇళ్లూ, వాకిళ్లూ వదిలి దేశాలు పట్టిపోయిన వారికి ప్రాతినిధ్యం వహిస్తూ కవి ఈ కవితని నిర్వహించాడు. ఈ కావ్యం ముగియగానే ఒక వేడి నిట్టూర్పు, గుండెల్ని పిండే విషాదం చదువరిలో కలగడం ఖాయం. ఆ రకంగా కవి విజయం సాధించాడు. శ్రమజీవులకై రాసిన ఈ కావ్యం శ్రమజీవులకే అంకితం ఇవ్వడం ఎంతో ఔచిత్యాన్ని సంతరించుకున్నది. ✪

వొరుప్పోటు-యాములపల్లి నరసిరెడ్డి
పేజీలు:68, వెల :50/-
ప్రతులకు: కె. చంద్రకళ, 7/144, చాకర్లపల్లి-515 122
సోమందేపల్లి, అనంతపురంజిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్: +91 96037 59059,

సహృదయ సాంగత్యం 'జీవన మకరందం'

"గోడలు మనుషులను విడదీస్తాయని, వంతెనలు మాత్రమే కలుపుతాయని మనసావాచా నమ్మడమే కాదు. ఆచరించడానికి ప్రయత్నించేవాడిని, ఆస్తులు సంపాదించుకొన్న వారికంటే అప్పులను సంపాదించుకొన్నవారే చాలా గొప్పవారు" అనే మాటలు పరిపూర్ణంగా నివసించేవారిని అంటారు హర్షవర్ధను గారు. ఇన్నాళ్ళకిలా అను ముందు మాటలో.

ప్రతి వ్యక్తికి స్మృతులుంటాయి. ఆయా స్మృతులు తలపునకు వచ్చినపుడు మందార మకరందంగా ఉంటాయి. ఆ మకరందమే అనుభూతి. ఆ అనుభూతే ఆనందం. దీనికంటే మించినదేదీ లేదు. రచయిత రచనను చదువుచున్నంతసేపు మైమర వలసిందే. అనుభూతి రేఖలు వలయంగా ఏర్పడి మనసును మువ్వగాపాలుని పదాలుగా రంజిల్లి రవళిస్తాయి.



ధర్మరాజుకు ధర్మాత్ములు కనబడి నట్లుగా హర్షవర్ధనుగారికి ఆయన మెచ్చు కొన్న వ్యక్తులు తారసిల్లారు. ఆయా వ్యక్తుల హృదయంలో నిండి నిబిడీకృతమై ఉన్న సామాజికజీవనాన్ని అలతి, అలతి పదాలతో రసజ్ఞులైన పాఠకులను అలరించారు.

సద్గురు శ్రీ జిన్నూరు నాన్నగారితో యాదృచ్ఛికమే అయినప్పటికీ నాన్నగారితో నా పరిచయం మాత్రం దైవికమే అను ఆత్మవిశ్వాసంతో సహృదయ సాంగత్యాన్ని విడమరచి వివరించారు. చివరలో 'ఎంతో మందిని ఆధ్యాత్మిక ప్రపంచానికి దగ్గరచేసి వారిని సన్మార్గంలో నడుపుతున్న సద్గురు నాన్నగారికి పాదాభివందనాలని' త్రికరణశుద్ధిగా విన్నవించారు.

'కులాతీతమైన మానవతావాది' బాపట్ల మాస్టారు. ఆయనలో వాక్శుద్ధి ఉంది. గనుకనే ఆయనన్న మాట సత్య సమన్విత మైనది. అట్టి మహానుభావులుండటం వల్ల తెలుగునాడు వెలలేని నాడుగా వర్ధిల్లుతూంది. 'మానవ సేవయే మాధవ సేవకు సాక్ష్యం', 'పరమహంస యోగానంద నేత్రాలయం' ఈ రోజుల్లో మనం తీసికొనే ఆహారం కలుషిత మయ్యింది. దానివల్ల శారీరక రగ్మతలు వాటిల్లుచున్నాయి. అందులో కంటిజబ్బు ఒకటి. దీని నుండి విముక్తి కల్పించటానికి డాక్టరు ప్రభాకరు, డాక్టరు హరిప్రియలు ఉచిత పరీక్షలు జరిపి కనుచూపు కలిగిస్తు న్నారు. వారి వైద్యసేవ ఆదర్శవంతం.

టి.వి.రావు దాక్షిణ్యసేవాసంస్థను గుంటూరులో 1995లో స్థాపించారు. బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలను చేర్చుకొని చైతన్యం కలిగిస్తున్నారు. చేస్తున్న ఉద్యోగం నుండి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొంది సేవాతత్పరతతో సేవాసంస్థను కాపాడు తున్నారు. కష్టనష్టాలను ఎదుర్కొన్నను తొణకక, బెణకక సంస్థను శ్రద్ధతో నడుపుతూ ఆయా పిల్లల జీవితాల్లో అమృతజల్లులు కురిపిస్తున్నారు. కళాతపస్వి విశ్వనాథ్‌గారు చలనచిత్రరంగానికి దార్శనికులు. నిర్మాతలిచ్చే డబ్బునాశించక భారతీయత్వానికి వన్నెలు తీర్చిదిద్దుతూ చిత్రాలు తీశారు. వారు తీసిన ప్రతి చిత్రం కళాఖండమే. ఆచార సాంప్రదాయాలను మానవతా విలువలను కాపాడుతూ వాటి స్థానాన్ని నిరూపించారు. వారు తీసిన 'శంకరాభరణం' విశ్వనాథ చలనచిత్ర జీవితానికి ఆభరణం. ఆయన చలనచిత్ర విశ్వానికి మణిదీపం.

సురభి వారి నాటకాలు ప్రపంచానికి పౌరాణిక సామ్రాజ్యాన్ని చూపించాయి. సురభి బాబ్జి అంటే ఈ తరానికి బొత్తిగా తెలియదు. ఆ సంస్థ ఏర్పడి నూటిఇరవైఐదు సంవత్సరాలు గడిచాయి. ఇప్పటికి మారుమూల పల్లెల్లో సురభివారు నాటకాలు ప్రదర్శిస్తున్నారు. ప్రేక్షకులు వారి నాటకాలు చూసి ఆనందిస్తూనే ఉన్నారు. హర్షవర్ధనుగారు వృత్తి ఉద్యోగమైనా, ప్రవృత్తి రచనా వ్యాసంగం. ఉన్నత విద్యనభ్యసించారు. వివిధ గ్రంథాలధ్యయనం చేస్తున్నారు. ఆయా విషయాలను తమదైన శైలిలో చైతన్యస్ఫూర్తి కలిగించే స్మృతులను తెలుగు పాఠకులకు పంచిపెట్టారు. వ్యాస ప్రారంభంలో ఉపసంహారంలో ఆయా రచయితల సుభాషితాలను పేర్కొన్నారు. అవి రచనా విధానానికి మచ్చుతునక.

పుస్తకం పేరు: సహృదయ సాంగత్యం, రచయిత: హర్షవర్ధన్, పేజీలు-108, వెల: రూ॥100/- ప్రతులకు: హర్షవర్ధను, 203, చాముండేశ్వరి అపార్టుమెంట్స్, సుందర నగరు, ప్లాటునెం: 24, హైదరాబాదు-500038, సెల్: 9949992880.

గెల్లి రామమోహనరావు,
✆ : 0863-2357514

యాములపల్లి నరసిరెడ్డికి ఎక్స్‌రే అవార్డు

ఎక్స్‌రే-2017 జాతీయస్థాయి అవార్డు ప్రముఖరచయిత, సీనియర్ జర్నలిస్టు యాములపల్లి నరసిరెడ్డి (పెనుకొండ, అనంతపురం) 'భవన నిర్మాణ కార్మికుడు'కు లభించింది. విజేతను పదివేల నగదు, జ్ఞాపికతో సత్కరించడం జరుగుతుంది. ప్రధాన అవార్డుతో పాటు మరోపదిమందికి ఉత్తమ కవితాపురస్కారాలు కూడా అందజేయ బడతాయి. ఈ సంవత్సరం ఉత్తమ కవితాపురస్కారాలకు 'మాఊరి రావిచెట్టు' (హైమావతి సత్య, వేల్పూరు), 'మాయల డేగ' (పర్కపెల్లి యాదగిరి, సిద్ధిపేట), 'పశుల సుక్క' (కొండి మల్లారెడ్డి, సిద్ధిపేట), 'వీధిపుష్పం' (ఈ. రాఘవేంద్ర, రాయదుర్గం), 'కొన్ని కదలికలు' (కిలపర్తి దాలినాయుడు, సాలూరు), 'అతడు మనిషి' (మానస్ , నత్తెనపల్లి), 'కలలెగిరి పోయాక' (నిరంతర చిత్తలూరి, హైదరాబాద్), 'ఎదురుచూపు' (అమూల్య కప్పగంతు, విజయవాడ), 'అక్షరతూణీరం' (పి.వి.జి. కృష్ణంరాజు,(రసవిహారి), విజయవాడ), 'మట్టిపొరలు' (జి. నరసింహాస్వామి, నిజామాబాద్) లు ఎంపికయ్యాయి. 2017 ఎక్స్‌రే అవార్డు ఎంపికకు న్యాయనిర్ణేతగా ప్రముఖ రచయిత, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు, సాహితీ స్రష్ట పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ వ్యవహరించారని నిర్వాహకులు తెలిపారు.

కొలకలూరి సాహితీ పురస్కారం

'కొలకలూరి సాహితీ పురస్కార ప్రదానసభ' 26.02.2018 సాయంత్రం 6గంటలకు యన్.టి.ఆర్. కళాప్రాంగణం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,నాంపల్లి, హైదరాబాద్ నందు జరుగును. ఈ సభకు తమిళనాడు పూర్వ గవర్నరు గౌ.శ్రీ కొణిజేటి రోశయ్యగారు ముఖ్య అతిథిగా విచ్చేస్తారు.

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (తెలుగుశాఖ, యస్పీ మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి) అధ్యక్షతన జరిగే ఈ సభకు ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు(కామర్స్‌శాఖ, వియస్ విశ్వవిద్యాలయం, నెల్లూరు), ఆచార్య కొలకలూరి సుమకిరణ్ (ఆంగ్లశాఖ, యస్వీ యూనివర్శిటీ, తిరుపతి) గౌరవ అతిథులు.

ఈ సాహితీ పురస్కారసభలో అంకం లింగమూర్తి (హనుమకొండ), కళారత్న జీడిగుంట రామచంద్రమూర్తి (హైదరాబాద్)లకు 'కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం'తో, ఈతకోట సుబ్బారావు (నెల్లూరు), ఆదిగోపుల వెంకటరత్నం (తిరుపతి)లకు 'కొలకలూరి భాగీరథి కవితా పురస్కారంలు అందజేయబడుతుంది. కుమారి వరకాల వసుమతి శిష్యబృందం నాట్యప్రదర్శనతో సభ ప్రారంభమవుతుంది. అందరూ ఆహ్వానితులేనని సభ నిర్వాహకులు తెలిపారు.

ముందు మీలో సూర్యుణ్ణి చూసుకోండి!



మంచుతుంపర్ల జడి
తారు రోడ్డునీడలో నక్షత్ర కూటమి
చీకటి చిక్కబడినపుడు
వీధి దీపం ఒక్కటే మిణుకు మిణుకు మంటుంది
చరణాలకు కట్టిన మువ్వల సవ్వడి
గుండెల్లో వుండే పూసులకు శృతి కలిపింది
ప్రకృతి ఋతుధర్మం తప్పుతూ వుంది
అయినా। కృతులు పండిస్తూనే వుంది కదా!
చీకటి నిడివి పెరిగే కొలది నిశ్శబ్దంలో కావ్యాలసృష్టి
వారు ప్రజలకు పండుగల హోరు సృష్టిస్తున్నారు
జీవితంలో వుండే చేదుకు
తియ్యని మాత్రలు ఇస్తున్నారు
ప్రతి అనాలోచిత కార్యానికి
మూలాలు వెతుకుతున్నారు
రాళ్ళకి, రప్పలకి, చెట్లకి, చేమలకి
మనుషులను మొక్కుల రాయుళ్ళను చేస్తున్నారు
అక్షరాలు రావడం లేదా?మీరు రానివ్వడం లేదా?
అవును। మీరు తోడును ఎందుకు భగ్నం చేస్తున్నారు
ప్రేమ జంటను పవిత్రతతో మంటల్లో కాలుస్తున్నారు
కూతురును ప్రేమించడం అంటే కులాన్ని ప్రేమించడమేనా?
పుట్టిన పిల్లలను ముద్దాడుతున్నారు
పుట్టుకకుమూలమైనవాణ్ణి ద్వేషిస్తున్నారు
ప్రేమ ఓ అంతులేని ప్రయాణం
ప్రేమ జీవన సత్యం
ప్రేమ పెదాల అంచులనుండి రాదు
గుండెలోతుల నుండి వస్తుంది
ప్రేమ త్యాగధుని
ప్రేమలేని మనుష్యులు ఎండుకట్టెలు సుమా!
ఆ అమ్మాయికి సీసా చేతికిచ్చి
నడి రోడ్డులో నిలబెడుతున్నారు
ఆ గుడుంబా కాసే వీధి రౌడిని మంత్రిని చేశారు
ఆ తల్లిని బాణంతో చంపినవాడి
నమ్మినవాణ్ణి గుండెల్లో పొడిచినవాడి గాథలకు
అవార్డులిస్తున్నారు ఏ కుటిల నీతిని దేశానికి పంచుతున్నారు
యువకులకు ఏ నీతిని బోధిస్తున్నారు
భూమిని పప్పు చెక్కలా కోసి అమ్మే హక్కు మీకు ఎవడిచ్చాడు
అబద్ధ ప్రకటన అస్థిరత్వానికి ప్రతీక!
శాస్త్ర జ్ఞానాన్ని వాడుకొంటూ
పుక్కిట పురాణాలు అప్పజెప్పి బతుకుతున్నారు
అవును। ఆ పడతి వూబిలో వుంది
గొంతు దాకా దిగాక చైతన్యం వచ్చింది
ఎప్పుడైన ఒడ్డుకు రావచ్చు సుమా!
ఎవరి కోసమో బతికేవాళ్ళు తమను తామూ నిర్మించుకోలేరు
అవును ఆ స్త్రీలలో ఆత్మగౌరవం ప్రజ్వరిల్లుతోంది
వారు తమను తాము గుర్తిస్తున్నారు, సామర్థ్యానికి పదును పెడతున్నారు
నేత్రశక్తితో అన్నీ సాధిస్తున్నారు
మాటలకు భవితవ్యాన్ని సంతరిస్తున్నారు
కొండల మధ్య సెలయేళ్ళు
ఆపైన పక్షుల గుంపులు, అందులో నుంచి ఓ సంగీతం
అవును। ప్రకృతిలోని అంతస్సంబంధాలు
మనుషులకు సముత్తేజాలు దీపాలు చెట్లకు పుట్లకు అవసరం లేదు
మనిషి గుండెల్లో కొవ్వొత్తులు ఆరిపోతున్నాయి
నూనె పోయడం మరచి మళ్ళీ మళ్ళీ ముట్టిస్తున్నారు
అతడు సూర్య నమస్కారాలు చేయమంటున్నాడు
పిల్లలకు ముందు గ్లాసుడు పాలివ్వండి।
అప్పుడు వారి కళ్ళల్లోనే సూరీడు పొడుస్తాడు
ఇన్ని వైరుధ్యాల మధ్య కూడ మనిషి ఓ సూర్యునిలానే వెలుగులు చిమ్ముతున్నాడు
ఎందుకంటే అతనిలోనే సూర్యుడున్నాడు
ముందు మీలో సూర్యుణ్ణి చూసుకోండి

-డాక్టర్ కత్తి పద్మారావు, ✆: 9849741695

మైదానం



జీవితాన్ని పరిచయం చేసుకో
జన్మని కొనసాగించడానికి....
అది ఎంతో రమణీయమయింది
ఎన్నో సుందర రూపాల కలయిక
వలలో చిక్కుకున్న
బతుకులోంచి బయటికొచ్చి
నీకై నీవుగా జీవితానికి పరిచయమవ్వాలి
ఎన్నో నిఘూఢమయిన జ్ఞాపకాలు
నీతో పెనవేసుకు తిరుగుతున్నప్పుడు
నువ్వెక్కడికి వెళ్ళగలవో నువ్వూహించలేవు
ఎప్పుడూ నిన్నంటి పెట్టుకున్నదేదో నీకుతెలీదు
కానీ ప్రపంచంలో
ఒక దగ్గరి నుంచి మరో చోటుకి
ఒక సమూహం కోసం వెతుకుతూ వెళ్తావు
శిఖరాన్ని ఎక్కడానికి సిద్ధపడి
ఏదో తన్మయత్వపు పాట విని ఆగిపోతావు
కలల్నేం చేసుకుంటావు?
గుండెతో చూడటం సాధ్యమవుతుందా?
చూస్తావా? చూడగలవా? ప్రయత్నిస్తావా?
నెత్తురుతో బొమ్మలు గీయదలచావా?
బతుకు వాకిలిముందు కూర్చుని
ఎవరికోసం నిరీక్షిస్తావు?
గుండె జోలెలో ఆవిడవి కొన్ని జ్ఞాపకాలున్నాయి
ఆమె ఎప్పుడూ కదలని సముద్రంలా ఉంటుంది
నవ్వుతూ ప్రవహించే నదిలా ఉంటుంది
వెన్నెలలో... తడిసిన మైదానంలా మారిపోతుంది
చూశావా?... చూడగలవా రెప్పవేయకుండా?
ఆమెని ఆమెలానే ఊహించటం చేతనవునా నీకు
ఆమె ఎప్పటికీ ఒక్కలా కన్పించదు
ముక్కలయిన రాత్రుళ్ళలో విన్పిస్తుంది
పరిచయమయిన జీవితపు ఆక్రందనలో
ఒక రహస్య ప్రవాహంలా.. లీలగా
అలా కదిలి వెళ్ళిపోతుంది
పలకరించాలంటే...
జీవితంతో పరిచయమవ్వాల్సిందే...

-ఖాదర్ షరీఫ్, ✆ : 9441938140

బుట్టబొమ్మలు!



గౌనులన్నింటిలో బుట్టబొమ్మల ప్రత్యేకతే వేరు. వీటిని వేసుకున్న పిల్లలు అచ్చంగా బుట్టబొమ్మల్లానే ఉంటారంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ ఉన్న ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. నలుపు, తెలుపుల నుంచి ఇంద్రధనుస్సు రంగులన్నింటినీ కలబోసుకున్న ఈ బుట్ట గౌనులు స్కూల్‌లో కల్చరల్ కార్యక్రమాల నుంచి పెళ్ళి వేడుకల వరకూ ఎలాంటి ఫంక్షన్‌కైనా బాగుంటాయి. పదిమందిలోనూ ప్రత్యేకంగా కనిపించేలా చేస్తాయి. పిల్లలకి ఇంతకంటే కావలసింది ఏముంటుంది. మరి ఈ బుట్ట గౌను మీ అమ్మాయికీ ఉందా? లేదంటే మరి కొనడానికి వెంటనే మార్కెట్‌కి బయలుదేరండి ఇంక!









ఎముకల ధృడత్వానికి
పాప్‌కార్న్

పాప్‌కార్న్ అంటే తెలియని వారుండరు. పిల్లలకి పెద్దలకి అందరికీ చాలా ఇష్టమైన అల్పహారం. దీన్ని తేలికగా ఎక్కడికైనా తీసుకెళ్ళచ్చు. చాలా మంది దీనిని కాలక్షేపం కోసం నములుతూ ఉంటారు. ఎలా తిన్నా దీని వల్ల కలిగే ఆరోగ్య లాభాలు చాలానే ఉన్నాయి. మొక్కజొన్న గింజల్ని నూనెలో వేడిచేస్తే పాప్‌కార్న్ అవుతుంది. ఇది అందరికీ తెలిసిందే. ఇది రుచికి మాత్రమే కాదు. పోషకాల పరంగా కూడా ఉపయోగపడుతుంది. ఈ పాప్‌కార్న్‌లో ఉప్పు, వెన్నే వెయ్యడమే కాదు కొంతమంది పాకం లోనూ వేసి రకరకాలుగా తయారు చేసుకుంటారు. ఇలా తీసుకోవడం అనారోగ్యం వస్తుంది. పాప్‌కార్న్‌లో ఇతరత్రా ఏమీ కలపకుండా తినడమే ఉత్తమం. దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవీ...

- పాప్‌కార్న్‌లో కొలెస్ట్రాల్ స్థాయి తక్కువ, దీనిలోని ఫైబర్ రక్తనాళాల్లోని కొవ్వును వేరుచేస్తుంది. ఇది గుండె వ్యాధులను రాకుండా నివారిస్తుంది.
- పాప్‌కార్న్‌లో ఎండోస్పెర్మ్, జెర్మ్, బ్రాన్, ఫైబర్ జీర్ణశక్తికి దోహదపడతాయి.
- దీనిలోని ఫైబర్ ఇన్సులిన్ ఉత్పత్తిని నియంత్రిస్తుంది. అందువల్ల రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో వుంచుతుంది.
- పాప్‌కార్న్‌లో ఎక్కువ శాతం పాలీ-పినోలిక్ సమ్మేళనాలు ఎక్కువగా వున్నాయి. ఇది కేన్సర్‌ని నిరోధిస్తుంది. ఇవి శరీరాన్ని శక్తివంతం చేయగల రక్షణ ఏజెంట్లలో ఒకటి.
- వయస్సు పెరిగే కొద్దీ వచ్చే ముడతలు, మచ్చలు, అంధత్వం, కండరాల బలహీనత, జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.
- బరువు తగ్గుదలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. పాపకార్న్‌లో 30 కేలరీలు మాత్రమే వుంటాయి. బంగాళాదుంప చిప్స్ కన్నా 5 రెట్లు తక్కువ ఉండే ఫైబర్ ఆకలి కలిగించే హార్మోన్‌ను నియంత్రిస్తుంది.
- ఎముకల పెరుగుదలకు తోడ్పడుతుంది. పాప్‌కార్న్‌లో మాంగనీసు ఎముకల్ని పటిష్టంగా చేస్తుంది, బోలు ఎముకలు, కీళ్ళ నొప్పులు, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి రోగాలు రాకుండా చూస్తుంది.
- ఓట్ మీల్ తిని విసుగుపుడుతుంటే దీన్ని చక్కటి అల్పహారంలా తీసుకోవచ్చు.
- పాప్‌కార్న్‌లో రక్తహీనత రాకుండా కాపాడే ఐరన్ కూడా వుంది.

వంటలు...ఇలా వద్దు!

వంట అనేది ఒక కళ. ఇది కూడా ఒక రకమైన సృజనాత్మకతే. మీరు ప్రొఫెషనల్సా, ఔత్సాహికులా అనేది ఇక్కడ విషయం కాదు. పదార్థాలు ఒకటే అయినా చేసే విధానం వేరు. మీరు ఇష్టపడే కూరగాయల్ని తినడానికి రుచిగా వండడం అంత తేలికైన విషయమేమీ కాదు. వీటిని ఒక పద్ధతి ప్రకారం వండితే తప్ప కోరుకున్న రుచి రాదు. సాధ్యమైనంత రుచిగా వండటంతో పాటు పోషక విలువలు వుండేలా చూడటం చాలా అవసరం. ఎంత ప్రొఫెషనల్స్ అయినా వంట చేసేటప్పుడు ఏదో ఒక తప్పు చేస్తునే వుంటారు. ఇవి తప్పులని మనకి ఒక్కోసారి తెలియకపోవచ్చు కూడా. మరి ఆ తప్పులేమిటో తెలుసుకుందామా!



- రకరకాల నూనెల వాడకం వల్ల వంటలకి సరైన రుచి రాదు. ముఖ్యంగా ఆలివ్ ఆయిల్ వంటలకి పనికి రాదు. అది కాకుండా మరేదైనా నూనె ఎంచుకోండి.
- కూరగాయలు ఉడకబెట్టడం అనేది పాత పద్ధతి. దీని వల్ల వాటిలోని పోషక విలువలు దెబ్బతింటాయి. అప్పటికప్పుడు చేసే వంటలకు మాత్రమే ఈ విధానాన్ని వాడాలి.
- మరీ ఎక్కువ సమయం మంట మీద వండటం వల్ల రుచి మారుతుంది. ఈ పద్ధతి ఆరోగ్యానికి మంచిది కాదు.
- పదార్థాలను సరైన మోతాదులో ఉపయోగించక పోయినా వంటలు రుచిగా వుండవు.
- కూరగాయలు ఉడకబెట్టె సమయంలో ఉప్పు వేయకపోవడం వల్ల కూడా వంటలకి రుచి రాదు. ఉప్పు వల్లనే వంటలకి రుచి వస్తుంది. ఉప్పు శరీరంలో సోడియం క్లోరైడ్ ద్రవాలను సరైన మోతాదులో వుంచుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది.
- కూరగాయల్ని ముందే తరగవద్దు. దీని వల్ల ముక్కలు తాజాదాన్ని కోల్పోయి వంటల రుచి మారుతుంది. తరిగిన వాటిని ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. వంట చేసే ముందే ముక్కలు తరగడం వల్ల వంటల రుచి మారదు.
- కూరగాయల్ని ఎక్కువ సమయం వరకు వేపుతూ వుండడం వల్ల రుచి మారుతుంది. దానితో పాటు వాటిలోని పోషక విలువలు పోతాయి.
- కొవ్వు కలిగిన పదార్థాలను కలిపి వండకూడదు. నారింజ, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ వంటి కూరగాయలు తీసుకుంటే వాటిలో క్యాన్సర్‌ని ఎదునర్కొనే, గుండెను ఆరోగ్యంగా వుంచే పోషకాలు లైకోపేన్, బీటా-కేరోటిన్ వంటివి వుంటాయి.
- తొందరగా ఎక్కువ వంట చేయాలనే భావనతో సరైన మోతాదులో పదార్థాలు వాడకపోవడం, సరైన మంట మీద వేపకపోవడం వల్ల కూడ వంటలు రుచిగా వుండవు.
- నాన్‌స్టిక్ పాన్‌లు తరచూ వాడడం వల్ల కూడా రుచి మారుతుంది. నాన్‌స్టిక్ పాన్‌ల్లో వంటల వల్ల ఉపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వస్తాయి.

మంచి ఆకృతి కోసం
రాత్రివేళ ఇవి తినడమే బెస్ట్!

మీరు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నారా? దీని కోసం చాలా ప్రణాళికలు సిద్ధం చేసుకొని వుంటారు. బరువు తగ్గడం కోసం ఏం తినాలి, ఏం తినకూడదనే గందరగోళంలో వున్నారా? రాత్రి భోజనం మధ్యాహ్నం భోజనం కన్నా భిన్నంగా వుండకూడదు. అలా అని అసలు ఏం తినకుండా పడుకోకూడదు. ఖాళీ కడుపుతో పడుకోవడం వల్ల సరిగ్గా నిద్ర పట్టదు. దీంతో ఉదయాన్నే ఎక్కువ క్యాలరీలున్న ఆహారం తీసుకోవాల్సి వస్తుంది. అంతేకాక నిద్రలేమి, అలసట, ఆకలితో అల్లాడుతారు. ఈ కారణాల వల్ల మీ ఆహారపు ప్రణాళిక అస్థవ్యస్తం అవుతుంది. పడుకునే ముందు ఇవి తినడం వల్ల కడుపు సంతృప్తిగా వుంటుంది, బరువు పెరగరు. మంచి ఆహారం తీసుకుంటే బరువు తగ్గుతారు.



చెర్రీస్
చెర్రీస్‌ని రాత్రి భోజనానికి ముందు తీసుకుంటే నిద్రలేమి లేమి సమస్య వుండదు. అంతేకాక మంచినిద్రని ఇస్తుంది. చెర్రీస్‌లోని మెలటోన్ హార్మోన్ ఇందుకు సహకరిస్తుంది. ఇందులోని యాంటి ఆక్సిడెంట్స్ శరీరంలోని వాపులు, ఉబ్బులను నియంత్రిస్తుంది.

పెరుగు
పెరుగు సహజంగా అందరి ఇళ్లలో ఉంటుంది. ఇది రాత్రిపూట తీసుకోవడానికి ఉత్తమమైన ఆహారాల్లో ఒకటి. ఎందుకంటే ఇందులో పంచదార శాతం తక్కువ. దీనిలోని ప్రోటీన్స్ మీ పొట్ట నింపుతాయి. అంతేకాక కండర నిర్మాణానికి సహాయపడుతుంది. పెరుగులో వుండే లీన్ ప్రోటిన్స్ శరీరంలోని కొవ్వును, బరువును తగ్గించడంలో సహాయపడుతుంది.

వేరుశనగ వెన్న
బాగా వేయించిన వేరుశనగ గింజల్ని వెన్నతో కలిపి మిక్సీ పట్టుకోండి. ఈ మిశ్రమాన్ని బ్రెడ్‌పై వేసుకొని రాత్రి పూట తింటే ఆరోగ్యానికి మంచి అల్పహరం. దీంతో బరువు తగ్గుదలకు సహకరిస్తుంది. ఇలా తీసుకోవడం వల్ల శరీరంలోని అనవసర కొవ్వు తగ్గుతుంది.

చాక్లెట్ పాలు
చాక్లెట్ పాలు బరువు తగ్గుదలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. పాలల్లోని కాల్షియం శరీరంలోని అనవసరమైన కొవ్వును కరిగిస్తుంది. వెయ్యి మిల్లీగ్రాముల కాల్షియం తీసుకోవడం వల్ల 18 పౌండ్ల బరువును తగ్గించుకోవచ్చు.

బాదం గింజలు
బాదంలో 5 గ్రాముల ప్రోటిన్స్ వుంటుంది. కండరాల నిర్మాణానికి ఉపయోగపడుతుంది. కొవ్వును కరిగించే ఔషధంలా పనిచేస్తుంది. వీటిని రోజు తీసుకోవడం వల్ల బరువు తగ్గి ఆరోగ్యవంతంగా వుంటారు.

తృణ ధాన్యాలు
రాత్రి నిద్రపోయేయుందు ఒక గిన్నెడు తృణధాన్యాలు తీసుకుంటే దీనిలోని ఫైబర్ శరీరంలోని కొవ్వును కరిగిస్తుందని పరిశోధనలో వెల్లడయింది.

గ్రీన్‌టీ
గుండె, మెదడు సంబంధిత వ్యాధుల్ని గ్రీన్ టీ నియంత్రిస్తుంది.

గుడ్లు
ఉడకబెట్టిన కోడిగుడ్లను రాత్రి పూట తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగానే బరువుని తగ్గించుకోవచ్చు. ఒక గుడ్డులో 78క్యాలరీలు ఉంటాయి.



జరిగిన కథ

అక్కడ మలయా- సింగ పూరు-బర్మాలో జపాను వాడిని చూడగానే తెల్లవాళ్ళు పఠించిన మంత్రాన్నే-ఇక్కడ జపానువాడిని చూడకుండానే పఠిస్తున్నారే! ఏడు ప్రాణాలని చంపిన బంట్రోతుకి తన ప్రాణం తీపైనట్టు - మూడు నక్షత్రాల జనరల్ గారికి మాత్రం వారి ప్రాణం తీపికాదా?... ఆ ప్రళయ ప్రవాహంలో-జనరల్‌గారి రోల్సురాయిస్సూ - వేలం పేట ఎడ్లబండి-బురుజుపేట గూడుబండి - కురుపాలెం మార్కెట్టు పెట్టిబండి-మిలిటరీ ట్రక్కు-పోలీసులారి-మునిసి పాటిటీ చెత్తబండి-విమానదళంవారి జీపు..

(నిన్నటి సంచిక తరువాయి)

పాండ్రంగి పెద్దరైతుగారి పోతులబండి - అన్నీ పక్కలంకెంలలో చిక్కుకున్నాయి. మూడు నక్షత్రాలు జనరల్ - సామాన్యపు సిపాయి లారీ కానిస్టేబులు - కాంగ్రెసు నియంత - పావలా వాలంటీరు - రోడ్డు తుడిచే రెల్లి - తుడిపించే శానిటరీ ఇనస్పెక్టరు - గడ్డంచేసే మంగలి - తలపాగా తాశీల్దారు - తువాలు తలకి చుట్టిన బంట్రోతు - గెడ్డాలు నెరసిన బుట్టపాగా ఖాజీసాయిబు - ఉప్పుచేపలమ్ముకునే జాలరి - ప్లీడరుగారి పడుచు పెళ్ళాం - దొడ్డిపూడ్చే చచ్చడిది - జమీందారుగారి పట్టమహిషి - కసాయి వాడి భార్యారత్నం - రాజాగారి చిన్నరాణీ - బాబుగారి కాసాపడుచు - కూరగంపలు మోసే గవరది - సోమయాజిగారి ఆడంగి - తట్టలుయెత్తే వడ్డరిస్త్రీ - మైలగుడ్డలుపుతికే చాకలికూతురు - కల్లుకంట్రాక్టరుగారి పెద్దభార్య - చిన్ననాయుడుగారి కన్నెరికపు చిన్నది- బురఖా వేసుకున్న బూబు - మేలిముసుగు వేసుకున్న మార్వాడి ముద్దరాలు - కుసిలీ పేటలోని చింకి దొరసాని - గడ్డిబజారులో పెద్దసాని - చోబుదారుగల్లీలోని రెడ్డిసాని - యెవరిప్రాణం వారికే తీపి! యెవరి ప్రాణం వారికే విలువ! ఎవరి ప్రాణానికి ఎవరు అడ్డుపడతారు?...

"పదండి పదండి!"...."నడవండి - నడవండి!" ...సాగండి, ముందుకు సాగండి!" ...ఆ కుమ్ములాటల్లో తోపుడు పోట్లలో - దిగబడి పోయినవాళ్ళు దిగబడిపోతున్నారు. తప్పిపోయినవాళ్ళు కనబడ్డంలేదు. కనబడనివాళ్ళకోసం వెతకడంలేదు, వెతకలేమని యేడ్వడంలేదు. కాళ్ళకింద నలిగిపోతున్నారు. నలిగిపోతున్నవాళ్ళని యెత్తేవాళ్ళు లేరు. కార్లు మట్టేసినవాళ్ళు మట్టిపాలై పోతున్నారు. కూలబడిన ముదుసలులు ముద్దలై పోతున్నారు. కాళ్ళువిరిగిన జీవాలమీదనుంచి జీవులు నడిచిపోతున్నాయి.... మనిషి శరీరాల వాసన, చెమటకంపు, ముఖం తిరిగే పెట్రోలుపొగ, మూత్ర పురీషాదుల రొంపి, చనుబాల నీచు, కుళ్ళురక్తపు రోత, నరమాంసపు దుర్గంధం, శ్వాసతో పులిసిన వాతావరణం....నాది ఎదురునడక, ఆ వరదకి ఎదురీత. ఆ ప్రవాహానికి ప్రతియత్నం...రోడ్డు చీలింది. ఒక ప్రవాహం భీమునిపట్నం రాస్తాపట్టింది ఒక ప్రవాహం అనకాపల్లి అడ్డుదోవ తొక్కింది. మహారాణిపేట చౌకునుంచి రైలుస్టేషను వరకూ ఒకటే బారు ...ఇటు జైలు దిబ్బలవరకూ ఒకటే ప్రజ... అటు పెద్దవాల్తేరు వరకు ఎడతెగని రోకలిబండ..అటు 'బీచి' దాకా ఇసుకవేస్తే రాలని బీడు...

ఇంతవరకు ఒక్క ఖాళీబండి అయినా కనబడలేదే! ముందుకు వెళ్ళినకొద్దీ మాలతికి దూరం అయిపోతున్నానే - ఆమె యేమి వేదన పడుతుందో? నొప్పులు ప్రారంభం అయాయో యేమిటో! మాలతిని వదిలి వెళ్ళొద్దని అమ్మ మరీ మరీ చెప్పింది నాతో. మంత్రసానీ - వైద్యుడూ దగ్గిర లేకపోతే బిడ్డ ప్రాణంతోపాటు ఆమె ప్రాణంకూడా పోతుందేమో - ఏం దారి? మళ్ళీ ఆమెను చేరుకోవడం ఎలాగు?...టర్నరు సత్రంవరకు నడిచాను.



సత్రం అంతా జనంతో నిండిపోయింది. మెట్లముందు అద్దె మోటారు పకటి నిలబడి వుండడం చూశాను. నాకొక ఆలోచన తట్టింది. సత్రంలోకి వక్కపరుగున వెళ్ళాను. మార్వాడి వకతను అప్పుడే కారులోకి యెక్కబోతున్నాడు. నా భరతనాట్య వ్యాయామమంతా ఉపయోగించి వెనుకనుంచే వెళ్ళి అతని మోకాలులో మెలికవేశాను. వెంటనే తను అకాలు మడతబడి నేలమీద చితికిలబడ్డాడు. నా భరతనాట్య సాధకం ఇన్నాళ్ళకి సార్థకం అయిందని సంతోషించినాను.

చప్పున కారులోకి దూకి వెనుకస్థలంలో కూర్చున్నాను. కారువాడు నావేపు నిర్ఘాంతపోయి



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

చూస్తున్నాడు. నా చేతిసంచీలోవున్న రివాల్వరు మాట జ్ఞాపకం వచ్చింది. ప్యారిస్‌లో మోంటుమార్టుకెఫేలో నాకు వీడుకోలిస్తూ ఆంద్రే తన జ్ఞాపకార్థం నా కిచ్చాడు. నాటినుంచి నేటికి దానివేపే చూడ్డంలేదు - లైసెన్సు కట్టడంతప్ప. ప్యారిస్‌లో వున్న నాలుగు నెలలూ నాకు ఫ్రెంచి భాషలో మంచి తర్ఫీదిచ్చాడు పాపం! పగలంతా కెఫేలో బట్లరుపని. రాత్రి అంతా రాజకీయంలో రహస్యపు జీవితం! భాషతో పాటు, రివాల్వరు సాధకం గూడా బాగా చేయించాడు. ఎంత ధీరుడు! చివర రోజుల్లో నావేపు అదోమోస్తరుగా చూసేవాడు పాపం! యుద్ధం మొదలైన దగ్గిరనుంచీ అతని దగ్గిరనుంచి ఖబురులేదు. "నలుగురు నాజీలనైనా చంపుతేకాని నా జన్మ తరించదు!" అనేవాడు నవ్వుతూను. ఏ "మాకీస్" రహస్యదళంలోనో చేరి అడవులమ్మట, కొండలమ్మట తిరుగుతూ నాజీలను హతమారుస్తూ వుంటాడు!....ఇన్నాళ్ళు నా సంచిలో అలాగే వుండిపోయింది. దాన్లో తూటాలు వున్నాయో లేదోకూడా నాకు గుర్తులేదు. రివాల్వరు తీసి గొట్టంతో వెనుకనుంచి డ్రైవరు మెడ తట్టేను. చల్లటి రివ్వాలరు మెడకి తగిలేసరికి డ్రైవరు నావేపు తిరిగి, బెంబేరెత్తి నా వేపు చూశాడు.

"కారుని సరాసరి యూనివర్సిటీవేపు నడుపు! బీచమ్మంటే పోనీ!" అన్నాను.

"సేట్జీ రైలుకు దిగబెడితే నూరురూపాయలిస్తానన్నాడు. నేను బేరానికి వప్పుకొని మాటిచ్చాను. పెద్దవాల్తేరు వెళ్ళాలంటే ఐదొందలివ్వండి" అన్నాడు కారువాడు.

"ఐదొందలు కాదుకదా ఐదురూపాయ లివ్వను. మారుమాటాడేవా నీ ప్రాణాలు దక్కవు - మరి చూసుకో పకటి - రెండు - మూ.." కారు నడిచింది: మహారాణిపేట ఎగుడు...కలక్టరాఫీసు... "త్వరగా, ఇంకా త్వరగా!" అని అతని మెడని రివాల్వరుతో పొడుస్తూ మందలించాను. సెంచరీక్లబ్, హవామహలు, బీచిరోడ్డు, స్కేండలుపాయింటు, పోస్టాఫీసు, ఇల్లు!

కారాగింది. కారువాడిని ముందు దిగమన్నాను. స్విచ్చితాళాలు తీసుకుని నా దగ్గర వుంచుకున్నాను. ఇంటి తలుపు తీశాను. మాలతి యేస్థితిలో వుందో అని నా గుండెలు కొట్టుకుంటున్నాయి. ఆమెను చూస్తానో - చూడనో? ఆమెను వదలి వెళ్ళి నాలుగు గంటలైంది...మాలతికి ఆ నిమిషమే మెలకువ వచ్చినట్టుంది. మూలుగుతూంది. ఇంతసేపూ నేను తనని వదలిపెట్టి వెళ్ళినట్టు తెలియనే తెలియదు. పొత్తికడుపు పోటుగా వుందని అంటూంది. ఆసుపత్రికి వెళ్ళడానికి కారు తీసుకువచ్చానని చెప్పాను. కాని ఆమెకి బోధపడినట్టులేదు... మూలుగుకేకలకింద మారుతూంది. నాకు కాళ్ళు వణకడం మొదలెట్టాయి. ధైర్యం తెచ్చుకుని - మాలతికి అవసరమైన బట్టలన్నీ తోలుపెట్టెలో సర్ది ఆమెను మెల్లగా బయలుదేరించాను. కారువాడిని వచ్చిన తోవనే ఆసుపత్రికి తీసుకువెళ్ళమని అతనికి స్విచ్చి తాళాలు ఇచ్చాను...హవామహలు వరకూ త్వరగానే వెళ్ళగలిగేం. అక్కడనుంచి జనసమ్మర్దం హెచ్చైపోయింది. మాలతి నొప్పులు హెచ్చైపోతున్నాయి. కారువాడిని త్వరత్వరగా వెళ్ళమని యెంత బెదిరించినా ఎదురుగా వస్తూన్న జనాన్ని తప్పించుకుని ఆస్పత్రి చేరుకునేసరికి అరగంట పట్టింది...ఆస్పత్రి ద్వారాల్లోనుంచి కొందరు - గోడల మీదనుంచి దుమికి కొందరూ - రోగులూ - సిబ్బందీ - ఎర్రపాగాల బంట్రోతులూ - మగవాళ్ళూ - ఆడవాళ్ళూ - పిల్లలూ - పిల్లలతల్లులు - కట్లు వూడిపోతూ, రక్తాలుకారుతూ నడవలేనివారు - నేలమీద దేకేవారు - పరుగెత్తేవారు - దిగంబరులు - పాలిపోయిన శరీరాలవాళు) - సంకటాలతో తీసుకుంటున్నవాళ్ళు - అందరూ పెనుభూతాలూ వెనకనుంచి తరుముతూన్నట్టు - రోజుకుంటూ - రొప్పుకుంటూ పారిపోతున్నారు. ఆస్పత్రి బలంపందుకంటే జపానువాడి పిరికిమందే వీళ్ళకి బాగా వంటపట్టడంచేత - వెర్రిపరుగుల పరుగులెత్తుతున్నారు...నర్సుల భవంతి పెరటి ద్వారంనుంచి ఆస్పత్రి అవరణలోకి ప్రవేశించి - సరాసరి పెద్ద అధికారి బంగళాముందు కారును ఆపమన్నాను. వెనుకటిలాగే కారు తాళాలని నా దగ్గిరవుంచుకొని మాలతిని కారులో పడుకోబెట్టి అధికారితో మాట్లాడి వస్తానని కారువాడితో చెప్పి, బంగాళాలోకి వెళ్ళాను... అతడు ఉత్తరాదిమనిషి. పెద్దతోలుకుర్చీలో కూర్చుని చల్లని ఎలక్ట్రిక్‌దీపం దగ్గిర చదువుకుంటున్నాడు. దగ్గర మేజామీద ఒక గళాసులో పానీయం, నాలుగు 'అషాహీ బీర్' సీసాలు వున్నాయి. నన్నుచూసి ఆయన త్రుళ్ళిపడ్డాడు. చేతిలో పుస్తకం భళ్ళుమని కిందపడింది.

"మీరు జపానువాళ్ళ తాలూకా ఏమిటి? కాకపోతే, యీ బాంబుల వర్షంలో ఇంత ధైర్యంగా ఎలా వస్తారు? మీ చేతిలో దేమిటి?" అని గాభరాగా అడిగేడు. నా రివాల్వరు చూసి అదిరిపోతూను.

"నేను ఎవరైనదీ మీకు అవసరంలేదు. నా చేతిలోది చక్కని 303 'షైదరు' ఆటోమాటిక్కు.

- ఇంకా వుంది.

మంచి ఉపాధికి మరో మార్గం.. ఫోరెన్సిక్ సైన్స్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి కెరీర్ కావాలనుకునేవారికి అందుబాటులో ఉన్న విద్య ఫోరెన్సిక్ సైన్స్.. ప్రపంచవ్యాప్తంగా నేరాలు, ఆర్థిక మోసాలు ఎక్కువ య్యాయి. మనదేశంలోనూ వీటి సంఖ్య ఎక్కువే. అయితే చాలా సందర్భాల్లో పోలీసు విచారణలో లైంగికదాడి, హత్యకు కారకులు దొరకడం లేదు. ఎన్నో కేసులు మిస్టరీగానే మిగిలి పోతున్నాయి. అసలు నేరస్థులను గుర్తించడానికి ప్రత్యేక నైపుణ్యాలున్న వ్యక్తులపై ఆధారపడడం తప్పని సరవుతోంది. ఆధారాలు అన్వేషించి, అసలు దోషుల గుట్టు విప్పడానికి ఆవిర్భవించిందే ఫోరెన్సిక్ సైన్స్. ఫోరెన్సిక్ సైన్స్ అంటే కేవలం హంతకులను గుర్తించే శాస్త్రమే కాదు. మోసగాళ్లను పట్టిస్తుంది కూడా. అగ్ని ప్రమాదాలు, ఫోర్జరీ సంతకాలు, మార్ఫింగ్, సైబర్ నేరాలు... ఇలా ప్రతీదీ ఫోరెన్సిక్‌తో ముడి పడి ఉన్నదే. ఆధునిక సమాజంలో నేరాలు గుర్తించడానికి ఫోరెన్సిక్ సైన్స్ శక్తివంతమైన ఆయుధంగా మారింది. దీంతో ఈ రంగంలో కెరీర్ అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఇందు కోసం డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిల్లో పలు కోర్సులు ఆవిర్భవించాయి. కేవలం ఈ తరహా కోర్సులు అందించ డానికే ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం సైతం ఏర్పడింది. ఆ వివరాలు తెలుసుకుందాం..

ఎవరు అర్హులు

ఫోరెన్సిక్ సైన్స్‌పై ఆసక్తి ఉన్నవాళ్లు డిగ్రీ నుంచే ఈ కోర్సును చదువుకోవచ్చు. సైన్స్ గ్రూప్‌తో ఇంటర్ చదివిన విద్యార్థులు బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. అయితే బీఎస్సీ స్థాయిలో ఈ కోర్సును అందించే సంస్థలు పరిమితంగానే ఉన్నాయి. అందువల్ల పీజీ కోర్సుల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో డిగ్రీ పూర్తిచేసినవారు ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్




కోర్సులో చేరడానికి అర్హులు. పీజీ అనంతరం పీహెచ్‌డీ కోర్సులు సైతం ఉన్నాయి. అలాగే పలు సంస్థలు సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి.

ఏం చేస్తారు...

ఏదైనా సంఘటన జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ఆధారాలు సేకరించడం, లభ్యమైన సమాచారాన్ని విశ్లేషించి అసలు దోషి ఎవరో నిర్ధారించడం ఫోరెన్సిక్ నిపుణుల ప్రథమ కర్తవ్యం. కొన్నిసార్లు ఎలాంటి ఆధారాలూ లభించవు. తర్కాన్ని ఉపయోగించి, పలు కోణాల్లో ఆలోచించి దోషిని గుర్తించడం పెద్ద సవాల్‌గా మారుతుంది. దొంగతనం, అత్యాచార సంఘటనల్లో పలు సందర్భాల్లో ఆధారాలు కాకుండా బాధాకర విషయాలే మిగులుతాయి. ఇలాంటప్పుడే ఫోరెన్సిక్ నిపుణుల సమర్థత బయటపడుతుంది. ఆ కేసును బాగా విచారించి, క్షుణ్ణంగా ఆలోచిస్తే ఏదో ఒక చిన్న క్లూ తప్పకుండా లభిస్తుంది. తీగలాగితే డొంకంతా కదిలినట్టు దాని నుంచి వివరాలు సేకరించడం సాధ్యమవుతుంది. లభ్యమైన ఆధారాలను ప్రయోగశాలలో పలు పరికరాలు ఉపయోగించి అసలు దోషులను గుర్తించవచ్చు. ఫోరెన్సిక్ సైన్స్‌లో అంతర్గతంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మెడిసిన్, సైకాలజీ, స్టాటిస్టిక్స్...ఇలా పలు సబ్జెక్టులు ఉంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఆ కేసుసుబట్టి వివిధ విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎన్నో మార్పులు చోటుచేసుకుం టున్నాయి. అందుకు తగ్గట్టుగానే మనదేశం సన్నద్ధమవు తోంది. కేవలం ఈ రంగంలో అధ్యయనం కోసమే 'గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ' ఏర్పాటైంది. మన దేశంలో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులకు ఈ విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమైన సంస్థగా చెప్పుకోవచ్చు. ఆడియో టేపుల్లో గొంతును విశ్లేషించడానికి ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ ఉపయోగపడుతుంది. స్పెక్ట్రోగ్రామ్స్‌పై వాయిస్ శాంపిల్స్ ఉపయోగించి సులువుగానే ఆ గొంతు ఎవరిదో నిర్ధారిస్తారు. ఈ విభాగంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్- మైసూరు సంస్థ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్సెస్, ఫోరెన్సిక్ అకౌంటింగ్ కోర్సులు అందిస్తోంది. ఫోరెన్సిక్ అకౌంటింగ్ ద్వారా ఆర్థిక నేరగాళ్లను తెలుసుకోవడం, ఆర్థిక నేరాలను గుర్తించడం సాధ్యమవుతుంది.

కావాల్సిన స్కిల్స్

పాఠ్యాంశాల ద్వారా ఈ విభాగానికి సంబంధించిన సాంకేతిక నైపుణ్యాలను తెలుసుకోవచ్చు. అయితే వాస్తవ పరిస్థితిని నిశితంగా గమనించినప్పుడే ఏవైనా ఆధారాలు లభిస్తాయి. ఉన్న సమాచారాన్ని భిన్న కోణాల్లో విశ్లేషించడం, తర్కం, ఆప్టిట్యూడ్‌లతో మరింతగా రాణించవచ్చు. అకడమిక్ పరిజ్ఞానంతోపాటు సైన్స్‌కు చెందిన విభాగాల్లో అవగాహన ఉన్నవాళ్లు మరింత సమర్థంగా రాణించడం సులువవుతుంది. సునిశిత పరిశీలన, విశ్లేషణ సామర్థ్యం ఈ రెండూ ఎంతో ముఖ్యం. కొన్నిసార్లు ఇతర విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి వస్తుంది. కాబట్టి మంచి కమ్యూని కేటర్‌గా, బృంద సభ్యులుగా మెలగడం తప్పనిసరి. ముఖ్యం గా సైకాలజిస్టులు, స్టాటిస్టిక్ నిపుణులతో కలిసి పనిచేయాల్సి రావచ్చు. అప్పుడప్పుడు అవుట్‌డోర్ పని కూడా తప్పదు.



సైన్స్, మ్యాథ్స్‌లో ఆసక్తి ఉంటే..

సైన్స్ అంటే ఆసక్తి, గణితంలో ప్రావీణ్యం, సమాచారాన్ని విశ్లేషించగలగడం, లోతుగా ఆలోచించడం, వాస్తవానికి దగ్గరగా ఊహించడం, తర్కం, సునిశిత పరిశీలన ఉన్నవాళ్లు ఈ కోర్సులో రాణించడానికి అవకాశాలు ఉన్నాయి.

హోదాలు

అభ్యర్థి చదువుకున్న కోర్సును బట్టి ఫోరెన్సిక్ పాథాలజిస్ట్, క్రైమ్ ల్యాబొరేటరీ అనలిస్ట్, ఫోరెన్సిక్ ఇంజినీర్, ఫోరెన్సిక్ ఆర్కిటెక్ట్, ఫోరెన్సిక్ వెటర్నరీ సర్జన్, వైల్డ్ లైఫ్ ఫోరెన్సిక్ స్పెషలిస్ట్, ఫోరెన్సిక్ సైకియా ట్రిస్ట్, ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్, ఫోరెన్సిక్ అడోంటాలజిస్ట్, ఫోరెన్సిక్ సెరోలజిస్ట్... తదితర హోదాల్లో ఫోరెన్సిక్ నిపుణులు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

అవకాశాలు లభించే రంగాలు..

ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీలు, ఆసుపత్రులు, ల్యాబొరేట రీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఎంచుకున్న స్పెషలైజేషన్‌పై అవకాశాలు ఆధారపడి ఉంటాయి. కొన్ని కార్పొరేట్ సంస్థలు ఫోరెన్సిక్ నిపుణులను డాక్యుమెంట్ రైటర్లుగా నియమించు కుంటున్నాయి. యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్, మాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ తదితర విభా గాల్లో అవకాశాలు లభిస్తాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వె స్టిగేషన్ (సీబీఐ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), పోలీస్ శాఖల్లో ఫోరెన్సిక్ ఉద్యోగాలు ఉంటాయి. ఫ్రీలాన్సర్‌గా రాణించడానికి రాష్ట్రానికి చెందిన ఫోరెన్సిక్ విభాగం నుంచి సర్టిఫికేషన్ తీసుకోవాలి. ఫోరెన్సిక్ టాక్సికాలజీ, ఫోరెన్సిక్ బయాలజీ, క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ విభాగాల్లో ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు.

స్పెషలైజేషన్లు..

పీజీలో ఫోరెన్సిక్ సైన్స్‌లో స్పెషలైజేషన్లు సైతం ఉన్నా యి. ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌తోపాటు ఎమ్మెస్సీ- డిజిటల్ ఫోరెన్సిక్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఎమ్మెస్సీ - హోం ల్యాండ్ సెక్యూరిటీ అండ్ యాంటీ టెర్రరిజం, ఫోరెన్సిక్ అకౌంటింగ్ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ ఫైనాన్స్, ఎంటెక్ - సైబర్ సెక్యూరిటీ అండ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్, పీజీ డిపా ్లమాలో - ఫోరెన్సిక్ టాక్సికాలజీ, ఫోరెన్సిక్ డాక్యుమెంట్ ఎగ్జా మినేషన్, ఫింగర్ ప్రింట్ సైన్స్, క్రిమినాలజీ, ఫోరెన్సిక్ మేనేజ్‌మెంట్, ఫోరెన్సిక్ అకౌం టింగ్, ఫోరెన్సిక్ అడోంటాలజీ, ఫోరెన్సిక్ నర్సింగ్... తదితర కోర్సులు అందుబాటులో ఉన్నా యి. వీటిని గుజరాత్ ఫోరెన్సిక్ యూనివర్సిటీతో పాటు పలు సంస్థల్లో బోధిస్తున్నారు. సైన్స్, ఫార్మసీ, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఈ కోర్సుల్లో చేరవచ్చు.

కోర్సులు అందిస్తోన్న కొన్ని సంస్థలు

గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, పంజాబ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ లక్నో, ఉస్మానియా యూనివర్సిటీ, బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ, అమిటీ యూనివర్సిటీ

ప్రారంభ జీతం రూ.1 లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు

ఫోరెన్సిక్ సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ప్రారంభ వార్షిక జీతం అందుతుంది. ఈ కోర్సు చదవడానికి ఫీజు భారతీయ యూనివర్సిటీల్లో సరాసరిన రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. కోర్సులో చేరడానికి ప్రకటనలు సాధారణంగా ప్రతి సంవత్సరం జూన్‌లో వెలువడతాయి. ప్రధానంగా 10+2లో పొందిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయి.

పరీక్షల ఒత్తిడిని జయించండి ఇలా..

కొందరు విద్యార్థులు తల్లిదండ్రుల బలవంతంతో ఇష్టంలేని గ్రూప్ తీసుకున్నా.. అందమైన ఆకర్షణల మధ్య సర్దుకుపోతుంటారు. ప్రణాళిక లేకుండా చదవడంతో రివిజన్ విషయం పట్టించు కోరు. అన్నీ వచ్చేసినట్లే ఉన్నా ఏదీ గుర్తుకు రావడం లేదని ఆందోళన చెందుతుంటారు. అర్ధ రాత్రి దాటినా నిద్రపట్టదు. పగలు కునుకులు తీస్తుంటారు.. అంతా అయోమయంగా ఉంటుంది. ఇవన్నీ ఒత్తిడి లక్ష ణాలు. వీటిని సరైన సమయంలో గుర్తించి సానుకూల దృక్ప థంతో వ్యవహరించకపోతే పరిస్థితి ప్రతికూలంగా మారి పోతుంది.

శ్రద్ధగానే చదువుతున్నా విద్యార్థులందరిలోనూ అలాంటి పరిస్థితే ఎంతోకొంత కనిపిస్తుంటుంది. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలూ, ఎంసెట్, నీట్, జేఈఈ, ఇంకా డీమ్డ్ యూనివర్సిటీల ప్రవేశపరీక్షల కోసం సిద్ధమయ్యేవారూ, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులూ ఓ పక్క ప్రిపరేషన్‌లో ముని గిపోతూ మరో పక్క పరీక్షల ఆలోచనల ఒత్తిడితో సతమతమ వుతుంటారు. ఈ ఒత్తిడి మితిమీరకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. పరీక్షలు బాగా రాసి, ఆశించిన మార్కులు తెచ్చుకోవాలంటే ఇది తప్పనిసరి.

తలనొప్పి, ఆహారం జీర్ణం కాకపోవడం, వాంతి అయ్యే లా ఉండటం, ఎక్కువ తినెయ్యటం, నిద్రలేమి, అలసట.. ఇవన్నీ ఒత్తిడిని సూచించే లక్షణాలు. మానసికంగా చూస్తే... కోపం, అసహనం, నిరాశ, ఆత్మవిశ్వాసం లేకపోవటం, మూడ్ తరచూ మారిపోతుండటం లాంటివి గమనించవచ్చు.

పరీక్షల ఒత్తిడి, దానివల్ల ఏర్పడే భయాలకు కొన్ని మూల కారణాలుంటాయి. వాటిని మొదట అర్థం చేసుకోవాలి. ఆపై కొన్ని సులభమార్గాలతో అధిగమించవచ్చు.

జ్ఞాపకశక్తి లోపం

చాలామంది విద్యార్థులు ఎంత చదివినా, చదివిందేదీ గుర్తుండటం లేదని బాధపడుతుంటారు. నిజానికి వీళ్ల పరీక్షలు బాగానే రాస్తారు. కానీ ఎంత చదివినా గుర్తు ఉండక పోవడమనేది పరీక్షల ముందు రోజుల్లో ఎదురయ్యే భయం.

పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుని 'నేర్చుకునే పద్ధతి' (లెర్నింగ్ మోడ్)లో చదివితే మర్చిపోవడం కష్టం. అర్థమైన విషయాన్ని ఎవరూ మర్చిపోరు. సబ్జెక్టు మీద ఇష్టంతో, ఆసక్తితో చదివినపుడు పాఠ్యాంశాన్ని మర్చిపోయే ప్రసక్తి ఉండదు. ఇష్టమైన సినిమాలో ప్రతి దృశ్యాన్నీ ఎలా గుర్తు పెట్టుకోగలుగుతున్నాం? దానికి పెద్దగా ప్రయత్నం కూడా చేయడం లేదే? ఇది కూడా అంతే!

కాస్త వ్యాయామం... సానుకూలత

◆ కొద్దిసేపు సైక్లింగ్, చిన్నపాటి శారీరక వ్యాయామం చేస్తే ఒత్తిడి తగ్గుతుంది.

◆ బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, సానుకూల సలహాలు ఇచ్చుకోవడం, ధ్యానం, అవసరమైతే వైద్యులను సంప్రదించి కొద్దిపాటి మందులు వాడుతూ ఒత్తిడి తగ్గించుకోవచ్చు.

◆ కొన్నిసార్లు విటమిన్ల లోపం కూడా ఒత్తిడికి కారణం కావొచ్చు. ఈ విషయంలో వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.

◆ చుట్టూ ఉన్న పరిసరాల్లోని చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని కలిగించి ఒత్తిడిని దూరం చేసేవి చాలా ఉంటాయి. ఉదయిస్తున్న సూర్యుడు, వికసిస్తున్న పూలు, ఆడుకుంటున్న పిల్లలను చూడటం, చల్లగాలిని ఆస్వాదించడం, శ్రేయోభిలాషులతో కాసేపు మాట్లాడటం, ఆహ్లాదకరమైన సంగీతం వినడం ఇవన్నీ ఒత్తిడిని తగ్గించడానికి దోహదం చేసేవే.

◆ సానుకూల దృక్పథంతో ఉండాలి. ఆ దిశగా ఆలోచనలను మళ్లించాలి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి అన్నింటికంటే బాగా పనిచేసే మందు.

ఏకబిగిన గంటలతరబడి చదవకుండా 40-45 నిమిషాలకోసారి 5-10 నిమిషాల విరామం ఇస్తూ చదవటం వల్ల సబ్జెక్టును చక్కగా ఆకళింపు చేసుకోవచ్చు. బాగా గుర్తుంటుంది కూడా! బట్టీ పద్ధతిలో చదివితే ఒక పాయింట్ మధ్యలో గుర్తుకు రాకపోతే ఇక మిగిలిన పాయింట్లన్నీ కూడా దాని వెనకే మాయమైపోతాయి. విద్యార్థి అయోమయంలో పడతాడు. అందుకే, ప్రతి పాఠ్యాంశాన్నీ శ్రద్ధగా ఆకళింపు చేసుకుంటే చదివినదాన్ని మర్చిపోయే సమస్య రాదు.

నిద్రలేమి..

చాలామంది అర్ధరాత్రి దాటాక కూడా చదువుతూ పగలు కునికిపాట్లు పడుతుంటారు. అలాగే వివిధ పోటీపరీక్షలకు సైతం అమితంగా శ్రమించడం వల్ల తరచూ నిద్రలేమికి గుర వుతుంటారు. అటువంటి సమయంలో అలసటకు లోనై ఆలో చనలు బలహీనపడతాయి. పరీక్షలు సరిగా రాయలేమేమో అని భయం కలుగుతుంది.

ఎక్కువ సమయాన్ని చదువుకోసం కేటాయించడం వల్ల నిద్రలేమి సమస్య బాధిస్తుండటం సహజమే! మరికొంత మంది ఒత్తిడి వల్ల ఎక్కువ నిద్రపోలేరు. దీనికి కనీస సమ



యమైనా నిద్రపోవడం తప్ప వేరే మార్గం లేదు. నిద్రలేమి ప్రభావం మానసిక, శారీరక ఆరోగ్యాల మీద తప్పకుండా పడుతుంది. కాబట్టి విద్యార్థులు వారి వయసునిబట్టి తగినన్ని గంటలపాటు నిద్రపోవాలి. ఒత్తిడితో, ఆందోళనతో నిద్ర పట్టనివారు ఒత్తిడిని జయించే కొన్ని ఎక్సర్‌సైజ్‌లు చేయడం వల్ల దీన్ని అధిగమించవచ్చు.

ప్రణాళిక లేకుండా చదవడం

ప్రణాళిక లేకుండా చదవడం వల్ల ఏ పాఠ్యాంశం మీదా పట్టుని సాధించలేక, ఏ ఒక్కదాన్నీ పూర్తి చేయలేకపోయామని పరీక్షలు సమీపిస్తున్నకొద్దీ కంగారు మొదలవుతుంది. ఆ కంగారులో మరిన్ని పొరబాట్లు చేస్తారు.

ప్రణాళికబద్ధంగా చదివితే పరీక్షలనాటికి చాలా సిల బస్‌ను రివిజన్ కూడా చేసి పరీక్షలకు సంసిద్ధంగా ఉండగలు గుతారు. చాలామంది సులభంగా ఉండే ప్రశ్నలు లేదా లెక్కలు ముందుగా ప్రిపేరవుతూ కష్టమనుకున్నవి చివర్లో చద వొచ్చని వాయిదా వేస్తారు. కష్టమైన అధ్యాయాన్నో, అంశాన్నో చివరివరకూ అట్టిపెట్టుకుంటే ఆ సమయంలో దాన్ని సరిగా అర్థం చేసుకోలేక ఒత్తిడి పెరుగుతుంది. దాని ప్రభావం సులభమైన మిగతా పాఠ్యాంశాల మీద కూడా పడొచ్చు. ఏ రోజు ఏ సబ్జెక్టును ఎంత పరిమాణంలో చదవాలనేది ముందుగానే నిర్దేశించుకుని పరీక్షల తేదీ రావడానికి ముందే రివిజన్ మొదలుపెట్టాలి.

ఒత్తిడి - శారీరకం:

తలనొప్పి, కండరాలు పట్టేసినట్టుండటం, తరచూ ఇన్‌ఫెక్షన్లు, అలసట

మానసికం

గజిబిజి ఆలోచనలు, పీడకలలు, తొందరపాటుతనం, ప్రతికూల భావనలు

భావోద్వేగాలు

ఆత్మవిశ్వాసం లోపించటం, మొండిపట్టు, ఒంటరితనం, చిరాకుపడటం

ప్రవర్తన

నిద్రపట్టకపోవటం, ఆకలి తగ్గిపోవటం, అసహనం, ధూమపానం లాంటి అలవాట్లు

రివిజన్ ప్రాధాన్యం గ్రహించకపోవడం

చాలామంది పరీక్షల సమయం ముంచుకొస్తే తప్ప రివిజన్ జోలికే వెళ్లరు. పరీక్షలు దగ్గరపడ్డాక చదవాల్సింది కొండంతగా కనబడి, భయకంపితులవుతారు. రివిజన్‌ను కూడా ప్రణాళిక ప్రకారం చేయాల్సిందే. పాఠ్యాంశం మొత్తం మళ్ళీ చదవటం కాకుండా నోట్సునూ, హైలైట్ చేసుకున్న ముఖ్యాంశాలనూ చదువుతూ వెళ్ళటమే రివిజన్ అవుతుంది. ఒక చాప్టర్‌ను చదివాక అది పూర్తిగా వచ్చేసిందన్న భరోసాతో విద్యార్థులు చాలారోజుల వరకూ దాన్ని మళ్లీ ముట్టుకోరు. వారం తరువాత దాన్ని చూస్తే.. మొత్తం మళ్లీ చదవాల్సి వస్తుంది. విద్యార్థి శ్రద్ధగా చదివిన ఒక అంశాన్ని 24 గంటల తరువాత తిరిగి చెప్పమని అడిగితే అందులో 16 శాతం మాత్రమే గుర్తుంటుందని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే..

◆ ఏ పాఠ్యాంశమైనా మొదటిసారి చదివిన 24 గంటలలోపు మరోసారి చదవాలి.

◆ తర్వాత 7 రోజులకూ, 15 రోజులకూ, 30 రోజులకూ కూడా దాన్ని చదవాలి.

◆ ఇలా చేస్తే ఆ పాఠ్యాంశాన్ని మర్చిపోవటమనేది ఉండదు.

అందుకే రివిజన్ చార్ట్ తయారుచేసుకుని పాటిస్తుండాలి. ముఖ్యంగా పరీక్షలు దగ్గరపడ్డాక రివిజన్‌ను ఏమాత్రం విస్మరించకూడదు.

కెరియర్ సంబంధ ఆలోచనలు

సుదూర భవిష్యత్ గురించిన ఆలోచనలు విద్యార్థులను తరచూ భయపెడుతుంటాయి. సీనియర్ ఇంటర్ విద్యార్థు లకు చదువు ఒత్తిడితోపాటు భవిష్యత్తు గురించి కొంత ఆందోళన, భయాలు ఉంటాయి. ఏ ర్యాంకు వస్తే ఎలాంటి కాలేజీలో సీటు వస్తుంది, ఏ కోర్సు ఎంచుకోవాలి, దానికి ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి.. వంటి ఆలోచనలు వేధిస్తుంటాయి.

ఈ సందేహాలు తీర్చుకోవటానికి పరీక్షలకు ముందే విద్యార్థులు కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాలకు హాజరు కావొచ్చు. ఎప్పుడో చేయబోయే ఉద్యోగాల గురించి ఇప్పుడు అనవసర ఆందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు.

కౌమార దశ భావోద్వేగాలు

హార్మోన్ల కారణంగా యువతీయువకుల మధ్య కలిగే పరస్పర ఆకర్షణలు చదువుమీద నుంచి ధ్యాస మళ్లడానికి చాలావరకూ కారణమవుతాయి. కొందరైతే అటువంటి భావనలు కలగడం నైతికంగా తప్పనే అపరాధ భావనతో ఉంటారు.

టీనేజ్ దశలో పరస్పర ఆకర్షణలు సహజమే అయినా, వాటి ప్రభావంతో చదువు దెబ్బతినకుండా జాగ్రత్తపడాలి. ఎక్కువసేపు ఫోన్లలో కబుర్లతో గడపడం, ఒంటరిగా ఉండాలనిపించడం, ఊహల్లో విహరించడం.. వీటన్నిటి ప్రభావం చదువుమీద తప్పకుండా పడుతుంది. ప్రస్తుతం తమ ముందు ఉన్న ప్రాధాన్యాల్లో ముఖ్యమైనదాన్ని, సరైనదాన్ని ఎంచుకునేలా వారిని తల్లిదండ్రులూ, కౌన్సెలర్లూ ప్రభావితం చేయగలగాలి. ఆకర్షణలూ, లైంగిక భావనలూ కలగడం తప్పు కాదు కానీ ప్రస్తుతం అది విద్యార్థుల ప్రాధాన్యం కాకూడదు.

ఇష్టంలేని గ్రూప్ తీసుకుని ఉండటం

కొంతమంది విద్యార్థులు తల్లిదండ్రుల ఇష్టప్రకారం గ్రూప్ తీసుకుని, తరువాత దాంట్లో ఆసక్తిలేక చదువులో రాణించలేరు. అటువంటి సందర్భంలో వారు చదువు మీద, తరగతిలో ఏమాత్రం ఏకాగ్రత చూపించలేరు. ఫలితంగా, సబ్జెక్టు కష్టంగా ఉండటం, చదివింది గుర్తు ఉండకపోవడం, పరీక్షలు దగ్గరకు వస్తుండగానే ఉత్తీర్ణులం కాలేమనీ, తల్లిదండ్రులకు మొహం చూపించలేమనీ ఆందోళనలతో సతమతమవుతుంటారు.

ఆసక్తిలేని సబ్జెక్టును శ్రద్ధగా చదవడం ఎవరికైనా సమస్యే! గ్రూప్ తీసేసుకున్నారు. కాబట్టి శ్రద్ధగా చదివి ముందుకు నడిచి కోర్సు పూర్తిచేయడమే తక్షణ కర్తవ్యం. తమ అభిరుచుల ప్రకారం పై చదువులు చదవడానికి ఏ గ్రూప్‌లోనైనా అవకాశాలు ఉన్నాయనేది గ్రహించి భవిష్యత్తు మీద ఆశ కల్పించుకోవటం ముఖ్యం. అదే సమయంలో ఎటువంటి పైచదువులకైనా ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు తెచ్చుకోవడం అవసరమేననేది విద్యార్థులు గ్రహించాలి.

బ్యాంకుల ప్రైవేటీకరణ ఆషామాషీ కాదు : అరుణ్ జైట్లీ



ఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం వెలుగులోకి వచ్చిన అనంతరం తెరపైకి వచ్చిన బ్యాంకుల ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ స్పందించారు. వివిధ రాజకీయ కారణాల రీత్యా అది సాధ్యపడదని వ్యాఖ్యానించారు. గ్లోబల్ బిజినెస్ సమిట్‌లో ఆయన ప్రసంగిస్తూ పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం అనంతరం చాలామంది బ్యాంకుల ప్రైవేటీకరణ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. అది పూర్తి రాజకీయ సంఘర్షణతో కూడిన వ్యవహారమని వ్యాఖ్యానించారు. దీని కోసం బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాలను సవరించాల్సి ఉంటుందని చెప్పారు. 'నా ఉద్దేశం ప్రకారం ఈ విషయంలో రాజకీయ ఏకాభిప్రాయం సాధ్యపడదు. ఇది చాలా కష్టతరమైన నిర్ణయమ'ని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ఫిక్కీ అధ్యక్షుడు రాకేశ్ షా మాట్లాడుతూ రెండు, మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులు మినహా మిగతా వాటిని ఒక క్రమపద్ధతిలో ప్రైవేటీకరణ చేస్తే బాగుంటుందని ఇది వరకే కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీతో మాట్లాడానని అన్నారు. దీనిపై అసోచామ్ పారిశ్రామిక వర్గాలు కూడా గొంతు కలిపాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్ని 50శాతానికి కుదిస్తే స్టాక్‌హోల్డర్స్, డిపాజిట్‌దారులకు ప్రాముఖ్యానిచ్చి పనిలో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో అవినీతి బాగోతాలు లేవని, ఉన్నా తక్కువస్థాయిలోనే ఉండటంతో బ్యాంకుల ప్రైవేటీకరణ ఒక రకంగా మంచిదేనని ప్రముఖ వ్యాపారవేత్త ఆది గోద్రెజ్ వ్యాఖ్యానించారు. రాహుల్ బజాజ్ సైతం దీనికి మద్దతు తెలిపారు.

నోట్ల రద్దుకు ముందు

90 కోట్ల డిపాజిట్

నీరవ్ బాగోతంపై ఎన్‌సీపీ

ముంబై : వజ్రాలు, బంగారం వ్యాపారి నీరవ్ మోడీ నోట్ల రద్దు ప్రకటించడానికి కొద్ది గంటల ముందు పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) కుంభకోణానికి చెందిన ఒక శాఖలో రూ.90 కోట్లు డిపాజిట్ చేశాడన్న ఆరోపణలకు సంబంధించిన ఒక నివేదికను నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) ఎంపీ మజీద్ మెమన్ ఉటంకించారు. 'దేశం విడిచి వెళ్లిన నీరవ్ మోడీ, 2016లో ప్రధాని మోడీ నోట్ల రద్దును ప్రకటించడానికి కొన్ని గంటల ముందు పీఎన్‌బీలో రూ.90 కోట్లు డిపాజిట్ చేశారు.

బహుశా బంగారం లేదా మరేదైనా మార్పిడి చేసి ఉండవచ్చు. వాస్తవాలు ఏమిటో తెలియాలంటే సరైన దర్యాప్తు జరగాలని భావిస్తున్నా' అని మెమన్ తెలిపారు. ట్విట్టర్‌లో కూడా మెమెన్ అదే విషయాన్ని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, నిందితుడి మధ్య అక్రమ కార్యకలాపాలు జరిగి ఉంటాయన్న అనుమానం వ్యక్తం చేస్తూ 'ఇది ఏమి సూచిస్తుంది' అని ప్రశ్నించారు.

వజ్రాల వ్యాపారులు పుట్టి ముంచేస్తున్నారు

- మోసపోవడంలో పీఎన్‌బీ టాప్..
- ఎస్‌బీఐ కంటే నాలుగు రెట్లు ఎక్కువ నష్టం



బెంగళూరు: ఉద్దేశ్యపూర్వకంగా రుణాలను ఎగ్గొట్టి బ్యాంకులను నట్టేట ముంచడంలో రత్నాల వ్యాపారులు అందరి కంటే ముందున్నట్లు స్పష్టమవుతున్నది. ఇటువంటి 90 మంది ఎగవేతదారుల వల్ల గత ఏడాది మార్చి చివరి నాటికే బ్యాంకులకు దాదాపు రూ.5 వేల కోట్ల నష్టం వాటిల్లిందన్న గణాంకాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. బ్యాంకులకు ఉద్దేశ్యపూర్వకంగా రుణాలను ఎగ్గొట్టిన జెమ్స్ అండ్ డైమండ్ కంపెనీల వివరాలను క్రోడీకరించి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగ సంఘాల సమాఖ్య (ఎఫ్‌బీఐఎస్‌యూ) వెల్లడించిన ఈ గణాంకాలు అందరినీ గ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. ఈ ఎగవేతదారుల వల్ల ఎక్కువగా నష్టపోయిన బ్యాంకుల జాబితాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) అగ్రస్థానంలో ఉన్నది. ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో రెండవదిగా ఉన్న పీఎన్‌బీకి కేవలం 9 మంది ఎగవేతదారుల వల్లనే రూ.1,790 కోట్ల నష్టం వాటిల్లింది. పీఎస్‌బీల్లో అతిపెద్దదైన ఎస్‌బీఐకి ఇటువంటి 15 మంది ఎగవేతదారుల వలన కలిగిన నష్టం (రూ.410 కోట్లు)తో పోలిస్తే పీఎన్‌బీకి వాటిల్లిన నష్టం నాలుగు రెట్లు ఎక్కువ. దేశంలో ఉద్దేశ్యపూర్వక రుణ ఎగవేతదారుల మొత్తం సంఖ్య 5 వేల కంటే కొంచెం ఎక్కువగా ఉందని, వీరి వలన బ్యాంకులకు దాదాపు రూ.49 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఎఫ్‌బీఐఎస్‌యూ గణాంకాలు వెల్లడిస్తుండగా, ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారుల సంఖ్య 8,915 మందికి, వారి వలన బ్యాంకులకు జరిగిన నష్టం రూ.92,376 కోట్లకు పెరిగినట్లు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది మార్చి నెలాఖరు నాటికి 1,120 మంది ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులతో పీఎన్‌బీ అగ్రస్థానంలో నిలువగా, 997 మంది ఎగవేతదారులతో ఎస్‌బీఐ ద్వితీయ స్థానంలో నిలిచింది. రత్నాలు, ఆభరణాల వ్యాపారులు పెద్ద రుణాలతో పాటు చిన్న చిన్న రుణాలను సైతం తిరిగి చెల్లించకుండా బ్యాంకులను ముంచుతున్నారు. విన్సమ్, బ్యూటిఫుల్ డైమండ్స్, ఆరో గోల్డ్ జువెల్లరీ లాంటి సంస్థలు ఇప్పటికే ఎన్నో బ్యాంకులకు రుణాలను ఎగ్గొట్టాయి.

ఇటువంటి కొన్ని కేసుల్లో బకాయిలను వసూలు చేసేందుకు బ్యాంకులు చర్యలు చేపడుతుండగా, మరికొన్ని కేసుల్లో దర్యాప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాంకులను దోచుకునేందుకు ఎన్నో మార్గాలను అనుసరిస్తున్న వ్యాపారులు ప్రధానంగా తమ కంపెనీల పేర్లను తరచుగా మార్చి ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతున్నది. గతంలో స్పెండర్ జెమ్స్ పేరుతో ఏర్పాటైన సంస్థ ఆ తర్వాత బ్యూటిఫుల్ డైమండ్స్‌గా పేరు మార్చుకోవడం ద్వారానూ, జిరో గోల్డ్ జువెల్లరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆ తర్వాత తన పేరులో ప్రైవేట్ అనే పదాన్ని తొలగించడం ద్వారానూ, అలాగే ఘనశ్యామ్‌దాస్ జెమ్స్ అండ్ జువెల్స్ సంస్థ ఆ తర్వాత ఘన్‌శ్యామ్‌దాస్‌గా అవతరించడం ద్వారానూ పలు బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టినట్లు ఎఫ్‌బీఐఎస్‌యూ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

చోక్సీ మహా ముదురు

ప్రముఖులకు ఎర వేయడంలో నేర్పరి



ముంబై: మెహుల్ చోక్సీ... పది రోజుల క్రితం వరకూ ఈయన గురించి చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. కానీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత ఈయన ఖ్యాతి సర్వత్రా వ్యాపించింది. ఈ కుంభకోణంలో తన అల్లుడు, ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీతో పాటు ప్రధాన నిందితుడిగా ఉన్న మెహుల్ చోక్సీని సహచర వజ్రాల వ్యాపారులు పప్పూ అని పిలుస్తుంటారు. పాలన్‌పూర్ (గుజరాత్‌లోని చిన్న పట్టణం)లో పెరిగి పెద్దవాడైన మెహుల్ చోక్సీకి చిన్ననాటి నుంచి అదే ముద్దుపేరు. అంతమాత్రాన ఆయనను నిజంగానే పప్పూ అనుకుంటే తప్పులో కాలు వేసినట్లే. వ్యాపారిగా ముంబైలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఈ పప్పూ బాలీవుడ్ సినీ జనాలతో నిరంతరం ఎంతో సన్నిహిత సంబంధాలను నెరపుతూ ఇప్పుడు ఏకంగా 22 కంపెనీలకు అధిపతిగా వ్యవహరిస్తున్నాడు. ఘనమైన పార్టీలు, అత్యంత ఖరీదైన బహుమతులతో ప్రముఖులకు ఎరవేసి తనకు కావలసిన పనులను చేయించుకోవడంలో ఆయన ఘనాపాటి. ముఖ్యంగా అధికారంలో ఉండే వ్యక్తుల కుటుంబ సభ్యులను, వారితో సన్నిహితంగా మెలిగేవారిని ప్రసన్నం చేసుకుని రీటైనర్‌షిప్ ఒప్పందాలపై సంతకాలు చేయించుకోవడంలో ఆయనది అందె వేసిన చెయ్యి. పీఎన్‌బీ కేసు పరిధి పెరుగుతుండటంతో దర్యాప్తు సంస్థలు ఇప్పుడు పప్పూతో పాటు ఆయన కంపెనీల్లోని డైరెక్టర్లపై కూడా దృష్టి కేంద్రీకరించాయి. వీరిలో పది మంది డైరెక్టర్లు రూ.4,800 కోట్ల మోసానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్నారు. అయితే ఈ టాప్ ఎగ్జిక్యూటివ్‌లలో అనేక మంది సెలబ్రిటీ జువెల్లర్ల గ్లామర్ ప్రపంచానికి చాలా దూరంగా మురికివాడల్లో కూలిపోయేందుకు సిద్ధంగాఉన్న చిన్నచిన్న ఇళ్లలో సాదాసీదా జీవనం గడుపుతున్నారని, దీనిని బట్టి చూస్తుంటే వీరంతా మెహుల్ చోక్సీ వ్యాపార సామ్రాజ్యానికి కేవలం ముసుగు లాంటి వారేనని స్పష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు.

మెహతా దారిలోనే నీరవ్

- సెయింట్ కిట్స్‌లో మోడీ విల్లా
- కుటుంబంతో అక్కడే మకాం

ముంబై : వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ అచ్చం విన్‌సమ్ డైమండ్ గ్రూపు ప్రమోటర్ జతిన్ మెహతా మార్గాన్నే అనుసరించాడు. భారీగా బ్యాంకుల నుంచి రుణాలు పొంది...వాటిని చెల్లించకుండా దేశం వదిలివెళ్లిపోయిన కార్పొరేట్ దిగ్గజాల్లో జతిన్ మెహతా ఒకరు. నీరవ్ మోడీ సైతం పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్లు టోకరా వేసి విదేశాలకు ఉడాయించాడు. దేశం విడిచి వెళ్లడానికి ముందే నీరవ్ మోడీ...విదేశాల్లో జాగా ఏర్పాటు చేసుకున్నారు. విల్లా కొనుగోలు చేశాడు. ఆ తర్వాత తాపీగా కుటుంబంతో సహా ఉడాయించాడు. ఇంతకూ నీరవ్ మోడీ ఎక్కడున్నాడో తెలుసా.. ఈస్టరన్ కరేబియన్‌లోని సిల్వన్ సెయింట్ కిట్స్‌లో సకల సుఖాలు అనుభవిస్తున్నాడు. ఈ విషయాన్ని ముంబై మిర్రర్ వెల్లడించింది. నీరవ్ మోడీ సెయింట్ కిట్స్‌లో విల్లా కొనుగోలు చేసినట్టు ముంబై, సూరత్‌లోని వజ్రవ్యాపారులు చెబుతున్నారు. అక్కడ ఆయనకు పౌరసత్వం సైతం ఉన్నది. నీరవ్ మోడీ ఏనాడో ఈ ప్రణాళిక రచించుకున్నాడు. వాస్తవంగా ఆయన కుటుంబంతో గతవారమే సెయింట్ కిట్స్ చేరుకున్నాడని ముంబై మిర్రర్‌కు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కామన్‌వెల్త్‌లో భాగస్వామి అయినప్పటికీ సెయింట్ కిట్స్‌తో భారత్‌కు నేరస్తుల అప్పగింత ఒప్పందం లేదు. అందువల్ల నీరవ్ మోడీకి అదే సురక్షిత ప్రాంతం. నీరవ్‌ను అక్కడి నుంచి భారత్‌కు తీసుకొచ్చే సత్తా ఏ నాయకుడు లేదా ప్రభుత్వానికి లేదు. భారత్‌తో ఒప్పంద భాగస్వాములు సైతం భారత్ అభ్యర్థనలను పట్టించుకోవడం లేదు. పెడచెవిన పెడుతున్నాయి.

ఒప్పందం లేకుండా ఖైదీలు లేదా నేరస్తుల అప్పగింత సాధ్యపడే అవకాశమే కనిపించడం లేదు. స్వదేశీ విధానాల్లో భాగంగానే భారతదేశ విజ్ఞప్తిని పరిశీలిస్తామని కొన్ని దేశాలు అంటున్నాయి. అయితే, ఈ దిశగా ఇప్పటి దాకా ఒక్క కేసు విజయవంతం కాలేదు. పెట్టుబడుల కార్యక్రమం ద్వారా దరఖాస్తుదారుడు పౌరసత్వం పొందవచ్చని సెయింట్ కిట్స్, నెవీస్ ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఆ ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో ఈ విషయం పొందుపరిచారు. సుగర్ ఇండస్ట్రీ డైవర్సిఫికేషన్ ఫౌండేషన్(ఎస్ఐడీఎఫ్)కు భాగస్వామిగా ఉండటం ద్వారా పౌరసత్వానికి ఏ పౌరుడైనా అర్హుడుగా ఉండవచ్చని పేర్కొన్నాయి. ఒక్కో దరఖాస్తుదారుడు రూ.1.6 కోట్లు చెల్లించాల్స ఉంటుంది. ఆ డబ్బు తిరిగి చెల్లించడం కుదరదు. అలాంటి పకడ్బందీ ప్రాంతంలో నీరవ్ మోడీ తలదాచుకుంటున్నాడు.

రైల్వేజోన్ ప్రకటన జాప్యానికి

బాబే కారణమా!?

- 3 ఏళ్ల క్రితమే సిద్ధమైన రైల్వే బోర్డు
- సురేష్‌ప్రభు ప్రతిపాదనకు సీఎం నో?
- విశాఖ కేంద్రంగా కోరడంతో వెనకడుగు



విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: నవ్యాంధ్రలో కొత్త రైల్వే జోన్ ప్రకటనలో జాప్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరే ప్రధాన కారణమని తెలుస్తోంది. మూడేళ్ల క్రితం కేంద్రం చేసిన ప్రతిపాదనకు బాబు ఓకే చెప్పి ఉంటే ఈపాటికి కొత్త రైల్వేజోన్ ఏర్పడి ఉండేదని అధికారపార్టీకి చెందిన నేతలే అంగీకరిస్తున్నారు. వీరి అభిప్రాయాలతో రైల్వే అధికారులు సైతం ఏకీభవిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో 'దక్షిణ కోస్తా రైల్వే' కొత్త జోన్‌ను ఏర్పాటు చేసేందుకు 2015లో అప్పటి రైల్వేశాఖమంత్రి సురేష్‌ప్రభు ప్రతిపాదన చేస్తే చంద్రబాబు మాత్రం విశాఖ కేంద్రంగానే కొత్త రైల్వేజోన్ కోసం పట్టుబట్టినట్లు విశ్వసనీయ వర్గాల కథనం. ముందుగా మూడు డివిజన్లతో కొత్త జోన్‌ను ఏర్పాటు చేద్దాం.. తర్వాత విశాఖ డివిజన్‌ను తూర్పు కోస్తా నుంచి విడదీసి దక్షిణ కోస్తాలో విలీనం చేసేందుకు యత్నిద్దామని ప్రభు చెప్పినప్పటికీ బాబు అంగీకరించలేదు. ఈ విషయంలో ఎంపీలు రాయపాటి సాంబశివరావు, కేశినేని శ్రీనివాస్, గల్లా జయదేవ్, జేసీ దివాకర్‌రెడ్డి తదితర ఎంపీలు బాబుకు నచ్చ చెప్పేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పట్లో ఈ విషయమై ఆందోళన చేయాల్సిందిగా రైల్వే సంఘాల నేతలతో కొందరు ఎంపీలు మంతనాలు కూడా సాగించినట్లుగా తెలిసింది. అయితే జోన్ ఏర్పాటు రాజకీయ నిర్ణయం కనుక తాము జోక్యం చేసుకోవడం తగదని నేతలు స్పష్టం చేసారు. దీంతో ఎంపీలు చేసేదేమీలేక అయిష్టంగానే విశాఖ కేంద్రంగా కొత్త జోన్ ఇవ్వాలంటూ ప్రకటనలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. జోన్ ఏర్పాటుపై అప్పటి రైల్వేబోర్డు చైర్మన్ మిట్టల్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి అధిక ఆదాయం విశాఖ నుంచే వస్తున్నందున తూర్పుకోస్తా రైల్వే నుంచి దానిని వేరు చేయడం కుదరదని నివేదికలో స్పష్టంగా పేర్కొంది. రైల్వే పరంగా చంద్రబాబుకు సరైన అవగాహన లేకపోవడం వల్లే ప్రస్తుతం ఈ సమస్య జఠిలంగా మారిందని దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఓ ఉన్నతాధికారి 'విశాలాంధ్ర' ప్రతినిధికి తెలిపారు. భారీగా ఆదాయం వచ్చే విశాఖ డివిజన్‌ను వదులుకునేందుకు ఒడిశా సిద్ధంగా లేనందున ప్రత్యామ్నాయం వైపు చూడకుండా మొండిపట్టు పట్టడం వల్లే ఏపీ నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. వాస్తవానికి విభజన చట్టంలో కొత్త జోన్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఉందే తప్ప కచ్చితంగా ఇవ్వాలని పేర్కొనలేదన్న విషయాన్ని ఆయన ఈసందర్భంగా గుర్తు చేశారు.

విజయవాడకే అధికారులు మొగ్గు?

కొత్త జోన్‌కు కేంద్రంగా విశాఖపట్నం కంటే విజయవాడే అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ అయితే రాజధానికి చేరువలో ఉంటుందని చెబుతున్నారు. అదీకాక రైల్వేశాఖకు కృష్ణా కెనాల్ జంక్షన్ వద్ద 2 వేల ఎకరాలు, గుంటుపల్లి వద్ద 100 ఎకరాల స్థలం ఉన్నందున పరిపాలన భవనాలను నిర్మించేందుకు కొత్తగా భూములను సేకరించాల్సిన అవసరం లేదంటున్నారు. అలాగే విజయవాడలో విద్య, వైద్య రంగాలు బాగా అభివృద్ధి చెందడమే కాకుండా అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉంటుందని చెబుతున్నారు. ముందుగా విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో కొత్త జోన్ ఏర్పాటైతే తర్వాత విశాఖ డివిజన్‌ను కలుపుకోవచ్చని సూచిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ కూడా తొలినాళ్లలో గుంతకల్ డివిజన్ లేకుండానే ఆవిర్భవించిందని, పదేళ్ల తర్వాత రాజకీయ వత్తిళ్ల కారణంగా దక్షిణ మధ్య రైల్వేలో చేర్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా తాత్సారం చేయకుండా విశాఖ లేకుండానే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు ఏపీ ప్రభుత్వం అంగీకరించడమే మేలంటున్నారు. త్వరలో విభజన హామీల అమలు, బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై కేంద్రంతో ఏపీ అధికారులు భేటీ అవుతున్నందున మూడు డివిజన్లతో కూడిన కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకు అంగీకరించాలని అధికారులతోపాటు కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

రెండు డజన్ల ఐపీవోలు సిద్ధం

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లు భారీ ఊగిసలాట మధ్య ట్రేడ్‌అవుతున్నా పెట్టుబడి దారులకు నమ్మకం ఏమాత్రం సడలలేదు. అందుకే దాదాపు రెండు డజన్ల కంపెనీలు వ్యాపార విస్తరణకు సిద్ధమైపోయాయి. దీనికి వారు ఐపీవోనే సరైన మార్గంగా ఎంచుకున్నారు. ఈ ఐపీవోల మొత్తం విలువ రూ.25వేల కోట్లకు పైమాటే. మూలధనం పెంచుకోవడానికి, వ్యాపార విస్తరణకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు ఆ కంపెనీలు సెబీకి అందజేసిన సమాచారాన్ని బట్టి అర్థమవుతోంది. పబ్లిక్ ఆఫర్లకు వస్తున్న కంపెనీల్లో హిందూస్తాన్ ఏరోనాటిక్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, బార్బెక్యూనేషన్ హాస్పటాలిటీ, ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్ వంటి సంస్థలు ఉన్నాయి. లిక్విడిటీ కోసం.. ప్రస్తుతం ఐపీవోకు వస్తున్న కంపెనీలు మరో ముఖ్య విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకున్నాయి. ప్రస్తుతం ఉన్న షేర్ హోల్డర్లకు లిక్విడిటీ పెరిగే విధంగా వాటాలను స్టాక్ మార్కెట్లలో నమోదు చేస్తున్నాయి. దీంతోపాటు బ్రాండ్ విలువను మరింత పెంచేదుకు ఈ చర్య దోహదపడవచ్చని అంచనా వేస్తున్నాయి.

ధీమా లేని బీమా

- పెరిగిన ఆర్థిక నేరాలు
- రెండేళ్లలో 30 శాతం పెరుగుదల



ముంబై : వేలాది కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగనామం పెట్టి విదేశాలకు చెక్కేస్తున్న రాజకీయ ఆశ్రితులు, మోసగాళ్ల వార్తలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రుణాలు తీసుకొని చెల్లించకుండా ఉన్న బడాబాబుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మోసాలు బ్యాంకింగ్ రంగంలోనే కాదు, ఈ జాడ్యం జీవిత బీమా రంగాన్ని కూడా అంటుకుంది. ఇటీవల కాలంలో బీమా రంగంలోనూ ఆర్థిక నేరాలు పెరిగాయని ప్రపంచ స్థాయి 'ఈ అండ్ వై' సర్వే సంస్థ తెలియచేసింది. గత రెండేళ్ల కాలంలోనే 30 శాతం ఆర్థిక నేరాలు పెరిగినట్లు సర్వేలో పాల్గొన్న 56 శాతం మంది తెలియచేశారు. సాధారణంగా బీమా రంగంలోని క్లెయిమ్‌ల విభాగంలో మోసాలకు ఎక్కువగా అవకాశం ఉంది. ఇటీవల కాలంలో కమీషన్‌ల చెల్లింపులు, పేరుకుపోయిన ప్రీమియం మొత్తాలను వన్‌టైమ్ చెల్లింపులు స్వీకరించడంలోనూ మోసాలు పెరిగినట్లు సర్వే తెలిపింది. మరోవైపు ఇన్సూరెన్స్ కంపెనీలపైనా ఆదాయం పెంచాల్సిందిగా ఒత్తిడి గణనీయంగా పెరిగింది. ఫలితంగా దరఖాస్తులలో లోపాలు, వివిధ పత్రాలను సరిగా పూర్తిచేయలేక పోవడం, వాటిని తనిఖీ లేకపోవడం లాంటి అంశాలలోనూ లోపాలు పెరిగాయి. మూడో పార్టీతోటి సంప్రదించవలసిన అవసరాలు పెరగడం, వ్యక్తిగత సమాచారం నియంత్రణకు సంబంధించిన సంక్లిష్టతలు, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందడం వివిధ రకాల బీమా ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించిన అంశాలలో డబ్బు దుర్వినియోగం చేసే అవకాశం పెరిగినట్లుగా సర్వే పేర్కొంది. డీడీల ద్వారా చెల్లింపులు జరిగినప్పుడు డబ్బు దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోందని సర్వేలో పాల్గొన్న 25 శాతం మంది అభిప్రాయ పడ్డారు. ఆర్థిక నేరాలకు లావాదేవీల నిర్వహణ తనిఖీ లేకపోవడం లేదా అవకాశాలు లేకపోవడం ఆర్థిక నేరాలకు కారణమవుతోందని 30 శాతం మంది తెలిపారు. ఈ నేపథ్యంలో బీమారంగంలోని అన్ని విభాగాలలోనూ కఠినమైన నియమ నిబంధనలు, తనిఖీలు జరగవలసిన అవసరం ఉందని పలువురు సూచించారు. పాలసీ తీసుకున్న వ్యక్తుల పూర్తి సమాచారం, వారి నేపథ్యాన్ని సైతం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే సమాచార బయటికి పొక్కడం, సైబర్ నేరాలు ఆర్థిక నేరాలకు దోహదం చేస్తున్నదని 40 శాతం మంది అభిప్రాయపడ్డారు. నకిలీ డాక్యుమెంట్లను తయారు చేయడం ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు 28 శాతం మంది భావిస్తున్నారు.



'హోదా' సాధనలో కేంద్రం వివక్ష

- నాలుగేళ్లయినా రాష్ట్రానికి మొండిచేయి
- బాబు, మోడీ హామీల వైఫల్యం
- కేంద్ర మాజీ మంత్రి జైరామ్ రమేష్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల సాధనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షత చూపుతున్నాయని కేంద్ర మాజీ మంత్రి జైరామ్ రమేష్ విమర్శించారు. విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన విభజన చట్టం సరిగ్గాలేదంటూ సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న వ్యాఖ్యలన్నీ అవాస్తవాలని ఖండించారు. కాంగ్రెస్ రూపొందించిన చట్టంలో లోటుపాట్లుంటే..నాలుగేళ్ల నుంచి ఈ చట్టాన్ని టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలు ఎందుకు సవరించలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో తిరుపతి వేదికగా మోడీ, చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామంటూ చేసిన ప్రకటన ఏమైందని నిలదీశారు. బీజేపీ అధికారంలోకి వస్తే పదేళ్లపాటు హోదా ఇస్తామని ప్రకటించిన వెంకయ్యనాయుడు ఇప్పుడు ఏమంటారని ప్రశ్నించారు. హోదా అమలుపై 14వ ఆర్థిక సంఘం అభ్యంతరం చెప్పిందన్న కేంద్ర ప్రభుత్వ వ్యాఖ్యలన్నీ అవాస్తవాలని పేర్కొన్నారు. ఏపీకి హోదా లేదంటూ కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ చేసిన వ్యాఖ్యలతోనే చంద్రబాబు నిదుర లేశారని గుర్తుచేశారు. దేశ వ్యాప్తంగా 11రాష్ట్రాలు ప్రత్యేక హోదాను అనుభవిస్తున్నాయని వివరించారు. 12వ రాష్ట్రంగా ఏపీకి హోదా కేటాయించేందుకు మోడీకి అభ్యంతరం ఏమిటనీ ప్రశ్నించారు. విభజన చట్టంలో పోలవరాన్ని కేంద్రమే కట్టాలని వుంటే...రాష్ట్రం ఎందుకు నిర్మిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి అన్ని విషయాల్లోనూ అన్యాయం జరుగుతుంటే చంద్రబాబు ఎందుకు మౌనంగా వుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు, మోడీ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. అటు చంద్రబాబు విదేశీ పర్యటనల్లో వుండి, ఇటు పార్లమెంటులో టీడీపీ ఎంపీలచేత ఆయన హోదాపై డ్రామాలు ఆడిస్తున్నారని విమర్శించారు. మోడీతో చంద్రబాబు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన చంద్రబాబు, మోడీలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వల్లీ, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు మీసాల రాజేశ్వరరావు, జంగా గౌతమ్, అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ, ఏపీ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇందిరాగాంధీ' పుస్తకం ఆవిష్కరణ

విజయవాడ ఏ-1 కన్వెన్షన్ సెంటరులో 'ఇందిరాగాంధీ (ఒక ప్రకృతి ప్రేమికురాలి జీవితం)' పుస్తకాన్ని ఆదివారం పలువురు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు జైరామ్ రమేష్, జేడీ శీలం, ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సీనియర్ సంపాదకులు కె.రామచంద్ర మూర్తి, ఎమెస్కో అధినేత విజయ్‌కుమార్, పలువురు రచయితలు పాల్గొన్నారు.

ఎఫెర్పి కొనుగోలుకు జేఎస్‌డబ్ల్యూ యత్నాలు

ముంబై: ఇటలీకి చెందిన ఎఫెర్పి స్టీల్ సంస్థ కొనుగోలుకు భారత్‌కు చెందిన ప్రైవేటు రంగసంస్థ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ యత్నాలు ప్రయత్నాలు చేస్తోంది. ఈ డీల్ విలువ సుమారు రూ.600 కోట్లు ఉండవచ్చని అంచనా. ఇప్పటికే చర్చలు తుదిదశకు చేరుకున్నట్లు సమాచారం. మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో దీనిపై ప్రకటనవెలువడవచ్చని భావిస్తున్నారు. ఎఫెర్పి సంస్థ రైల్వేలకు సంబంధించిన పరికరాలు, ఆటోమొబైల్స్‌లో వినియోగించే బార్లు, ఎర్త్ మూవింగ్ వెహికల్స్ తయారు చేస్తుంది. ఈ సంస్థ ఇటలీలో రెండో అతిపెద్ద స్టీల్ ఉత్పత్తిదారు. ఈ సమాచారంపై జేఎస్‌డబ్ల్యూ మాత్రం స్పందించలేదు. యూరప్‌లోని జేఎస్‌డబ్ల్యూ సంస్థకు ఆటోమొబైల్ కస్టమర్లు ఉన్నారు. వారి అవసరాలు తీర్చేందుకు భారత్ నుంచి రోల్డ్ కాయిల్స్‌ను ఇటలీ తరలించి అక్కడ వాటిని ఆటోమొబైల్ పరిశ్రమ అవసరాలకు తగినట్లు మార్చి విక్రయించాలని భావిస్తోంది. యూరోప్‌లో ఒక కర్మాగారం ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యూ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. 2014లో ఇటలీ లోని లుచ్చీని సంస్థను కొనుగోలు చేయాలని భావించింది. కానీ అల్జీరి యాకు చెందిన సెవిటాల్ దీనిని కొనుగోలు చేయడంతో ప్రయత్నాలు ఫలించలేదు.

'ఉర్జిత్ రాజీనామా చేయాలి'

బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటాచలం డిమాండు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ భారత రిజర్వు బ్యాంకు గవర్నరు ఉర్జిత్ పటేల్ రాజీనామా చేయాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్ వెంకటాచలం డిమాండ్ చేశారు. రూ.11,400కోట్ల రుణాలను ఎగ్గొట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండటంలో ఆర్ బీఐ గవర్నరు ఆంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు. బ్యాంకులపై పర్యవేక్షణ కొరవడిందనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని, ఆర్‌బీఐ నిర్లక్ష్యం, వైఫల్యం ఇందులో కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆయన విమర్శించారు. 'ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయనే స్వతహాగా గవర్నర్ పదవి నుంచి తప్పుకోవాలి. ఆర్‌బీఐకి చెందిన నామినీలు పీఎన్‌బీలో ఉన్నారు కాబట్టే ఈ విషయంపై అధికారులు మిన్నకుండిపోయారని ఆయన ఆరోపించారు. నీరవ్ మోడీ ఘటన తర్వాతైనా బ్యాంకుల అకౌంట్ వివరాలను ఆర్‌బీఐ పరిశీలించలేదు. ఇప్పటికైనా స్పందించకపోతే భారీగా నష్టపోతారని ఆయన హెచ్చరించారు.

ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు

న్యూఢిల్లీ: రాష్ట్రాల మధ్య ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు విధానం అమల్లోకి రానున్నది. ఇక్కడ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నెట్‌వర్క్‌పై జైట్లీ నేతృత్వంలో సమావేశమైన రాష్ట్ర ఆర్థిక మంత్రుల బృందం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల మధ్య రూ.50,000, అంతకంటే ఎక్కువ విలువైన ఉత్పత్తుల రవాణాకు ఎలక్ట్రానిక్ వే బిల్లును ఏప్రిల్ 1 నుంచి తప్పనిసరి చేశామని ఆర్థిక మంత్రుల బృందానికి నాయకత్వం వహిస్తున్న బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోడీ తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు విధానం ద్వారానే అంతర్రాష్ట్ర గూడ్స్ రవాణా ఉండాలని మేము నిర్ణయించాం అని సమావేశం అనంతరం విలేఖరులకు సుశీల్ మోడీ తెలిపారు. అయితే ఐటీ నెట్‌వర్క్ సిద్ధంగా లేకపోవడంతో ఈ-వే బిల్లు అమలు ఇన్నాళ్లూ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నెల 1 నుంచే అమల్లోకి రావాల్సింది. కానీ వాయిదా వేశారు. అంతా సిద్ధం కావడం, అడ్డంకులన్నీ తొలగిపోవడంతో ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే రెండుసార్లు ఈ-వే బిల్లు వేదికను పరిశీలించామని సుశీల్ వెల్లడించారు. ఇక జీఎస్టీఎన్ పోర్టల్‌పై రోజుకు 6.5 లక్షల ఈ-వే బిల్లుల్ని జారీ చేయవచ్చన్న జీఎస్టీఎన్ సీఈవో ప్రకాశ్ కుమార్.. మొత్తం వ్యవస్థను ఆధునికీకరించామని, అదనపు భారాన్ని మోయగలదన్న ధీమాను వ్యక్తం చేశారు.

కుదరని ఏకాభిప్రాయం : ఇదిలావుంటే జీఎస్టీ విధానం కింద వ్యాపార రిటర్నుల దాఖలు ప్రక్రియను ఎలా సరళతరం చేయాలన్న దానిపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. సమావేశంలో ఈ అంశంపై కూలంకషంగా చర్చించినప్పటికీ, ఏకాభిప్రాయం కుదరలేదని విలేఖరులతో సుశీల్ మోడీ చెప్పారు. ఈ క్రమంలోనే జీఎస్టీఆర్-3బీ మరికొంత కాలం కొనసాగుతుంది అని అన్నారు.



పోషక విలువలను అందించే గోధుమ రవ్వ

ప్రస్తుతం మనం అనుసరిస్తున్న ఉరుకులు పరుగుల కాలంలో ఆరోగ్యకరంగా తినడం ఎంతో అవసరం. కాని మనం తినే ఆహారంలో అన్నీ పోషక విలువలు ఉండవు, ముఖ్యంగా ప్రోటీన్స్. హోల్ గ్రేయిన్లు వీటిలోని పోషకాలతో సరైన ఆహారాలు అవుతాయి. అలాంటిదే దలియ(గోధుమరవ్వ). దలియ వలన కలిగే ప్రయోజనాలను పరిశిలిద్దాం.

ప్రోటీనులకు ప్రసిద్ధి

దలియలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. బరువు పెరగడానికి, కండరాల నిర్మాణానికి ఇది సరైన ఆహారం. దీన్ని వేళలోనైన తీసుకోవచ్చు, అల్పాహారంగా , లంచ్‌లో లేదా డిన్నర్‌లో ఏ వేలలోనైనాసరే. దీనితో శరీరానికి కావాల్సిన ప్రోటీన్ల్ కూడా లభిస్తాయి.

బరువు నియంత్రణ

దలియలో ఫైబర్‌లు కూడా అధికంగా ఉంటాయి, ఇవి ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న భావనను కలిగిస్తాయి, దీనితో తినాలనే కార్వింగ్ ను అదుపులో ఉంచుతాయి. తద్వారా, జంక్‌ఫుడ్ తినడానికి దూరంగా ఉండవచ్చు. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్‌గా దీన్ని తీసుకోవడంతో రోజంతా చురుగ్గా ఉండడమే కాదు, అవసరమైన న్యూట్రిషన్లు కూడా లభిస్తాయి.

బ్లడ్ షుగర్‌ను నియంత్రిస్తుంది

షుగర్ ఉన్నవారికి ఇది సరైన ఆహారం. దీంట్లోని తక్కువ గ్లైసేమిక్ ఇండెక్స్, కాంప్లెక్స్ కార్బ్స్ శరీరంలోకి గ్లూకోజ్‌ను నియంత్రణను క్రమబద్ధికరిస్తాయి. దీనితో షుగర్ లెవెల్స్ నియంత్రించడం సులువు అవుతుంది.

మెటబాలిజం పెరుగుదల

రోజు దలియ తినడం వలన శరీర సామర్థ్యం పెరిగి మెటబాలిజం కూడా మెరుగుపడుతుంది. అంతేకాక, ఇది మలబద్ధకాన్ని కూడా నిర్మూలించడంలో ఎంతగానో దోహదపడుతుంది. దీనిలోని హై ఫైబర్, ప్రోటీన్స్ దలియను సూపర్ ఫుడ్‌గా చేస్తాయి.

సైలెంట్ హార్ట్ అటాక్ బహిర్గత లక్షణాలు



హార్ట్ అటాక్ లేదా గుండెపోటు చాలా ప్రమాదకరమైన వ్యాధి. ఆకస్మికంగా కలిగే సైలెంట్ హార్ట్ అటాక్ వలన పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

హార్ట్ అటాక్ కు గురవటానికి ముందు ఛాతిలో నొప్పి లేదా అసౌకర్యంగా అనిపించటం, జలుబు లేదా బలహీనంగా అనిస్తుంది. కానీ, కొంతమందిలో ఎలాంటి లక్షణాలు బహిర్గతం అవకుండా మరణిస్తున్నారని తెలుసా? గుండెపోటు మధుమేహులు స్త్రీలలో అధికంగా కలుగుతుంది. సైలెంట్ హార్ట్ అటాక్ కలిగే ముందు బహిర్గతమయ్యే లక్షణాలు ఈవిధంగా ఉంటాయి.

అలసట

సైలెంట్ హార్ట్ అటాక్ కు గురయ్యే ముందు బహిర్గతమయ్యే సాధారణ లక్షణం ముఖ్యంగా ఇది స్త్రీలలో బహిర్గతం అవుతుంది. సైలెంట్ హార్ట్ అటాక్ గురయ్యే వారిలో గుండె కండరాలపై ఒత్తిడికి గురవటం వలన గుండెకు అందే రక్తప్రవాహం తగ్గి, అలసటకు గురవుతారు. ఒకవేళ మీరు తీవ్రమైన అలసటకు గురైనపుడు గుండెపని తీరును ఎలక్ట్రోగ్రామ్ ద్వారా తెలుసుకోండి.

గొంతు, మెడ లేదా దవడలో అసౌర్యంగా అనిపించటం

మీ మెడ, దవడ లేదా ఒక దంతం లేదా గొంతు భాగంలో బిగుతుగా అనిపిస్తుందా? అయితే ఇది సైలెంట్ హార్ట్ అటాక్‌కు ఒక సూచికగా అని చెప్పవచ్చు. మీరు ఇలాంటి లక్షణాలను గమనించినపుడు వెంటనే వైద్యుడిని కలవండి.


కడుపులో కలతలు

కడుపులో కలిగే కలతల సమస్యలతో సతమతం అవుతున్నారా? ఇదొకవేళ సైలెంట్ రక్తపోటు సంబంధిత లక్షణం కావచ్చేమో చూసుకోండి. సైలెంట్ హార్ట్ అటాక్ కలిగే ముందు వాంతులు లేదా పూర్తి జీర్ణాశయ సమస్యలు కలగవచ్చు. కడుపులో కలతలు లేదా మెడ లేదా దవడ ప్రాంతంలో అసౌకర్యాలను గమనిస్తే వెంటనే వైద్యుడిని కలవండి.

గుండెమంట

భోజనాన్ని ఎక్కువగా తినటం వలన కూడా గుండెమంట కలుగుతుంది. దీని గురించి మీరు బాధపడాల్సిన అవసరం లేదు. కానీ, ఒకవేళ అసాధారణ గుండెమంట కలిగితే మాత్రం సైలెంట్ హార్ట్ అటాక్ బహిర్గత లక్షణంగా పేర్కొనవచ్చు. హార్ట్ అటాక్ సమయంలో ఛాతిలో కలిగే నొప్పి గుండెమంట లాగా అనిపిస్తుంది ఎందుకంటే గుండెకు అందే రక్త ప్రవాహం తగ్గటం వలన అని చెప్పవచ్చు.

ఊపిరితిత్తుల కేన్సర్ లక్షణాలు



మారుతున్న వాతావరణ పరిస్థితులు, ముఖ్యంగా పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం అనేక రకాల వ్యాధులకు కారణం అవుతున్నాయి. ఊపిరితిత్తుల కేన్సర్ వీటిల్లో ప్రథమ స్థానంలో ఉంది. చాలావరకు దిన్ని సులువుగానే గుర్తించవచ్చు. కొన్ని లక్షణాలు దీని సంకేతాలను చాల ముందుగానే అందిస్తాయి. వీటిని పరిశిలిద్దాం.

రక్తంతో కూడిన దగ్గు

ఎక్కువ రోజులు దగ్గుతో బాధపడుతుంటే, తేలిగ్గా తీసుకోవద్దు. లంగ్ కేన్సర్‌తో బాధపడేవాళ్ళు ఎక్కువ శాతం దగ్గుతుంటారు, ముఖ్యంగా దగ్గినప్పుడు రక్తం రావడం లాంటి దగ్గుతో. మీరు కూడా అలంటి దగ్గుతో సతతమతమైతే అలక్ష్యం చేయకుండా ఉపిరితిత్తులను కూడా పూర్తిగా పరిక్షించడం మరవకండి.

బోన్స్‌లో నొప్పి

ఒకవేళ ఈ కేన్సర్ కనుక వేరే భాగాలకి సోకితే వివిధ రకాల ఇతరత్రా సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వీటిలో ప్రథమంగా బోన్స్, జాయింట్స్‌లో నొప్పి రావడం. హిప్ భాగంలో, వెనక భాగంలో ముఖ్యంగా. ఇలా రావడానికి వేరే కారణాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్-డి తక్కువగా ఉండడం వల్లకూడా. బోన్స్ పైన మిగతా లాంగ్ కేన్సర్ లక్షణాలతో పాటుగా కనిపిస్తే ఇదేనని అర్థం.

తీవ్ర అలసట, కండరాల బలహీనత

మీరు ఎంత అలసటకు గురి అవుతారు అంటే, ఇక బెడ్ ఎక్కేయడానికి ఎ మాత్రం ఆలస్యమే చేయలేనంతగా. ఉపిరితిత్తుల వ్యాధి అంతగా అలసటకు గురిచేస్తుంది. అంతేకాకుండా ఇది కండరాలను కూడా తీవ్రంగానే దెబ్బతీస్తుంది. ముఖ్యంగా హిప్ ప్రాంతంలోని కండరాలను. కొనిసార్లు కూర్చున్న దగ్గరినుండి లేవడం కూడా ఇబ్బందిగానే ఉంటుంది. ఇలాంటి లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అన్న పరీక్షలు చేయించాలి.

మెడ, మొహం వాయడం

లంగ్ సంబంధిత వ్యాధితో సతమతమవుతున్నప్పుడు ఒకవేళ మెడపై, ముఖం పై వాపును గమనిస్తే ఇది లంగ్ కేన్సర్ అవడానికి అవకాశాలున్నాయి. ట్యూమర్ వెనుక దమనిని ఒత్తిడికి గురిచేయడం వలన గుండె నుండి తల చేతుల వైపు రక్తప్రసరణకు ఆటంకం కలుగుతుంది. దీనితో ఈ ప్రాంతంలో వాపు సంభవించవచ్చు. వీటిల్లో ఏ రకమైన లక్షణాలు కనిపించినా ఆలస్యం చేయకుండ డాక్టర్ని సంప్రదించండి.

ద్రాక్షల్లో మాంసాహారానికి దీటైన ప్రోటీన్లు



ద్రాక్షల్లోని ల్యూటెన్, యాంటీయాక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. హృద్రోగాలను నియంత్రిస్తాయి. ద్రాక్షల్లో వుండే పొటాషియం, పీచు ద్వారా బీపీని అదుపులో వుంచుకోవచ్చునని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. ద్రాక్షల్లోని క్వసిటిన్ అలర్జీని దూరం చేస్తుంది. నాడీ వ్యవస్థకు మేలు చేస్తుంది. ద్రాక్షలను రోజు గుప్పెడు తీసుకుంటే మధుమేహం దరిచేరదు.

ద్రాక్ష రసాన్ని తాగినట్లైతే గుండెను పదిలంగా వుంచుకోవచ్చు. ద్రాక్ష పండ్లు ఉదర సంబంధిత రోగాలను నయం చేస్తాయి. రోజూ ద్రాక్షలను తీసుకోవడం ద్వారా మాంసాహారానికి ధీటుగా ప్రోటీన్లు పొందవచ్చు. రోజూ ద్రాక్షలను తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. రోజూ గ్లాసుడు మేర ద్రాక్ష రసం తీసుకుంటే తలనొప్పిని దూరం చేసుకోవచ్చు. ద్రాక్షల్లో మాంసాహారానికి ధీటైన ప్రోటీన్లు వున్నాయని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

అందం.. అభినయం.. ఆమె ఆభరణం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :

భారతీయ వెండి తెరపై తనదైన ముద్ర వేసుకొని, అతిలోక సుందరిగా ప్రసిద్ధి గాంచిన ప్రముఖ సినీనటి శ్రీదేవి అకాలమృతి అందరినీ శోకసంద్రంలో ముంచేసింది. శ్రీదేవి ఏ ఒక్క భాషకు పరిమితం కాలేదు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ సహా అనేక భాషలలో నటించి కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆమె మరణం టాలీవుడ్ పరిశ్రమను దిగ్భ్రాంతికి గురి చేసింది. శ్రీదేవి మృతి పట్ల సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. ఆమెతో కలిసి పనిచేసిన దర్శకులు, సహనటులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమెతో అనుబంధాన్ని గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అసమాన అభినయ ప్రతిభతో శ్రీదేవి భారత ప్రేక్షకలోకం అభిమానాన్ని చూరగొన్నారు. శ్రీదేవి ఇక లేరు అనే మాట నమ్మలేనిది. ఆమె వెండితెరపై పోషించిన భిన్నమైన పాత్రలన్నీ చిరస్మరణీయాలే. బాలనటిగా, కథానాయికగా దక్షిణ భారత సినీ రంగంలో విజయాలు అందుకున్న శ్రీదేవి...అదేస్థాయిలో హిందీ ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. బడిపంతులు సినిమాలో బాలనటిగా 'బూచాడమ్మా బూచాడు' అనే పాటలో కళ్లు అటూ ఇటూ తిప్పుతూ పలికించిన హావభావాల్ని ప్రేక్షకులు మర్చిపోలేరు. ఇండియాస్ మోస్ట్ గ్లామరస్ హీరోయిన్ శ్రీదేవి..54 ఏళ్ల వయస్సులో 300 సినిమాలకు పైగా నటించి అందరికీ షాక్ ఇచ్చారు. చివరిగా మామ్ చిత్రంలో నటించిన శ్రీదేవి జీరోలోను ఓ ముఖ్య పాత్ర పోషించినట్టు సమాచారం.

శ్రీదేవి మృతి తనను కలచివేసిందని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు విచారం వ్యక్తం చేశారు. తాను అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి శ్రీదేవితో పరిచయం ఉందని, పదహారేళ్ల వయసు నుంచి జగదేకవీరుడు అతిలోక సుందరి వరకు తనతో చాలా సినిమాలు తీశానని, శ్రీదేవి చిత్రపరిశ్రమలో స్వయంకృషితో ఎదిగారని గుర్తు చేసుకున్నారు. శ్రీదేవి మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సూపర్‌స్టార్ కృష్ణ పేర్కొన్నారు. తనతో శ్రీదేవి 31 సినిమాల్లో నటించారని, తమ ఇంటి పక్కనే శ్రీదేవి ఇల్లు ఉండేదని, నరేష్, శ్రీదేవి కలిసి ఆడుకునే వారని కృష్ణ గుర్తుచేశారు. సినీనటుడు చిరంజీవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'జగదేక వీరుడు-అతిలోక సుందరి'లో ఇంద్రజ పాత్ర తన కోసమే పుట్టిందా అన్నట్లు నటించి మెప్పించారని, శ్రీదేవితో తనకు కెరీర్ పరంగానే కాకుండా కుటుంబ సాన్నిహిత్యమూ ఉందన్నారు. శ్రీదేవి భౌతికంగా మనమధ్య లేకపోయినా ప్రేక్షకుల మనసులో ఎప్పటికీ స్థిరస్థాయిగా నిలిచిపోతారని, సినీరంగం ఉన్నంతవరకు ఆమె జీవించే ఉంటారని చిరంజీవి తెలిపారు. శ్రీదేవి మరణ వార్తతో షాక్‌కు గురయ్యానని సూపర్‌స్టార్ మహేష్‌బాబు అన్నారు. ఎప్పటికీ తన అభిమాన నటి శ్రీదేవేనని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మహేష్‌బాబు ట్వీట్ చేశారు. శ్రీదేవి తొలి లేడీ సూపర్‌స్టార్ అని దర్శకధీరుడు రాజమౌళి ట్వీట్ చేశారు. 54 ఏళ్ల జీవితంలో యాభై ఏళ్లు నటిగా కొనసాగిన ప్రస్థానం ఇలా ముగిసిందని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ట్వీట్ చేశారు. శ్రీదేవి చనిపోవడం చాలా బాధాకరమని, ఆమె కుటుంబానికి ఆ దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రముఖ నటుడు వెంకటేష్ తెలిపారు. చిత్ర పరిశ్రమకు ఇది తీరని లోటని, శ్రీదేవి చనిపోయారంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని నటుడు నాగార్జున విచారం వ్యక్తం చేశారు. శ్రీదేవి హఠాన్మరణం నమ్మశక్యంగా లేదని ప్రముఖ నటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. దుబాయ్‌లో వివాహానికి వెళ్లిన శ్రీదేవి చనిపోయారని తెలియగానే దిగ్భ్రాంతికి లోనయ్యానని తెలిపారు. పెద్ద కుమార్తెని కథానాయికగా చిత్ర సీమలోకి తీసుకువస్తున్న తరుణంలో ఈ లోకాన్ని వీడటం బాధాకరమని పవన్ తెలిపారు. 'ఆమె వచ్చింది. ఆమె చూసింది. ఆమె గెలుచుకుంది. తిరిగి తను ఏ స్వర్గం నుంచి అయితే వచ్చిందో అక్కడికే వెళ్లిపోయిందని' ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ట్విట్టర్‌లో విచారం వ్యక్తం చేశారు. శ్రీదేవి మృతి చిత్రసీమకు తీరని లోటని మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు శివాజీ రాజా అన్నారు. మా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శ్రీదేవి చనిపోయారన్న వార్త విన్న తర్వాత షాక్‌కు గురయ్యానన్నారు. చిన్న వయసులోనే ఆమె మృతిచెందడం కలచివేస్తోందని అన్నారు. ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహానగరంలో మాయగాడు, జగదీకవీరుడు అతిలోక సుందరి, ఎస్పీ పరశురాం, క్షణక్షణం తదితర చిత్రాల్లో శ్రీదేవితో కలిసి నటించానని, నటన తెలిసిన ప్రతి వ్యక్తి గర్వించే నటి శ్రీదేవి అని ఆయన కొనియాడారు. మహానటిని కోల్పోవడం జాతి చేసుకున్న దురదృష్టమని బ్రహ్మానందం అన్నారు.

శ్రీదేవి మృతిని జీర్ణించుకోలేకపోతున్నానని ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. శ్రీదేవిని దగ్గర నుంచి చూడటం కోసమే తాను సినిమాల్లోకి వచ్చానని, క్షణక్షణం సినిమా శ్రీదేవికి తన లవ్ లెటర్ అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆమెతో క్షణక్షణం, గోవిందా గోవిందా చిత్ర షూటింగ్ సమయంలో గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటూ.. పాత ఫోటోలను వెలికితీసి వాటిని చూసుకుంటూ.. ట్వీట్స్‌తో తన బాధను వెల్లడించారు. ఏయ్ బాలాజీ ఆమెనొక్కదాన్నే తీసుకెళ్లి నన్ను ఇక్కడే వదిలేశావ్ అంటూ రామ్‌గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. సినీ నిర్మాత సి.అశ్వనీదత్, నటులు చంద్రమోహన్, మురళీమోహన్, నాగబాబు, రవిజేత, రమ్యకృష్ణ, హన్సిక, రాశీఖన్నా, నిఖిల్, కాజల్ అగర్వాల్, ప్రియమణి, హరీష్‌శంకర్, జయం రవి, సుమంత్, అనీల్ రావిపూడి, సుధీర్‌బాబు, ఈషా రెబ్బా తదితరులు శ్రీదేవి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అతిలోక సుందరిగా అభిమానుల గుండెల్లో కొలువైన శ్రీదేవి ఇక లేరంటే నమ్మశక్యం కావడం లేదన్నారు.



బాలనటిగా...

శ్రీదేవి మృతి పట్ల టాలీవుడ్ దిగ్భ్రాంతి



రేఖతో ముచ్చటిస్తూ...



తల్లిదండ్రులతో శ్రీదేవి



అజహరుద్దీన్ వివాహ కార్యక్రమానికి హాజరైన దృశ్యం



వసంత కోకిల చిత్రంలోని ఓ సన్నివేశం



తల్లి కర్కశం..

గుక్కపట్టి ఏడుస్తోందని చెత్త కుండీలో పడేసింది

అక్కడే ప్రాణాలు విడిచిన చిన్నారి

న్యూఢిల్లీ : గుక్కపట్టి ఏడుస్తున్న పసి కందుతో కన్న ప్రేమను మరిచి కర్కశంగా వ్యవహరించిందో తల్లి. విసుగుపుట్టి తీసుకెళ్లి చెత్త కుండీలో పడేయగా.. ఆ చిన్నారి ప్రాణాలు విడిచింది. ఢిల్లీలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు ఢిల్లీలోని వినోద్ నగర్‌కు చెందిన నేహా 25 రోజుల క్రితం ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నారికి పాలు పట్టిస్తున్నప్పటికీ గుక్కపట్టి ఏడుస్తోంది(అనారోగ్య సమస్య ఉందని చిన్నారి తండ్రి చెబుతున్నాడు). దీంతో అసహనానికి లోనైన నేహా దారుణానికి పాల్పడింది. శుక్రవారం గుట్టుచప్పుడు కాకుండా ఆ బిడ్డను తీసుకెళ్లి పక్కనే ఉన్న చెత్త కుప్పలో పడేసింది. పాప కనిపించడపోయేసరికి కుటుంబ సభ్యులంతా కంగారుపడగా.. తాను కూడా వారితోపాటు వెతికినట్లు నటించింది. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని వారు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో సాక్ష్యులను విచారణ చేపట్టగా స్థానికుడొకరు నేహా చెత్త కుండీలో ఏదో మూట పడేయటం చూశానని చెప్పాడు. దీంతో పోలీసులకు ఆ తల్లిపై అనుమానం మొదలైంది. ఈ క్రమంలో వారు ఆమెను గట్టిగా ప్రశ్నిం చగా.. ఆమె నేరం ఒప్పుకుంది. చిన్నారి ఏడుస్తుంటే తట్టుకోలేకనే తాను ఆ పని చేసినట్లు వివరిం చింది. దీంతో పోలీసులు హుటా హుటినా చెత్త కుప్ప వద్దకు వెళ్లారు. కొన ఊపిరితో ఉన్న పసికందును ఆస్పత్రికి తర లించి బతికించే ప్రయత్నం చేశారు. అయితే తలకు బలమైన దెబ్బ తల గటంతో ఆ పసి కందు ప్రాణాలు విడిచింది. ఈ ఘటనలో పోలీసులు నేహాను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

హనుమాన్ ఆలయాన్ని నిర్మించిన ముస్లిం



అహ్మదాబాద్: ఆయనో ముస్లిం... ఆయనలో మత విద్వేషం మచ్చుకైనా కనిపించదు. చుట్టు పక్కల ఉండే వాళ్లందరినీ నావాళ్లే అనుకుంటారు. హిందూ-ముస్లిం అనే వేరుగా మాట్లాడేతత్వం కాదు ఆయనది. సర్వ మతాలు నావే అంటాడు. హిందూ పండగలైన దీపావళి, గణేష్ చతుర్థి హిందువులకి ఏమాత్రం తీసిపోకుండా జరుపు కొంటాడు. అంతేకాదు ఆంజనేయస్వామికి పరమభక్తుడు. ఆ భక్తే ఆయనను హనుమాన్ ఆలయం నిర్మించేలా చేసింది.వివరాల్లోకి వెళితే... గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన మొయిన్ మెమోన్ ఆంజనేయస్వామి భక్తుడు. ఈ కారణం గానే ఆయన స్వస్థలమైన మిర్జాపూర్ లో 500ఏళ్లనాటి హనుమాన్ ఆలయాన్ని పునరుద్ధ రించారు. రెండు వారాల్లో ఆలయ పునరుద్దరణ పనులు పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ' నేనెంతో అదృష్టం చేసుకొని ఉంటే గానీ నాకు హనుమాన్ ఆలయం పున రుద్దరించే అవకాశం దక్కలేదు. ఇది నాకు హనుమాన్‌జీ ఇచ్చిన వరంలా భావిస్తాను. హను మాన్ భక్తులందరికీ నా తరపు నుంచి నేనిచ్చే కానుక ఇది' అని అన్నారు.మత ఛాందస భావాలతో అట్టుడికి పోతున్న ప్రస్తుత సమాజంలో ఇలాంటి వారు కూడా ఉన్నారనేది ఉపశమనం కలిగించే విషయమే.

మహిళల నేతృత్వంలో

అభివృద్ధి దిశగా భారత్

ప్రధాని నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ : మహిళాభివృద్ధి నుంచి మహిళల నేతృ త్వంలో అభివృద్ధి దిశగా దేశం పయనిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం తెలిపారు. దేశం మొత్తం అభివృద్ధిలో ఒక సమాన భాగస్వామ్యం, మహిళా సాధికారత, బలం నూతన భారతదేశం కల అని ఆయన నొక్కి చెప్పారు. నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఒక ఆదాయ వనరయ్యే గోబర్ ధన్ కోసం స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేయాలని మహిళలను ప్రధాని కోరారు. 'గ్రామాల్లో పరిశుభ్రత కల్పించడం, పశువుల పేడ, ఘన వ్యవసాయ వ్యర్థాలను కంపోస్టు, బయో గ్యాస్‌గా మార్చడం ద్వారా సంపద, శక్తిని ఉత్పత్తి చేయడం గోబర్-ధన్ పథకం ప్రధాన లక్ష్యం' అని చెప్పారు.

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్క రించుకుని ప్రధాని మాట్లాడుతూ 'ప్రపంచంలో, మన దేశంలో అనేక కార్యక్రమాలు జరుగుతాయి. నేడు మహిళా భివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలో అభివృద్ధి దిశగా దేశం ముందుకు సాగుతోంది' అని మోడీ పేర్కొన్నారు. ఒక పరిపూర్ణ స్త్రీ ఆలోచన ఒక సంపూర్ణ స్వాతంత్ర్యమని స్వామి వివేకానందను ఉటంకిస్తూ మోడీ మాట్లాడుతూ మహిళా సాధికారత ఉన్న నూతన భారతం కల సాకారం కావాలన్నారు. 'సామాజిక లేదా ఆర్థిక జీవితం, ఇలా జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలో మహిళా భాగస్వామ్యం కల్పించడం మా ప్రాథమిక విధి. 'నేడు మహిళా శక్తి అంతర్గత ధైర్యం. స్వీయం విశ్వాసం చూపించింది. ఆమె తనకు తాను పురోగతి సాధించడమే కాకుండా దేశాన్ని, సమాజాన్ని కొత్త ఎత్తులకు తీసుకువెళుతోంది' అని ఆయన తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మాతృమూర్తులు, సోదరీమణులను సన్మానిం చాలని దేశ పౌరులకు విజ్ఞప్తి చేశారు. 20 రోజుల్లో 1.70 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం, నెల రోజులంతా పరిశుభ్రతపై ప్రచారం నిర్వహించిన జార్ఖండ్ మహిళా బృందం ప్రయత్నాల పట్ల మోడీ హర్షం వ్యక్తం చేశారు. 'స్వచ్ఛ భారత్ అభియాన్'లో ఒక భాగంగా మహిళా శక్తిని ప్రదర్శించారని అన్నారు. 'గోబర్ ధన్ పథకం క్రింద శక్తి ఆధారిత బయో గ్యాస్ ఉత్పత్తికి పశువుల పేడ, వ్యవసాయ ఘన వ్యర్థాలు, వంటగది వ్యర్థాలు ఏర్పాటు చేయడం లక్ష్యంగా ఉంది. మన రైతు సోదరులు, సోదరీమణులు పేడ, ఇతర వ్యర్థాలను కేవలం వ్యర్థాలుగా కాకుండా ఆదాయ వనరుగా పరిగణించాలి' అని తెలిపారు. కాగా స్వీయ అభ్యాసానికి మెరుగైన యంత్రాలు తయారయ్యాయి. దివ్యాంగులు, రైతుల జీవితాలను మరింత సరళతరం చేయడానికి పరిశోధకులు కృత్రిమ మేధస్సు(ఏఐ) వినియోగించాలన్నారు. ఏఐ ద్వారా ప్రకృతి విపత్తుల విషయమై అప్రమత్తమవుతామన్నారు. రైతులు వారి పంటల గురించి తెలుసుకోవడానికి సహాయపడతాం. మరింత ఆధునిక పరిజ్ఞాన విధానంలో వ్యాధులను నివారించడంలో సహాయపడటానికి, వైద్య సేవలకు చేరుకోవడానికి దోహద పడుతుంది' అని పేర్కొన్నారు. 'మానవాళి మంచి కోసం సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలను వినియోగించాలి' అని అన్నారు. గత నెలలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతానాహ్యూతో కలిసి అహ్మదాబాద్‌లో జరిపిన పర్యటనను ఆయన ప్రస్తావించారు. 'అహ్మదాబాద్‌కు చెందిన దియోధోలోరా గ్రామంలో ఐక్రియేట్ కేంద్రాన్ని సంద ర్శించిన సమయంలో బధిరుల కోసం ప్రజలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత ఎలా అభివృద్ధి చేయాలో నేను చూశాను. ఒక మూగ వ్యక్తి ఏదైనా ఒకటి మాట్లాడా లనుకునే విషయం రాసినట్లయితే అది వాయిస్‌గా మారే పరికరాన్ని అభివృద్ధి చేశారు' అని తెలిపారు. ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ డే సందర్భంగా మాట్లాడుతూ సి.వి.రామన్ కాంతి పరిక్షేపాన్ని కనుగొన్నది ఇదే రోజు అని తెలిపారు. ఈ పరిశోధనకుగాను సి.వి.రామన్‌కు నోబెల్ బహుమతి ప్రదానం చేయబడిందని మోడీ వివరించారు.

చనిపోయినట్లు నటించి బతికిపోయా..



చెన్నైలో దుండగుల దాడికి గురైన టెక్కీ లావణ్య

చెన్నై: ' ఆ దుండగులు ఏ మాత్రం దయాదాక్షిణ్యం లేని వారిగా వ్యవహరించారు. మీక్కావాల్సిన వస్తువులన్నీ తీసుకోండి.. నన్ను మాత్రం ప్రాణాలతో వదిలేయండి అని ప్రాధేయపడినా పట్టించుకోలేదు... చనిపోయినట్లు నటించకుంటే నిజంగా చంపేసే వారు..' అని ఆంధ్ర ప్రదేశ్ విజయవాడకు చెందిన టెక్కీ లావణ్య పోలీసుల వద్ద తన ఆవేదనను వ్యక్తం చేశారు. కేసు విచారణ చేపట్టిన పల్లికరణై పోలీసులు ఆమె వద్ద వీడియో ద్వారా వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. గుండెను పిండేసేలా చోటు చేసుకున్న ఆ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నైలోని ఒక ఐటీ కంపెనీలో పనిచేస్తున్న లావణ్య ఈనెల 12వ తేదీన తన కార్యాలయ విధులను ముగిం చుకుని బైక్‌లో ఇంటికి వెళుతుండగా చెన్నై శివారు పెరుంబాక్కంలో ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. వారిలో ఒకడు నా చేతికి తొడుక్కొని ఉన్న బంగారు బ్రాస్‌లెట్‌ను లాక్కునేందుకు ప్రయత్నించారు. వెంటనే నేనే ఇస్తాను అన్నా వినిపించుకోలేదు. ఎంతో టైట్‌గా ఉన్న బ్రాస్‌లైట్‌ను బలవంతంగా లాగడంతో విలవిల లాడిపోయాను. నన్నేమీ చేయకండి అని కోరాను. అయితే వాళ్లు వినిపించుకోలేదు. వారితో నేను వాగ్వా దానికి దిగడంతో వెనక నుంచి ఒకడు ఇనుప కమ్మీతో నా తలపై బలంగా కొట్టాడు. తలనుంచి తీవ్ర రక్తస్రావం అవుతుండగా బైక్ నుంచి కిందపడి పోయాను. తల, చేతులు, గుండెపై రాడ్డుతో, చేతులతో పిడిగుద్దులు కురి పించారు. ఇక వీరి నుంచి ఎలాగైనా బైటపడాలని చని పోయినట్లు నటించాను. చనిపోయాననుకుని వారు పారిపోయారు. రెండు గంటల పాటు రక్తపు మడుగులో ప్రాణాల కోసం పోరాడాను. ఎవరూ సహాయానికి రాలేదు.

రక్తం కారుతున్న స్థితిలో నేను మనోధైర్యాన్ని కూడగట్టుకుని లేచి నిల్చొని ఎదురుగా కొత్తగా కడుతున్న నిర్మాణంలోకి నడిచి వెళ్లాను. కొంచెంసేపైన మరలా నిలదొక్కుకుని జనసంచారం ఉన్న చోటకు వెళితే సహాయం లభిస్తుందని బయల్దేరాను. మా నాన్న ఇప్పటికే ఒక కుమార్తెను పోగొట్టుకున్నారు. నేను కూడా ఆయనకు దూరం కాకూడదని మొండి ధైర్యం తెచ్చుకోవడంతో రక్తం కారుతున్నా నొప్పులు తెలియ లేదు. సుమారు రెండు గంటల తర్వాత ఒక వాహనంలో వెళుతున్న వ్యక్తుల ద్వారా ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇవ్వగా చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చేర్పించారు. నేను ఎటువంటి ఆధారాలు చూపకున్నా నిందితులను రెండోరోజుల్లోనే పట్టుకున్న తమిళనాడు పోలీసులు ప్రశంస నీయులు. ముఖ్యంగా నేను కోలుకునేందుకు రేయింబవళ్లు పాటుపడిన పల్లికరణై ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌కు ఎంతగానో కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

రుణమాఫీలో 'కార్పొరేట్'కే పెద్దపీట

వ్యవసాయంకన్నా ఏడు రెట్లు అధికం

రైతు రుణాలను పునర్వ్యస్థీకరించిందీ తక్కువే

తేటతెల్లమైన ప్రభుత్వరంగ బ్యాంకుల పక్షపాతం



న్యూఢిల్లీ : రైతుల రుణాలను మాఫీ చేయడంకంటే కార్పొరేట్ రంగ రుణాలను రద్దు చేయడం లేదా పునర్వ్యస్థీకరించడంతో వ్యవసాయ రంగం, కార్పొరేట్ రంగం మధ్య ఒక విస్తృత విభజన ప్రభుత్వరంగ బ్యాంకుల స్పందనలో బహిర్గతమైంది.పరిశ్రమల రంగానికి గత మూడేళ్ళ(2014-15, 2015-16, 2016-17)లో రూ.6,09,661 కోట్ల విలువైన రుణాలను ప్రభుత్వరంగ బ్యాంకులు పునర్వ్యస్థీకరించాయని ప్రభుత్వ గణాంకాలు పేర్కొంటున్నాయి. అయితే వ్యవసాయ రంగంలో కార్పొరేట్ రంగంకన్నా 15 రెట్లు తక్కువగా రూ.38,646 కోట్ల రుణాలు పునర్వ్యస్థీకరించబడ్డాయి. బ్యాంకింగ్ పరిభాషలో రుణగ్రహీత ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటున్నప్పుడు, రుణాలను చెల్లించలేనపుడు ఆ రుణాలను పునర్వ్యస్థీకరిస్తారు. ఆ పరిస్థితిలో అసలు నిబంధనలు, సడలింపులను కోరుతుంది. అలాంటి సందర్భాల్లో వడ్డీ రేట్లు తగ్గించడం, వడ్డీ చెల్లింపుపై మారిటోరియం వంటి కొన్ని నిబంధనలను సడలిస్తారు. 2014-15లో ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా పరిశ్రమల రంగానికి రూ.2,95,065 కోట్ల రుణాలు పునర్వ్యస్థీకరించబడ్డాయి. కాగా 2015-16, 2016-17లలో రూ.1,78,602, రూ.1,35,994లు సంబంధిత మొత్తాలుగా ఉన్నాయి. మరోవైపు వ్యవసాయరంగం, దాని అనుబంధ కార్యకలాపాలలో పునర్వ్యస్థీకరించబడిన రుణ మొత్తాలు 2014-15, 2015-16, 2016-17 సంవత్సరాలకు రూ.17,771, రూ.11,808, రూ.9,067 కోట్లుగా ఉంది. అదేవిధంగా, రుణ మాఫీలో వ్యవసాయ రంగంకన్నా పరిశ్రమలు లేదా కార్పొరేట్ రంగాలు ఏడు రెట్లు ముందున్నాయి.వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల్లో రుణ మాఫీకి ఎన్‌పీఏ(నిరర్థక ఆస్తుల)లో తగ్గింపు రూ.7,091 కోట్లుగా ఉంది. ఇదేకాలంలో పరిశ్రమల రంగంలో సంబంధిత మొత్తం రూ.48,435 కోట్లుగా ఉంది. సాధారణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు భారీ మొత్తాలకు సంబంధించిన మొండి బకాయిలను మాఫీ చేస్తాయని బ్యాంకింగ్ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. బ్యాంకు అధికారి ఒకరు మాట్లాడుతూ బ్యాలెన్స్ షీట్‌లో రుణానికి సంబంధించి నిర్ధరక ఆస్తిగా ప్రకటిస్తే, బ్యాంకు ఆ మొత్తాన్ని తిరిగి వసూలు చేయడం అని అర్థం కాదు. కానీ ఆ డబ్బును తిరిగి పొందడానికి ప్రయత్నిస్తారు లేదా ఒక రికవరీ కంపెనీకి రుణాన్ని అమ్ముతారని వివరించారు. రుణ మాఫీ ద్వారా వడ్డీల ద్వారా ఆ మొత్తాలను పొందడానికి ఆస్తులను బ్యాంకులు చూపుతాయి. అయితే సంభవించిన నష్టాలపై పన్ను రాయితీని కూడా వారు పొందుతారని ఆ బ్యాంకు అధికారి తెలిపారు.

తండ్రికి అవమానం : విషం తాగిన కూతురు



జబల్‌పూర్ : తన తండ్రిని అవమానించిన తీరును చూసి తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. అదృష్టం కొద్ది ప్రాణాపాయం నుంచి బయటపడి ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటోంది. వివరాల్లోకి వెళితే, డబ్బు వివాదమై జబల్‌పూర్‌లోని బీజేపీ మైనారిటీ సెల్ విభాగం అధ్యక్షుడు మహ్మద్ షఫిక్ అలియాస్ హీరా అనే వ్యక్తి బాధితురాలి తండ్రిని మోకాళ్లపై కూర్చొబెట్టి నడుం వంచి దండం పెట్టించుకున్నాడు. పైగా అతడి వీపుపై ఓ వాటర్ బాటిల్‌పై పెట్టి వీడియోలు తీయించి ఆ వీడియోలను వాట్సాప్‌లో పెట్టించాడు.

అది కాస్త వైరల్‌గా మారి బాధితురాలు చదువుకునే కాలేజీలో స్నేహితుల ఫోన్‌లలోకి వెళ్లింది. ఆ వీడియోను తాను కూడా చూడటంతో తీవ్రంగా అవ మానంగా భావించి ఇంటి కొచ్చిన ఆ యువతి వెంటనే పురుగుల మందు లాంటి విషాన్ని తీసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఇలా చేసిన సదరు బీజేపీ నేతపైనా, ఆ వీడియోను షూట్ చేసి సోషల్ మీడియాలో పెట్టిన వ్యక్తులపైనా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వినూత్న ప్రచారం

- ఆటపాటలు, డ్యాన్సులతో ప్రజల ముందుకు పార్టీలు
- ఎక్కడ చూసినా సంగీత కచేరీలు
- కార్యకర్తల్లో ఉత్తేజానికి నానాపాట్లు
- మేఘాలయలో పార్టీల ఎన్నికల పదనిసలు

వహియాజర్(మేఘాలయ) : మేఘాలయలో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో సరికొత్త పంథాను ఎంచుకున్నాయి. ఓటర్లను ఆకర్షించడానికి సంగీతాన్ని ఆశ్రయించాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి సంగీతమే సరైన మార్గమని పార్టీలు భావించాయి. గడచిన నెల రోజులుగా ప్రతిసాయంత్రం వహియాజర్, దాని పరిసర గ్రామాలు నారియాంగ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఉమ్ములోంగ్‌లలో ప్రతి సాయంత్రం సంగీత కచ్చేరీలు నిర్వహిస్తున్నారు. పాటలు, డ్యాన్సులతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి రాజకీయ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. మేఘాలయలో ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనున్నది. అభ్యర్థులు సైతం సంగీత కచ్చేరిలలో పాలుపంచుకుంటున్నారు. చిన్నాపెద్దా, ఆడామగా, పిల్లా పాపా అనే తేడా లేకుండా అందరూ ఐదేళ్లకోసారి వచ్చే ప్రజాస్వామ్య ఉత్సవాలలో పాలుపంచుకుంటున్నారని రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగి, వహియాజర్ వాస్తవ్యురాలు డబ్ల్యు.శైలా వ్యాఖ్యానించారు. ప్రతి సాయంత్రం ఇవే ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. సంగీక కచ్చేరిలు లేకుండా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ర్యాలీలు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎన్‌పీపీ అభ్యర్థి స్నియావ్‌బలాంగ్ ధార్ మరోసారి ఎన్నిక కావడం కోసం శ్రమిస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా జోప్తియా లింగ్డో, డ్రెసన్ ఖర్షియాంగ్ పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ముక్కోణ పోటీ నెలకొన్నది. అభ్యర్థులంతా శక్తివంచన లేకుండా గెలుపుకోసం పాటు పడుతున్నారు. ఈ నియోజకవర్గంలో బొగ్గు వ్యాపారం అధికంగా ఉంటుంది. వేలాదిమంది ఇదే వ్యాపారంతో జీవిస్తున్నారు. ఎన్‌జీటీ నిషేధంతో వారి వ్యాపారాలపై ప్రతికూల ప్రభావం పడింది. బొగ్గు నిషేధం, యువతకు ఉపాధి లేకపోవడం, సరైన వైద్య, విద్యా సదుపాయాలు కొరవడటం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దొంకియాన్ లింగ్డో అనే యువకుడు చెప్పారు. సంగీతం ప్రజల సమస్యలను పరిష్కరించలేదని, అయితే, మార్పునకు ఇది ఉత్ప్రేరకంగా పని చేస్తుందని జోప్తియా పీటీఐతో అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం తనకు ఓట్లు వేయాల్సిందిగా జోప్తియా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజవర్గం మొత్తం భారీ ర్యాలీలు నిర్వహిస్తూ ధార్‌ను ఓడించటానికి కృషి చేస్తున్నట్టు జోప్తియా, ఇతర కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ధార్ వల్లే నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని, యువతకు ఉద్యోగాలు రాలేదని ఆరోపించారు. రాజకీయ పార్టీల ర్యాలీలకు పెద్దగా ప్రజలు రాకపోయినా నాయకులు మాత్రం పెద్దపెద్ద మైకుల ద్వారా ప్రచారం కొనసాగిస్తున్నారు. రోడ్లపై నడుస్తూ పాటలు పాడుతూ ప్రజలను ఆకర్షించడానికి అభ్యర్థులు, పార్టీలు ప్రయత్ని స్తున్నాయి. ఈ సరికొత్త ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు అంతా ఒకే విధానం అమలు చేస్తున్నారు. రాహుల్‌గాంధీ గతనెలలో మేఘాలయలో ప్రచారం చేశారు. అప్పుడు కూడా సంగీత కచ్చేరిలు నిర్వహించారు. బీజేపీ సైతం స్థానిక సంగీత కళాకారులను ప్రయోగిస్తోంది. యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ, ది హిల్స్ స్టేట్ పీపుల్‌ఎస డెమోక్రటిక్ పార్టీ, ది ఖున్ ఇన్నీట్రెవ్ నేషనల్ అవేకెనింగ్ మూవ్ మెంట్ వంటి ప్రాంతీయ పార్టీలు ఇందులో మినహా యింపేమీ కాదు. ప్రతి అభ్యర్థి తన అభిరుచికి తగిన విధంగా థీమ్ సాంగ్స్ తయారు చేయించు కున్నారని యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏఎఫ్ దఖర్ చెప్పారు. వ్యక్తిగతంగా పాటలు రికార్డు చేయించు కున్నారన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఇలా సొంతంగా పాటల కేసెట్లు ఏర్పాటు చేయించుకున్నారని పేర్కొన్నారు.



'నా ప్రాథమిక హక్కుల్ని రక్షించండి'

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి.చిదంబరం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన ప్రాథమిక హక్కులతో పాటు వ్యక్తిగత గోప్యతకు రక్షణ కల్పించాలని పిటిషన్ దాఖలు చేశారు. ఎయిర్‌సెల్, మాక్సిస్, ఐఎన్‌ఎక్స్ మీడియా కేసుల్లో తన కుమారుడు కార్తీకి కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లు సమన్లు జారీచేయడంతో పాటు ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో చిదంబరం కోర్టును ఆశ్రయించారు.

పెళ్లివేడుకలో కాల్పులు.. ఇద్దరికి గాయాలు

న్యూఢిల్లీ : పెళ్లి వేడుకలో ఓ కానిస్టేబుల్ కాల్పులు జరపడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని కార్వాల్‌నగర్‌లో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈశాన్య ఢిల్లీలో అర్ధరాత్రి ఈ సంఘటన జరిగిందని పేర్కొన్నారు. పెళ్లిలో గొడవ జరిగిందనీ, అదే కాల్పులకు దారితీసిందని వివరించారు. స్పెషల్ సెల్ కానిస్టేబుల్ నయీమ్ గొడవ జరిగే సమయంలో తన రివాల్వర్ నుంచి మూడు రౌండ్లు కాల్పులు జరిపాడని డీసీపీ నార్‌ఈస్ట్ ఏకే సింఘాలా తెలిపారు. మనోజ్‌గుప్తా, పూజాగుప్తా కాల్పుల్లో గాయపడ్డారని వివరించారు.

నా బహిష్కరణ సంప్రదాయ విరుద్ధం : చతుర్వేది

నాగపూర్ : పార్టీ నుంచి తనను బహిష్కరించడం సంప్రదాయ, ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత, సీనియర్ నాయకుడు సతీష్ చతుర్వేది తెలిపారు. చివరి శ్వాసవరకూ తాను కాంగ్రెస్ కార్యకర్తగానే ఉంటానని పేర్కొన్నారు. ముంబై, నాగపూర్‌లలో కార్యకర్తలు సంఘ వ్యతిరేక శక్తులతో కలిసి పార్టీని బలహీనపరుస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. వారి కుట్రను బహిర్గతం చేసినందుకే తనను బహిష్కరించారని ఆరోపించారు. దీనిపై మహారాష్ట్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నుంచి అధికారిక ఉత్తర్వులు లేవని పేర్కొన్నారు.

విదేశీ మద్యం పెట్టెలు స్వాధీనం

ముజఫర్‌నగర్ : సుమారు రూ. 70లక్షల విలువైన 300 మద్యం పెట్టెలను ముజఫర్‌నగర్ జిల్లాలోని ఓ వ్యాన్ నుంచి స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందితో సంయుక్త టీంను ఏర్పాటు చేసుకుని మినాపూర్ పోలీసు స్టేషన్‌పరిధిలోని టెంగ్రారీ గ్రామం వద్ద దాడి చేసి పట్టుకున్నట్లు వివరించారు. బిస్కెట్ ప్యాకెట్ బాక్సులు, దుస్తుల కట్టల కింద ఉన్న 335 పెట్టెలను పంజాబ్ నెంబరుతో రిజిస్టర్ అయివున్న వ్యాన్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పోలీసుల శిబిరంపై ఉగ్రదాడి

శ్రీనగర్ : మధ్య కాశ్మీరులోని బుద్గాం జిల్లాలోని నది ఒడ్డున ఉన్న చరార్-ఇ-షరీఫ్ సమీపంలోని పోలీసు శిబిరంపై ఉగ్రవాదులు దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఓ పోలీసులు మృతి చెందినట్లు పేర్కొన్నారు. చరార్-ఇ-షరీఫ్ ప్రాంతంలోని సూఫీ మతప్రవక్త షేక్ నూర్-ఉద్-దిన్ నూరానీ దర్గా వద్ద పోలీసు పోస్టుపై ఈ దాడి జరిగిందని వివరించారు. ఇదే దాడిలో మరో పోలీసులు కుల్తార్ సింగ్ తీవ్రంగా గాయపడ్డాడని, అతడిని ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు వివరించారు.

ఛత్తీఘర్‌లో నక్సల్స్ దాడి.. భద్రతా సిబ్బందికి గాయాలు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌ఘర్‌లోని బిజాపూర్ జిల్లాలో నక్సలైట్ల బాంబు దాడిలో అసిస్టెంట్ ప్లాటూన్ కమాండర్‌తో సహా ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. రాయ్‌పూర్‌కు 450 కిలోమీటర్ల దూరంలోని తారుద్-తార్లగుడ వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో ఘటన జరిగిందని పేర్కొన్నారు. సీఏఎఫ్‌కు చెందిన 12వ బెటాలియన్ ఈ ప్రాంతంలో తనిఖీలు చేపడుతున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు వివరించారు. గాయపడ్డ ఇద్దరూ ప్లాటూన్ కమాండర్ పూర్ణ సింగ్, కానిస్టేబుల్ భువనేశ్వర్ యాదవ్‌గా గుర్తించారు.

ఆర్పీఎఫ్ అధికారి కాల్చివేత.. కానిస్టేబుల్ అరెస్టు

షిల్లాంగ్ : ఆర్పీఎఫ్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తన సర్వీసు రివాల్వర్‌తో కాల్పులు జరపడంతో అసిస్టెంట్ కమాండెంట్ మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన మేఘాలయలోని నైరుతి కాశీ హిల్స్‌లో చోటుచేసుకుంది. 'కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి తుపాకిని స్వాధీనం చేసుకున్నాం. దీనిపై విచారణ జరుగుతోంది' అని ఎస్పీ హెచ్‌జీ లింగ్డో తెలిపారు. మరో ఘటనలో అసిస్టెంట్ కమాండెంట్ ముఖేష్ త్యాగిని కానిస్టేబుల్ అర్జున్ దేశ్వాల్ కాల్చి చంపినట్లు ప్రధాన ఎన్నికల అధికారి ఎఫ్ఆర్ ఖర్కోంగర్ పేర్కొన్నారు.

రూ.12 లక్షల నగదు స్వాధీనం

షిల్లాంగ్ : ఎన్నికలు జరుగుతున్న మేఘాలయలోని రి-భోయ్ జిల్లాలో రూ.12.39 లక్షల నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి సీపీ గత్మరే తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తి చేశామని, విషయాన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు తెలిపినట్లు ఆయన వివరించారు. అలాగే నాన్‌గ్పోలోని ఓ కారు నుంచి రూ.5.96 లక్షలు, జోరాబత్ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.లక్ష, రూ.1.43 లక్షలు, రూ.4 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు

రాయ్‌పూర్ : డాక్టరుతో సహా దొంగనోట్లు అచ్చు వేస్తున్న ముగ్గురిని మహాసముంద్ జిల్లా పోలీసులు అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే రూ.55,800ల అసలు నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. క్రైం బ్రాంచి, సిటీ కొత్వాల్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన దాడుల్లో నిందితుడిని ద్వారికా ప్రసాద్ సాహు (31), అఖిలేష్ ధృవ్ (33), కుందన్ దివార్‌గా గుర్తించి నట్లు ఎస్పీ సంతోష్ సింగ్ తెలిపారు. సాహుపై క్రైం బ్రాంచ్ పోలీసులు ఎప్పటి నుంచో నిఘా పెట్టారు.

యువతుల అక్రమ రవాణా కేసు.. 7గురికి జైలు

కొచ్చి : మానవ అక్రమ రవాణా కేసులో సీబీఐ కోర్టు ఏడుగురికి కఠిన కారాగార శిక్ష విధించింది. వీరంతా కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు 2009-2012 మధ్య యువతులను అక్రమంగా తరలించారు. వీరిలో నలుగురికి 10 ఏళ్ల పాటు కఠిన కారాగార శిక్ష, రూ.2.54 లక్షలు, రూ.1.54 లక్షల జరిమానా, మిగిలిన వారికి కఠిన కారాగార శిక్ష, రూ.1.24 లక్షల జరిమినా విధించారు. ఈ కేసులో మరో ఆరుగురు ఉండగా, వారిలో ఇద్దరు అప్రూవర్లుగా మారగా, మిగిలిన వారు పరారీలో ఉన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో పట్టాలు తప్పిన గూడ్స్

సీతాపూర్ : గూడ్సు రైలుకు చెందిన నాలుగు వ్యాగన్‌లు పట్టాలు తప్పాయి. దీంతో సీతాపూర్-రోజాల మధ్య పాసింజర్ రైళ్లకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని అధికారులు తెలిపారు. మొహాలీ సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ బీపీ సింగ్ కథనం ప్రకారం ఆ సమయంలో గూడ్సు రైలు సీతాపూర్ నుంచి రోజా వెళుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్ బ్లాక్ అవడంతో ప్యాసింజర్ సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగింది. రైల్వే అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి, మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్యాసింజర్ రైళ్లు యాథావిధిగా తిరిగాయి.

ఈవెంట్ ఆర్గనైజర్‌పై టీవీ నటి కేసు

థానే : ఆఫ్రికాలో జరిగిన ఓ కార్యక్రమానికి సంబంధించి తనకు పారితోషికం ఇవ్వలేదని ఓ ఈవెంట్ ఆర్గనైజర్‌పై టీవీ నటి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ ఆఫ్రికాలోని ఘనాలో జరిగిన ఓ కార్యక్రమంలో టీవీ నటి శిఖా సింగ్ పాల్గొన్నారు. దీన్ని దీపక్ చతుర్వేది నిర్వహించారు. దీనికి సంబంధించి రూ.11.30 లక్షలు తనకు బాకీ ఉన్నారని శిఖాసింగ్ తెలిపారు. గత నవంబర్‌లో ఓ షోకు సంబంధించి చతుర్వేది శిఖాసింగ్‌ను కలుసుకున్నారు. షో నిమిత్తం రూ.12 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని, రూ.70వేలు అడ్వాన్స్ ఇచ్చారు.

ఎన్‌కౌంటర్‌లో నేరస్తుడి మృతి

లక్షింపూర్‌ఖిరి : ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, ఖిరి పోలీసుల సంయుక్త ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన నేరస్తుడు మృతి చెందారు. అతడిపై రూ.50వేల నగదు బహుమతి కూడా ఉందని అధికారులు తెలిపారు. హాపూర్‌కు చెందిన నిలూ చౌధురి శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందనిట్లు ఏఎస్పీ అఖిలేష్ సింగ్ తెలిపారు. వివిధ రాష్ట్రాలో నిందితుడిపై హత్య, దోపిడీ వంటి కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. 2015లో హర్యానా జైలు నుంచి చౌధురి అలియాస్ ఫౌజి తప్పించుకున్నాడని వివరించారు.



ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షిద్దాం

విశాలాంధ్ర-కందుకూరు: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయాలని పశ్చిమ రాయలసీమ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కందుకూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ప్రాంతీయ విద్యా సదస్సు ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై. అశోక్‌బాబు అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ-ప్రజల భాగస్వామ్యం - సామాజిక బాధ్యత, స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 అనే అంశాలపై చర్చించారు. పరిరక్షణ-ప్రజలు భాగ స్వామ్యం -సామాజిక బాధ్యత అనే అంశం పై నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యకు తగిన నిధులు అందించలేని తరుణంలో ఉపాధ్యాయులు సమాజంలో మమేకమై ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఉపాధ్యాయులు హక్కులతోపాటు బాధ్యతలను గుర్తిస్తూ విద్యాభివృద్ధికి కృషిచేయాలన్నారు. బ్రిటీష్ అధికారులు ఒక చట్టం తీసుకుని రావాలంటే ఎన్నో రోజులు చర్చించేవారని, ఇప్పుడు మన ప్రభుత్వాలు చట్టాల రూపకల్పనలో తీసుకుంటున్న చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. పార్లమెంటులో విద్యారంగ చట్టాలపై జరుగుతున్న చర్చల్లో కేవలం 20 మంది కూడా పాల్గొనడం లేదన్నారు. సీపీఎస్ విధానం పై అవగాహన కల్పిస్తూ ఆయన ప్రసంగించారు. మధ్యాహ్నం 'స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం'పై మాట్లాడుతూ స్వతంత్ర పాఠశాలల చట్టం అమలులోనికి వస్తే తొలుత చిన్నచిన్న ప్రయివేటు పాఠశాలలు మూతపడి, అంతిమంగా లక్షల్లో ఫీజుల మోతకు ప్రజలు గురికాక తప్పదన్నారు. ఈ చట్టం ముసుగులో ప్రభుత్వం కార్పొరేటు సంస్థలకు, శక్తులకు విద్యారంగాన్ని తాకట్టు పెట్టే దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. విద్యారంగం పరిరక్షణకు కంకణం కట్టుకున్న వ్యక్తులుగా ఇతర శాసనమండలి సభ్యులతో కలిసి ఈ బిల్లును అడ్డుకొనే విధంగా ప్రయత్నిస్తామన్నారు. ఈ చట్టం పర్యవసానం వచ్చే దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల మద్దతు కూడ గట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. మాజీ మంత్రి మహీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానాన్ని బలోపేతం చేయడానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయవల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, జిల్లా విద్యాశాఖాధికారి సీపీఎస్ సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యులు కంచర్ల శ్రీకాంత్, కె.ఎర్రయ్య, జిల్లా ఎస్టీయు ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి కె. కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, హజరత్ , రాష్ట్ర కౌన్సిలర్ పి.కృష్ణయ్య, మోహన్‌రావు, సి.హెచ్. రమణమూర్తి, రాష్ట్ర ఎస్టీయు మహిళ కన్వీనర్ మహబూబ్‌జాన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ హబీబుల్లా పాల్గొన్నారు.

బాబు పాలనకు చరమగీతం

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పిలుపు



విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ: రాష్ట్రంలో నెలకొన్న అవినీతికర దౌర్భాగ్యకర పరిస్థితులను సృష్టించిన ముఖ్యమంత్రి చంద్రబాబును రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించకపోతే చారిత్రాత్మక తప్పిదం అవుతుందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు అన్నారు. విజయనగరంలోని ఫూల్‌బాగ్‌లోని జగన్నాథ్ ఫంక్షన్ హాలులో ఆదివారం వైసీపీ నెల్లిమర్ల, బొబ్బిలి నియోజకవర్గాల బూత్ కన్వీనర్ల శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలుగుదేశం ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి బూత్ కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు అండ్ కో అవినీతే ధ్యేయంగా పనిచేయడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమన్నారు. రాజకీయాలకతీతంగా పాలన కొనసాగించాల్సిన ఐఏఎస్‌లు మంత్రులకు మధ్యవర్తులుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇటువంటివారి వలన ఐఏఎస్ వ్యవస్థకు చెడ్డపేరు వస్తోందన్నారు. పేదల కోసం, తెలుగువారి ఆత్మ గౌరవం కోసం ఎన్టీఆర్ పెట్టిన తెలుగుదేశం పార్టీ చంద్రబాబు పుణ్యమా అని జాతీయస్థాయిలో అప్రతిష్ట పాలైందని అంబటి దుయ్యబట్టారు. ప్రజలే ఊపిరిగా, సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వాన్ని నడిపిన దివంగత వైఎస్ఆర్ ఆశయాలు, ఆలోచన నుంచి పుట్టిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందన్నారు. ప్రతిపక్షనేతగా వైఎస్ 16వందల కి.మీ. పాదయాత్ర ద్వారా ప్రజాభిమానంతో మునిగిపోతున్న కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని, నేడు రాష్ట్ర ప్రజల కోసం ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి 3 వేల కి.మీ. పాదయాత్ర ద్వారా తెలుగుదేశం పాలనను తుదముట్టిస్తారని అంబటి జోస్యం చెప్పారు. సమావేశంలో వైసీపీ విశాఖ జిల్లా నాయకులు గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఏలేరు' ఆయకట్టును సస్యశ్యామలం చేస్తాం

విశాలాంధ్ర- సీతానగరం: పురుషోత్త పట్నం ప్రాజెక్టు నుంచి ఏలేరు రిజర్వాయర్‌కు 12 క్యూసెక్కుల నీరు తరలిం చేలా చర్యలు తీసుకుంటు న్నట్టు జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు. దీనివల్ల ఏలేరు ఆయకట్టులో లక్షల ఎకరాలకు నీరంది సస్యశ్యామలం అవుతాయన్నారు. గోదావరి నదిపై తూర్పు గోదా వరిజిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమా మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఏపీకి ఆధునిక దేవాలయం లాంటిద న్నారు. ఎడమ కాల్వ పనులను త్వరితగతిన పూర్తిచేసి జాతీయ రహదారిపై మూడు భారీ వంతెనల నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ నీటి లభ్యతతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్, విశాఖ ప్రజల నీటి అవసరాలను తీర్చుతామ న్నారు. వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాది డిసెంబర్‌కల్లా పూర్తిచేసి ఆయ కట్టుకు నీరందిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కింద నిర్వాసితులు సహకరించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పర్యటనలో ఎస్ఈ శ్యాం, సీఈ శ్రీధర్, డీఈ వెంకట్రావు, ఈఈ శ్రీనివాస రావు, ఇంజనీర్ మురళి, డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యాటకానికి 50 శాతం నిధులు పెంచమన్నాం

విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్రంలో పర్యాటకరంగం అభివృద్ధి కోసం గతేడాది బడ్జెట్‌లో రూ.47 కోట్లు కేటాయించారని, ఈ ఏడాది దానికి 50 శాతం అదనంగా నిధులు కేటాయించాలని కోరామని పర్యాటక శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. విశాఖ సీఐఐ సదస్సులో జరిగిన ఎంఓయూలపై ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టూరిజంశాఖలో రెండు రోజులు కలిపి రూ.32 వేల కోట్ల ఎంఓయూలు కుదిరాయన్నారు. ఇందులో ఎక్కువ అమెరికా సంస్థలే ఉన్నాయన్నారు. కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామంలో రూ.100 కోట్లతో కల్చరల్ టూరిజం ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారన్నారు. హెల్త్ టూరిజంలో రాష్ట్రంలో ఆరోగ్య సదుపాయాలు కల్పించడం, మనదేశం బయట ఆరోగ్యానికి ఎలాంటి సదుపాయాలు ఉన్నాయో చెప్పడం అందులోకి వస్తాయన్నారు. హెల్త్ టూరిజంపై ఆఫ్రికాల్లో, మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఈవెంట్లు చేయబోతున్నామన్నారు. రాష్ట్రంలో బుద్ధిస్ట్‌కు సంబంధించి 300 ప్రదేశాలు ఉన్నందున ఇతర రాష్ట్రాల్లో ప్రమోట్ చేస్తున్నామన్నారు. తొట్లకొండ, బావికొండ, విజయవాడలోని ఉండవల్లి తదితర ప్రాంతాల్లోనూ బుద్ధిజం ప్రదేశాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. టెంపుల్ టూరిజంలో శ్రీశైలంలో రూ. 47 కోట్లతో ఇంటర్నెల్ బోట్లు, తాగునీరు తదితర పనులు చేపట్టామన్నారు. తిరుపతిలో గుడికి వెళ్లే దారి అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారన్నారు. అన్నవరంలో తాగునీరు కల్పిస్తున్నామన్నారు. సింహాచలానికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామన్నారు. సీఆర్‌జెడ్ నిబంధనల వల్ల టూరిజంకు ఆటంకాలున్నా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామన్నారు.

ఏయూ పీహెచ్‌డీ అడ్మిషన్లకు తొలగిన అడ్డంకులు

విశాలాంధ్ర-విశాఖసిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొన్ని నెలలుగా వాయిదా పడుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ముందుకు సాగనుంది. ఉన్నత విద్యామండలి నుంచి అడ్డం కులు తొలగిన తర్వాత మరో ప్రధాన సమస్యగా మారిన వర్సిటీలోని హెచ్‌ఆర్ఎం విభాగం శనివారం ఆ విభాగం అభ్యర్థులకు మౌఖిక పరీక్ష మార్కులు వేసి అధికారులకు అందజేసింది. దీంతో నిలిచిపోయిన ఆర్‌సెట్ ఫుల్‌టైం ఎంఫిల్, పీహెచ్‌డీ, అన్ని విభాగాల పార్ట్‌టైం ఫలితాలు రెండు రోజుల్లో విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఈ ఫలితాల విడుదలతోపాటు మార్చి మొదటి వారంలోగా అడ్మిషన్లకు వెబ్‌ఆప్షన్స్ షెడ్యూల్ కూడా విడుదల అయ్యే అవకాశం ఉంది.

ఉత్సాహంగా దంతవైద్యుల క్రీడోత్సవాలు



విశాలాంధ్ర-కాకినాడ: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ తూర్పుగోదావరిజిల్లా కాకినాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో మూడవ రాష్ట్ర స్థాయి దంతవైద్యుల క్రీడోత్సవాలు ఆదివారం స్థానిక జిల్లా క్రీడా మండలి మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 250 మంది దంతవైద్యులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో క్రికెట్, వాలీబాల్, షటిల్, క్యారమ్స్, అథ్లెటిక్స్‌లో జావలిన్, 100 మీటర్ల రన్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, మహిళల విభాగంలో టెన్నీకాయిట్, షటిల్, త్రోబాల్, అథ్లెటిక్స్‌లో దంతవైద్యుల క్రీడాకారులు ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.సుధాకర్‌రాజు, ప్రధాన కార్యదర్శి డా.అజయ్‌బెనర్జీ, సెంట్రల్ కమిటీ సభ్యులు డా.వి.ఎన్.వి. సతీష్, కాకినాడ బ్రాంచ్ ఉపాధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ, కార్యదర్శి డా.రవిచంద్, పూర్వాధ్యక్షులు డా.సుజయ్, ప్రెసిడెంట్ ఎలక్ట్ డా.పాట్లూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.

• రాజ్యసభ రేసులో

'సింహపురి' నేతలు

- వైసీపీ అభ్యర్థి పరిశీలనలో వేమిరెడ్డి
- టీడీపీ అభ్యర్థిత్వం కోసం బీద, ఆదాల



వేమిరెడ్డి



బీద



ఆదాల

విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఏపీ నుంచి చిరంజీవి, రేణుకాచౌదరి, దేవేందర్ గౌడ్ పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఎవరిస్థాయిలో వారు పోటీ పడుతున్నారు. ప్రస్తుత బలాబలాలను బట్టి వైసీపీకి ఒకటి, టీడీపీకి రెండు రాజ్యసభ స్థానాలు దక్కే అవకాశం ఉంది. టీడీపీ అధికార బలంతో పైరవీల ద్వారా వైసీపీ ఎమ్మెల్యేలను ఆకర్షిస్తే మూడు స్థానాలు ఆ పార్టీ ఖాతాలో జమ అయ్యే అవకాశాలు లేకపోలేదు. ఈ సారి రాజ్యసభ రేసులో నెల్లూరు జిల్లా నేతల ప్రభావం స్పష్టంగా కనబడుతోంది. వైసీపీ రాజ్యసభ అభ్యర్థిగా నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరును ఆ పార్టీ దాదాపు ఖరారు చేసింది. ఆయన గతంలో వైసీపీలో చేరినప్పటికీ కొంత కాలం తరువాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. టీడీపీలో చేరతారన్న ప్రచారం నేపథ్యంలో ఇటీవల జగన్ జిల్లాలో పాదయాత్రలో ఆయనతో కలిసి నడిచారు. రాజ్యసభకు పంపిస్తానన్న జగన్ హామీతోనే ఆయన తిరిగి వైసీపీలో చేరినట్టు ప్రచారం. షెడ్యూల్ విడుదలకాగానే మా పార్టీ రాజ్యసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డేనని వైసీపీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. జగన్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. టీడీపీ నుంచి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు రాజ్యసభ రేసులో ఉన్నారు. సీఆర్‌డీఏ సభ్యునిగా కొనసాగుతున్న మస్తాన్‌రావు టీటీడీ చైర్మన్ రేసులోనూ కనబడుతున్నారు. ఆయన సోదరుడు బీద రవిచంద్ర ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. తమ సోదరుడికి అవకాశం ఇవ్వాలని చంద్రబాబునాయుడును రవిచంద్ర కోరినట్లు సమాచారం. రవిచంద్రకు టీడీపీ జిల్లా అధ్యక్షునితో పాటు ఎమ్మెల్సీ పదవి కూడా ఉంది. మళ్లీ అదే కుటుంబంలో మరొకరికి రాజ్యసభ పదవి ఎందుకు అనుకుంటే దక్కే అవకాశం లేదు. మరొకరు మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ రేసులోనూ పోటీ పడ్డారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీకి వచ్చే సమయంలో రాజ్యసభకు పంపుతామని హామీ ఇచ్చినట్లు ప్రచారం సాగింది. ఈ హామీ ప్రకారం తనకు అవకాశం ఇవ్వాలని ఆదాల కోరుతున్నట్లు సమాచారం. పార్టీలో ఈ ఇద్దరు సీనియర్లలో ఒకరిని రాజ్యసభకు కచ్చితంగా పంపుతారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఒకరికి రాజ్యసభకు అవకాశం కల్పించి మరొకరిని వచ్చే సాధారణ ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థిగా పోటీలో నిలిపే అవకాశాలు కనబడుతున్నాయి.

మూడో సీటుపై టీడీపీ కన్ను

రాష్ట్రంలో ప్రస్తుత లెక్కల ప్రకారం టీడీపీకి రెండు, వైసీపీకి ఒక రాజ్యసభ సీటు దక్కుతుంది. కానీ వైసీపీ నుంచి ఒకరిద్దరు చేజారితే మూడు సీట్లు టీడీపీ ఖాతాలోనికే వెళ్లే అవకాశం ఉంది. వైసీపీ అభ్యర్థిగా నెల్లూరుజిల్లాకు చెందిన వేమిరెడ్డి పేరు దాదాపు ఖరారైంది. రెండు స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ఖరారుచేసి మూడో సీటుకు కూడా నెల్లూరు జిల్లా నుంచి ఒకర్ని బరిలోకి దింపే ఆలోచన చేస్తున్నట్టు వినికిడి. మూడో స్థానానికి నెల్లూరు జిల్లా నేతకు అవకాశం ఇస్తే కలిసొస్తుందని అంచనా వేస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు నేతలను టీడీపీ అభ్యర్థులుగా దించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఏపీ నుంచి రాజ్యసభకు మూడు నామినేషన్లు మాత్రమే వెళితే ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. టీడీపీ మూడో స్థానంపై కన్నువేస్తే పోలింగ్ అనివార్యం కానుంది.



ఏజెన్సీ ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్స్‌లు

విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్రంలో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు టూవీలర్ ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు రాష్ట్ర గిరిజన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. విశాఖలోని సమ్మిట్ ప్రాంగణంలో ఆదివారం ఫీడర్ అంబులెన్స్‌లను ఆయన ప్రారంభించారు. వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రవ్యాప్తంగా ఐటీడీఏల పరిధిలో మారుమూల గిరిజన ప్రాంతాల్లోని రోగులను ప్రధాన రహదారులకు తరలించేందుకు ఈ ద్విచక్ర వాహన ఫీడర్ అంబులెన్స్‌లు దోహదపడతాయని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య వివరించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 42, పార్వతీపురంలో 24, సీతంపేటలో 15, రంపచోడవరంలో 21, చింతూరులో 6, కె.ఆర్.పురంలో 8, శ్రీశైలంలో 6 ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఆక్సిజన్‌తోపాటు 32 రకాల వైద్య సదుపాయాలతో ఈ అంబులెన్స్‌ల నిర్వహణ ఉంటుందన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు మృతి - వీరిలో ఇద్దరు చిన్నారులు
- మరో తొమ్మిదిమందికి తీవ్ర గాయాలు
- ఆగివున్న ట్యాంకర్‌ను ఢీకొన్న టాటా వింగర్ వాహనం
- గుంటూరు జిల్లాలో ఘటన



విశాలాంధ్ర-రొంపిచర్ల : జాతీయ రహదారిపై నిలిపిన ఆయిల్ ట్యాంకర్‌ను వెనుక నుంచి దూసుకొచ్చిన టాటా వింగర్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, తొమ్మిది మంది గాయపడిన ఘటన ఆదివారం తెల్లవారుజామున గుంటూరు జిల్లాలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అద్దంకి-నార్కెట్‌పల్లి జాతీయ రహదారిలో గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామం వద్ద తెల్లవారుజామున 4 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మరో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. డీఎస్పీ కె.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. పిడుగురాళ్ళకు చెందిన కొంతమంది వింగర్ వాహనంలో తిరుపతి వెళ్ళి తిరిగి వస్తున్నారు. అన్నవరప్పాడు గ్రామం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను వెనక నుంచి వింగర్ వాహనం బలంగా ఢీకొట్టింది. ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయి ట్యాంకర్‌లో ఇరుక్కుపోయింది. ఆ సమయంలోని వాహనంలో ప్రయాణిస్తున్న13 మందిలో పొత్తూరు ఝాన్సీ (40), పొత్తూరు రోహిత్ (11), పొత్తూరు మాన్యత (8) అక్కడికక్కడే మృతి చెందారు. కొదమగుండ్ల మోతి(40) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ కె.ప్రభాకర్, రొంపిచర్ల, నకరికల్లు ఎస్ఐలు వెంకట్రావు, అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. క్రేన్ రప్పించి వింగర్ వాహనాన్ని బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం నరసరావుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆయిల్ ట్యాంకర్‌ను డ్రైవర్ రోడ్డుపై నిలపడం, టాటా వింగర్ వాహనం అతివేగమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సర్కారుపై గిరిజనుల పోరుబాట

- ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చే నిర్ణయంపై ఆగ్రహం
- మార్చి 11 నుంచి 23 తేదీ వరకు గిరిజన చైతన్య యాత్రలు
- మార్చి 31న విజయవాడలో శంఖారావం
- ఆంధ్రప్రదేశ్ గిరిజన హక్కుల పరిరక్షణ సమితి నిర్ణయం



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): వాల్మీకి బోయలను ఆదివాసీ (ఎస్టీ)జాబితాలో చేర్చాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని, తక్షణం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గుర్నాథం డిమాండ్ చేశారు. దీనిపై మార్చి 11వ తేదీ నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన చైతన్య యాత్రలు (బస్సు జాతా), 31న విజయవాడలో లక్షలాది మందితో గిరిజన శంఖారావం సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుర్నాథం మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందని గిరిజన జాబితాలోకి ఇతర కులాలను చేర్చాలని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ మొండి వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 75 వేల మంది గిరిజన నిరుద్యోగులు డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి ఉద్యోగ అవకాశాలు లేక, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక అర్థాకలితో అలమటిస్తున్నారన్నారు. అటువంటి గిరిజనుల సమస్యలను పరిష్కరించకపోగా పుండుమీద కారం చల్లిన విధంగా ఇతర కులాలను తీసుకురావడం శోచనీయమన్నారు. రాజకీయంగా, ఆర్థి కంగా ఎంతో అభివృద్ధి చెందిన బోయ లను కేవలం రాజకీయస్వార్థం కోసం గిరిజన జాబితాలో చేర్చాలని నిర్ణయిం చడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించకపోతే రానున్న ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెపుతామని హెచ్చ రించారు. సమావేశంలో ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరసా గోవిందు, రాష్ట్ర ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ మూడావత్ విష్ణునాయక్, షెడ్యూ రాష్ట్ర అధ్యక్షులు బి. రామస్వామి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ నాయక్, రాష్ట్ర గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు మేడా రమేష్, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుడమల రామచంద్రయ్య, గిరిజన ఐక్య వేదిక నాయకులు వివేక్ వినాయక్, మాజీ శాసనసభ్యులు నిమ్మక జయ రాజ్, చిట్టిబాబు, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నేటి నుంచి 3 లక్షల ఇళ్ల పనులు ప్రారంభం



విశాలాంధ్ర - రాయదుర్గం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పక్కా గృహనిర్మాణ ప్రారంభోత్సవ పనులు ఈ నెల 26వ తేదీ నుండి 15 రోజుల వరకు జరు గనున్నట్లు రాష్ట్ర గ్రామీణ గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల పక్కా గృహాల నిర్మాణ పనుల ప్రారం భోత్సవాలను చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవ సాయ పనులు, ఇతర ఇబ్బందులతో గృహ నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింద న్నారు. అలా కాకుండా పూర్తి స్థాయి లో పునాదుల ఛాయా చిత్రాలు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ వారికి చేరేలా చర్యలు చేపట్ట నున్నట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు కాగితాలకే పరి మితం కాకుండా క్షేత్ర స్థాయిలో పూర్తి చేసేలా అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపనున్నా రన్నారు. అనంతపురం జిల్లాలో 25 వేల ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన రాయ దుర్గంలో శంకుస్థాపన పనులు ప్రారంభిస్తున్నం దుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ముద్దిగల్లు జ్యోతి, తెలుగుదేశం నాయకులు పూజారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 10 క్రీడా అకాడమీలు

రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఎండీ బంగార్రాజు



విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రంలో కొత్తగా పది క్రీడా అకాడమీలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బంగార్రాజు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక సెట్‌శ్రీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో అథ్లెటిక్స్‌కు ప్రస్తుతం ఆరు క్రీడా అకాడమీలున్నాయని, కొత్త అకాడమీలు టీమ్ స్పోర్ట్స్‌కు సంబంధించినవన్నారు. రాష్ట్రంలో యువజన సర్వీసుల శాఖ, క్రీడా శాఖలను విలీనంచేసి యువజన క్రీడాశాఖగా ఏర్పాటు చేశామన్నారు. ఇకపై జిల్లాలో పరిపాలనాపరమైన అంశాలను జిల్లా యువజన క్రీడల అధికారి నిర్వహిస్తారన్నారు. క్రీడాకారులకు శిక్షణ, క్రీడా సాంకేతికత అంశాలను చీఫ్ కోచ్ చూసేలా ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిందన్నారు. క్రీడల్లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దీనిలో ప్రతిభావంతులైన 75 మంది క్రీడాకారులను గుర్తించి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా విదేశీ కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామన్నారు. విదేశీ కోచ్‌లు మూడేళ్లపాటు ఇక్కడే ఉండి శిక్షణ ఇస్తారని చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో ఎన్‌టీ ఆర్ క్రీడావికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 30 కేంద్రాలు పూర్తి అయ్యాయని, 118 ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. పూర్తయిన కేంద్రాలకు కోచ్ లేదా సీనియర్ పీఈటీలను నియమించి క్రీడాపరికరాలు అందిస్తున్నామన్నారు. పాఠశాల స్థాయి, క్రీడా అకాడమీల స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించేలా క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. అరకులో గిరిజన క్రీడా పాఠశాల ఏర్పాటు చేసామని అన్నారు. సెట్‌శ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.వి.ప్రసాదరావు, జిల్లా అధికారి శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమలన్నీ రాయలసీమకే వెళుతున్నాయి!

బీజేపీ నేతలపై రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: రాయలసీమకు ఏమీ ఇవ్వలేదంటూ బీజేపీ నేతలు మిడిమిడిజ్ఞానంతో మాట్లాడుతున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. విశాఖలో ఆదివారం సీఐఐ సదస్సుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలన్నీ రాయలసీమకే వెళ్ళా యన్నారు. కియో కార్ల కంపెనీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీ వంటివి వచ్చాయ న్నారు. ఉత్తరాంధ్రలో ఫార్మాకు అను కూలంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా భావన పాడులో అదానీ పోర్టు నిర్మాణానికి అంగీ కరించారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వోక్స్‌వ్యాగన్ వచ్చినా ప్రారంభ సమయానికి వెళ్లిపోయిందన్నారు. కియో రాయలసీమలో పెట్టినందువల్ల ఈసారి ఉత్తరాంధ్రకు ఆటోమొబైల్ సంస్థను తీసుకురావాలనే ఆలోచనలో సీఎం ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ బాగుందని తాము చెప్పడం వల్లే కేంద్రం నిధులు ఇవ్వలేదని కొందరంటున్నారని, వాళ్లు సహకరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చోదన్నారు. ప్రత్యేకహోదా అమలవుతున్న రాష్ట్రాల్లోనూ రద్దు చేస్తామని చెప్పుకొచ్చిన కేంద్రం ఇప్పుడు మళ్లీ పొడిగిస్తామంటున్నందున ఏపీకి ఇవ్వాలని అడుగుతున్నామన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి తీసుకొచ్చిన చెడ్డపేరును పోగొట్టేం దుకు సీఎం ఎంతో కష్టపడుతున్నారన్నారు.

కోహ్లీకి కృతజ్ఞతలు : రైనా



▶ స్వేచ్ఛగా ఆడమని ప్రోత్సహించాడు ▶ టీమిండియా జెర్సీకోసం ఎదురు చూశా

కేప్‌టౌన్:
'భారత్ తరపున మళ్లీ ఆడాలన్న కాంక్ష మరింత బల పడింది. 2019 ప్రపంచకప్‌లో నేను ఆడాలను కుంటున్నా. ఎందుకంటే ఇంగ్లండ్‌లో బాగా ఆడతానని తెలుసు. నాలో ఇంకా ఎంతో సత్తా ఉంది. దక్షిణాఫ్రికాతో మూడు టీ20ల సిరీస్‌లో రాణిస్తానన్న నమ్మకం ఉంది' అంటూ దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు బోర్డు నుంచి పిలుపురాగానే రైనా అన్న మాటలివి. అయితే మొదటి రెండు టీ20ల్లో నామమాత్రపు పరుగులు చేసిన ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మేన్.. తప్పక గెలవాల్సిన చివరి మ్యాచ్‌లో సరైన సమయంలో చెలరేగి ఆడాడు. 1.3 ఓవర్‌లోనే కెప్టెన్ రోహిత్ శర్మ వెనుదిరగడంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాల్సిన బాధ్యత రైనా వంతైంది. ఈ క్రమంలో మరో ఓపెనర్ ధావన్‌తో కలిసి రైనా 43 (27బంతుల్లో 5×4, 1×6) పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం పార్ట్‌టైమ్ స్పిన్నర్ అవతారమెత్తి ప్రమాదకర మిల్లర్ 24(23బంతుల్లో, 2×4, 1×6)ను బోల్తా కొట్టించి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' చేజిక్కించుకున్నాడు. 'రెండేళ్లుగా నేను ఎంతో కష్టపడు తున్నాను. జాతీయ క్రికెట్ అకాడమీలో కఠోరంగా శ్రమించా. నా కెరీర్‌లో నేనెప్పుడూ ఫిట్‌గానే ఉన్నా. కచ్చితంగా భారత్ తరపున ఆడతానని ఆశించాను. దాని కోసం ప్రతి క్షణం శ్రమిస్తూనే ఉండేవాడిని. నేను తప్ప కుండా భారత్ జెర్సీ ధరిస్తానని నన్ను నిత్యం ప్రోత్స హించిన నా భార్యకు ధన్యవాదాలు' అని రైనా తెలిపాడు.

నా కోసం కోహ్లీ త్యాగం..
మరోవైపు నాలోని సత్తాను ముందే గుర్తించిన కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ప్రత్యేక కృతజ్ఞతలు. రెండున్నర నెలలకు పైగా జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ప్రతి ఒక్క ఆటగాడికి తగిన ప్రాధాన్యమిస్తున్నాడు. విరాట్ టీ20ల్లో మూడో స్థానంలో దిగి ఎన్నో గుర్తుండి పోయే ఇన్నింగ్స్ ఆడాడు. కానీ ఈ సిరీస్‌లో మాత్రం నా కోసం తన స్థానాన్ని త్యాగం చేశాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపి స్వేచ్ఛగా ఆడేమని మొదటి నుంచి ప్రోత్సహించాడు అని రైనా చెప్పాడు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం టీంఇండియా మిడిల్ ఆర్డర్‌లో బలహీనంగా ఉందని వన్డే సిరీస్ ముగిసిన అనంతరం కోచ్ రవిశాస్త్రి అన్న సంగతి తెలిసిందే. దీంతో ఇంతకుముందు మిడిల్ ఆర్డర్‌లో రాణించిన సురేశ్ రైనాకే సెలక్షన్ కమిటీ మొగ్గు చూపింది. ఈ క్రమంలో వెతుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని జట్టులో స్థానాన్ని పదిలం చేసుకోవాలని ఈ ఉత్తరప్రదేశ్ బ్యాట్స్‌మెన్ ఆశిస్తున్నాడు. శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు సిరీస్ పైనే తన దృష్టి అంటూ రైనా చెప్పాడు. అనంతరం ఐపీఎల్ ద్వారా వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడి 2019 ప్రపంచ కప్‌లో కచ్చితంగా స్థానం సంపాదించాలని రైనా ఆశిస్తున్నాడు. 31 ఏళ్ల రైనా టీమ్‌ఇండియా తర పున 223 వన్డేలు, 68 టీ20లు ఆడాడు.

ప్రత్యేక అనుభూతి : కోహ్లీ



కేప్‌టౌన్ :
"ఐసీసీ టెస్టు చాంపియన్ షిప్ గద వరుసగా రెండోసారి అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. భారత జట్టులో ఉన్న ప్రతి ఒక్కరికి ఇది ఎంతో ప్రత్యేకమైన అనుభూతి. భారత్ క్రికెట్ సిబ్బందికి కూడా ధన్యవాదాలు. ఇక ప్రపంచ వ్యాప్తంగా పెద్ద పెద్ద జట్లతో ఆడుతున్నప్పుడు దగ్గరుండి మమల్ని ప్రోత్సహించిన భారత క్రికెట్ అభిమానులందరికీ కృతజ్ఞతలు. కఠిన సమయాల్లో కూడా మా వెంటే ఉండి నిత్యం ప్రోత్సహించారు. ఇదే ప్రదర్శనను కొనసాగిస్తూ భారత క్రికెట్‌ను ఉన్నత శిఖరాల్లో నిలబెడతామని మీకు మాటిస్తున్నాను. ఇదంతా అభిమానులు, జట్టు సమష్టి విజయం. రానున్న 12-18 నెలల్లో విదేశాలలో కఠినమైన సిరీస్‌లు ఆడునున్నాం. ఇదే ప్రోత్సహాన్ని అప్పుడు కూడా మీ నుంచి పొందుతామని ఆశిస్తున్నట్లు" ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ గదను అందుకున్న అనంతరం భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ అన్న మాటలివి. కొన్నేళ్లుగా టెస్టుల్లో నిలకడగా ఆడుతూ అద్భుతంగా రాణించడం వల్లే అగ్రస్థానాన్ని పదిలం చేసుకోగలిగామని కోహ్లీ అన్నాడు. టెస్టుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న భారత్‌కు ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ గదను అందించింది. కేప్‌టౌన్‌లో ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ సునీల్ గవాస్కర్, గ్రేమ్ పొల్లాక్ చేతుల మీదుగా భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ఈ గదను అందుకున్నాడు.

గదతో పాటు 1బిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ సైతం ఐసీసీ టీంఇండియాకు అందజేసింది. టెస్టుల్లో అగ్రస్థానంలో ఉన్న భారత్‌కు దరిదాపుల్లో కూడా ఏ జట్టు లేకపోవడంతో ఐసీసీ టెస్ట్ చాంపియన్ షిప్ గదను అందించింది. టీంఇండియా 2016 అక్టోబర్ నుంచి టెస్టుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కోహ్లీ కంటే ముందు ఈ గదను అందుకున్న ఘనత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని పేరున ఉంది. ధోని నేతృత్వంలో టీంఇండియా 2009 నవంబర్ నుంచి 2011 ఆగస్టు వరకు అగ్రస్థానంలో కొనసాగింది.

గంగూలీకి ముషారఫ్ హెచ్చరిక..!



కోల్‌కతా:
టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి అప్పటి పాక్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ వార్నింగ్ ఇచ్చిన విషయాన్ని తాజాగా 'దాదా' వెల్లడించాడు. తన ఆత్మకథ 'ఏ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్'లో గంగూలీ ఈ విషయాన్ని పేర్కొన్నాడు. 2004లో పాక్‌తో వన్డే సిరీస్ ఆడేందుకు వెళ్లినప్పుడు ఈ ఘటన జరిగినట్టు పేర్కొన్నాడు. గంగూలీ సారథ్యంలోని భారత జట్టు లాహోర్‌లోని స్విస్ పెరల్ కాంటినెంటల్ హోటల్‌లో బస చేసింది. ఆ సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకుంది. దీంతో సంబరాల్లో మునిగి తేలిన భారత జట్టు బయటకు వెళ్లి సెలెబ్రేట్ చేసుకోవాలని భావించింది. అప్పటికి రాత్రి అయింది. దీంతో బయటకు వెళ్తే సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంటారని భావించిన గంగూలీ కేవలం టీమ్ మేనేజర్ రత్నాకర్ షెట్టికి మాత్రమే ఈ విషయాన్ని చెప్పాడు. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు టోపీ పెట్టుకుని హోటల్ వెనక ద్వారం నుంచి బయటపడ్డారు.

ఇలా బయటకు వెళ్లడం నిబంధనలను ఉల్లంఘించడమేనని తెలిసినా సరదా కోసం చేయక తప్పలేదని గంగూలీ పేర్కొన్నాడు. బయటకు వెళ్లి డిన్నర్ పూర్తి చేసి బయటకు వచ్చాక పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ గంగూలీని గుర్తుపట్టి పిలిచారు. గంగూలీ అన్న పిలుపు వినిపించడంతో అందరూ గంగూలీని చుట్టుముట్టేశారు. దీంతో విషయం కాస్తా, అప్పటి అధ్యక్షుడు ముషారఫ్‌కి చేరింది. ఇంకేముంది.. గంగూలీని ఆయన సుతిమెత్తగా హెచ్చరించారట. ఇంకోసారి బయటకు వెళ్లాలనిపిస్తే దయచేసి సెక్యూరిటీ సిబ్బందికి చెప్పాలని సూచించారు. చెబితే వెంట భద్రతా సిబ్బందిని పంపిస్తామని అన్నారట. అంతేకాదు.. ఇంకోసారి ఇలా అర్ధరాత్రి సాహసాలు చేయవద్దంటూ కాస్తంత కఠినంగానే చెప్పినట్టు గంగూలీ తన ఆత్మకథలో వివరించాడు.

త్రై సిరీస్‌కు టీం ఎంపిక

కోహ్లీ, ధోనీలకు విశ్రాంతి.. రోహిత్‌కు సారథ్య బాధ్యతలు



ముంబై :
శ్రీలంక, బంగ్లాదేశ్‌తో మార్చి 6 నుంచి జరిగే ముక్కోణపు టీ20 సిరీస్‌కు భారత జట్టు ఎంపికైంది. చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలో సమావేశమైన చీఫ్ సెలక్షన్ కమిటీ ఈ మేరకు జట్టు ను ప్రకటించింది. రోహిత్‌శర్మ సారథ్యంలో 15 మందితో కూడిన జట్టు ముక్కోణపు సిరీస్‌లో ఆడనుంది. టీమిండియా సారథి విరాట్ కోహ్లీ, వికెట్ కీపర్ ధోనీకి సెలక్టర్లు విశ్రాంతి ఇచ్చారు.

జట్టు వివరాలు..
రోహిత్‌శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజువేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనద్కత్, మహమ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

ఆర్ఆర్ కెప్టెన్‌గా స్టీవ్ స్మిత్



న్యూఢిల్లీ :
రెండేళ్ల నిషేధం తర్వాత 2018 ఐపీఎల్‌లో పునరాగమనం చేస్తున్న రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్ కెప్టెన్ పేరును వెల్లడించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కే జట్టు బాధ్యతలు అందిస్తున్నట్లు టీం మెంటర్ షేన్‌వార్న్ శనివారం స్టార్ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రకటించారు. దీంతో ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్‌ను స్టీవ్ స్మిత్ ముందుండి నడిపించనున్నాడు. 2014, 15 సీజన్లలో స్మిత్ రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడాడు.

విశిష్ట కెప్టెన్ల జాబితాలో రోహిత్



కేప్‌టౌన్:
దక్షిణాఫ్రికాతో జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఏడు పరుగుల తేడాతో విజయం సాధించి 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెన్ను నొప్పి కారణంగా విరాట్‌కోహ్లీ ఆఖరి టీ20కి దూరమయ్యాడు. రోహిత్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన సఫారీ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 165 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ టూర్‌లో బ్యాట్‌తో ఆశించినంతగా రాణించలేకపోయిన రోహిత్‌శర్మ చివరి టీ20లో సారథ్య బాధ్యతలు చేపట్టి సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో రోహిత్ విశిష్ట కెప్టెన్ల జాబితాలో చోటు సంపాదించుకున్నాడు. సారథ్య బాధ్యతలు చేపట్టిన మ్యాచ్‌తోనే సిరీస్‌ను కైవసం చేసుకున్న కెప్టెన్ల జాబితాలో చేరాడు. ఇంతకుముందు మిస్బావుల్ హక్, షాహిద్ అఫ్రిది, సర్ఫరాజ్ అహ్మద్, శ్రీలంక ఆటగాళ్లు సంగక్కర, లసిత్ మలింగలు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలినాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించారు. ఇప్పుడు వీరి సరసన రోహిత్ శర్మ చేరాడు. డిసెంబరు 2017లో శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో రోహిత్ శర్మ తొలిసారి సారథ్య బాధ్యతలు చేపట్టాడు.

మాలో మార్పునకు ఐపీఎల్ కారణం : భువీ



కేప్‌టౌన్ :
దక్షిణాఫ్రికాతో జరిగిన టీ 20 సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ సిరీస్ అవార్డు గెలుచుకున్న భారత పేసర్ భువనేశ్వర్ కుమార్ తన ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తం చేశాడు. కొంత కాలంగా తన బౌలింగ్‌లో వైవిధ్యం పెరిగిందని పేర్కొన్న భువీ.. ఈ మార్పునకు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) కారణమని స్పష్టం చేశాడు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు గెలుచుకున్న క్రమంలో మాట్లాడిన భువీ..'ప్రతీ సిరీస్‌కు మనం ఎలా సన్నద్ధం అవుతున్నామన్నదే ఇక్కడ ముఖ్యం. దాన్ని దృష్టిలో పెట్టుకునే ప్రతీ సిరీస్‌కు ముందు ఒక కచ్చితమైన ప్రణాళిక రచించుకుంటా. ఇటీవల నా బౌలింగ్‌లో వైవిధ్యం పెరిగింది. ఇందుకు కారణం ఐపీఎల్. భారత బౌలర్లను ఒక ఆలోచనలో పడేసి రాటుదేలేలా చేసింది మాత్రం ఐపీఎలే. మాలో మార్పునకు కారణం అదే. పవర్ ప్లేలో సాధ్యమైనంత నియంత్రణతో బౌలింగ్ చేయడం ఎలానో ఐపీఎల్ ద్వారా నేర్చుకున్నాం. ఈ క్రమంలోనే నకుల్ బాల్స్, స్లో బంతులను సంధించి సక్సెస్ అయ్యాం. ఇదే మంత్రాన్ని పొట్టి ఫార్మాట్‌లో కూడా ప్రయోగిస్తూ ముందుకు వెళుతున్నాం. ప్రధానంగా విదేశాల్లో వికెట్ల తీయడాన్ని వంట బట్టించుకున్నాం. ఇదే ప్రదర్శనను ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో కూడా పునరావృతం చేస్తాం' అని తెలిపాడు.

కబడ్డీకి వేదిక బాపట్ల



విశాలాంధ్ర-బాపట్ల :
వేగేశన ఫౌండేషన్ సౌజ న్యంతో ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన చంద్ర బాబునాయుడు 10వ ఆల్‌ఇండియా బీచ్ కబడ్డీ పోటీలు ఆది వారం ప్రారంభమ య్యాయి. ఈ కార్య క్రమాన్ని రాష్ట్ర కల్లుగీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ తాతా జయప్రకాష్ నారా యణ, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, ఎంపీపీ మానం విజేత, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేఈ ప్రభాకర్, వేగేశన ఫౌండేషన్ చైర్మన్, టీడీపీనేత వేగేశన నరేంద్రవర్మరాజులు జ్యోతి ప్రజ్వలన చేసి ఆల్ ఇండియా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ కారణంగా తీరంలో సందడి నెలకొనడం విశేషం. ఇప్పటికే 25 రాష్ట్రాల నుంచి 50 జట్లు తీరానికి చేరుకున్నట్లు ఆల్ ఇండియా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీర్లం కయ్య తెలిపారు. మరో మూడు రోజుల పాటు మహిళలు, పురుషులతో నిర్వ హిస్తున్న బీచ్ కబడ్డీ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాభిమానులు రావడం ఆనందదాయకమని వేగేశన ఫౌండేషన్ చైర్మన్ రాజు తెలిపారు. మొదటి రోజు పోటీల్లో హర్యాన పురుషుల జట్టు, ఏపీ మహిళా జట్లు, తెలం గాణ, కేరళ, కర్ణాటక జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. కార్య నిర్వాహక కమిటి సభ్యులు సర్పంచ్ సంఘ అధ్యక్షులు గుండ్రెడ్డి శివ, ఊసా రాంబాబు, తాతా బశవ శంఖర్, ముమ్మలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందుకే ఓడాం : డుమిని



కేప్‌టౌన్:
టీమిండియాతో జరిగిన చివరిదైన మూడో టీ20లో ఓటమి చెందడం పై దక్షిణాఫ్రికా కెప్టెన్ జేపీ డుమినీ ఆవేదన వ్యక్తం చేశాడు. తమ ఓటమికి భారత బౌలర్ల నియంత్రణతో కూడిన బౌలింగే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టీమిండియా బౌలర్లు పవర్ ప్లేలో అద్భుతంగా బౌలింగ్ చేసి తమను హిట్టింగ్ చేయకుండా కట్టడి చేశారన్నాడు. తొలి ఆరు ఓవర్లలో బౌండరీలను సాధించడం కంటే కూడా సింగిల్స్ తీయడమే గగనంగా మారిపోయిందన్నాడు. భారత పేసర్లు నకుల్ బాల్స్, స్లో బంతులతో తమను బాగా ఇబ్బంది పెట్టార న్నాడు. దాంతో పవర్ ప్లేలో 30 పరుగులు వెనుకబడి పోయామని, అదే ఓటమిపై ప్రభావం చూపిందని డుమినీ విశ్లేషించాడు. ఇక్కడ క్రెడిట్ మొత్తం భారత జట్టుదేనని ప్రశం సించాడు. చివరి టెస్టులో భారత జట్టు విజయం సాధించిన తర్వాత ఆ జట్టులో ఆత్మవిశ్వాసం బాగా పెరిగిందన్నాడు. దాంతో నే వరుసగా రెండు సిరీస్‌లను కైవసం చేసుకుని తమకు షాకిచ్చారన్నాడు. ఈ ద్వైపాక్షిక సిరీస్‌లో ఎదురైన ఓటముల నుంచి పాఠం నేర్చుకున్నామన్నాడు. ఇదొక అద్భుతమైన సిరీస్‌గా డుమినీ అభివర్ణించాడు. తమ యువ క్రికెటర్లు వచ్చిన అవకాశాల్ని బాగా ఉపయోగించుకోవడం శుభపరిణామం అని డుమినీ పేర్కొన్నాడు.

ఐసీసీకి బీసీసీఐ షాక్

ముంబై :
అంతర్జాతీయ క్రికెట్ కమిటీ(ఐసీసీ)కి బీసీసీఐ పెద్ద షాక్ ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 4 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మార్చాలన్న ఐసీసీ అభ్యర్థనను బీసీసీఐ నిర్మొమహమాటంగా తోసిపుచ్చింది. ఏప్రిల్ 22 నుంచి ఏప్రిల్ 26 వరకు జరిగే మ్యాచ్‌లను కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహించాలని ఐసీసీ కోరింది. ఆ సమయంలో కోల్‌కతాలో ఐసీసీ వార్షిక సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రముఖులు ఐపీఎల్ చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని, అందుకు మ్యాచ్‌ల షెడ్యూల్ మార్చాలని ఐసీసీ కోరింది. అయితే షెడ్యూల్ ప్రకారం ఆ సమయంలో కోల్‌కతాలో మ్యాచ్‌లు లేవు. ఆ ఐదు రోజుల్లో హైదరాబాద్, ముంబై, ఇండోర్, బెంగళూరు, జైపూర్‌ల్లో మ్యాచ్‌లు జరుగనున్నాయి. దీంతో ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పులు చేస్తే.. పూర్తి షెడ్యూల్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది కాబట్టి షెడ్యూల్‌లో మార్పులు అసంభవమని బీసీసీఐ పేర్కొంది. నిజానికి ఆ సమావేశం ముంబైలో జరగాలి. కానీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ నాజం సేథీ హాజరవుతున్న నేపథ్యంలో జరిగే పరిణామాల దృష్ట్యా సమావేశం వేదికని కోల్‌కతాకు మార్చారు.

హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు

- అఖిల భారతీయ యాదవ మహాసభ నిర్ణయం
- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు డిమాండు



విశాలాంధ్ర-అమరావతి :
నిరంతర పోరాటాలతోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హక్కులు సాధించుకోగలమని అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం అఖిల భారతీయ యాదవ మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర యాదవ యువ గర్జన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి భారీ సంఖ్యలో యాదవ సామాజిక వర్గ నాయకులు, యువత భారీ సంఖ్యలో తరలి వచ్చారు. లాకా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యాదవులు నేటికి దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల మాదిరిగా పార్టీ జెండా రూపొందించామని తెలిపారు. నెమలి పింఛమ్, ఫ్లూట్ గుర్తులతో ఈ జెండా ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో యాదవులు ఉనికిని చాటి చెప్పేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీటీడీ పాలక మండలి చైర్మన్ పదవిని యాదవులకు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని కోరామన్నారు. ప్రతిపక్ష నేత జగన్‌క తమ డిమాండ్లు చెప్పామని అన్నారు. సన్నిధి గొల్లలు విషయంలో ఇబ్బందులు పరిష్కరించి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబుకి కూడా 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించామని తెలిపారు.

ప్రధాన డిమాండుగా యాదవ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరామన్నారు. కల్యాణలక్ష్మీ పథకం కింద పేద యాదవ మహిళలకు ఐదు లక్షల రూపాయలు కేటాయించాలని కోరారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి బీసీల అభ్యున్నతికి బాటలు వేయాలని కోరారు. ఏ రాజకీయ పార్టీ యాదవులు సంక్షేమానికి కృషి చేస్తుందో వారికి తమ మద్దతు తెలియచేస్తామన్నారు. త్వరలో ఐదు లక్షల మందితో యాదవ గర్జన నిర్వహిస్తామని, ప్రభుత్వానికి యాదవులు సత్తా చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ గోగుల రమణ, దూది బ్రహ్మయ్య యాదవ్, అన్నా రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



15 ఏళ్ల తరువాత గర్జించిన శతఘ్నులు

- యురి సెక్టార్‌లో అప్రమత్తత ప్రకటించిన అధికారులు
- గ్రామాలు ఖాళీ చేయాలంటూ ఆదేశాలు

న్యూఢిల్లీ :
భారత్-పాక్ సరిహద్దులోని యురి సెక్టార్‌లో చిన్నపాటి యుద్ధమే మొదలైంది. దాదాపు 15ఏళ్ల తర్వాత ఇరు పక్షాలను పరస్పరం శతఘ్నులను ఉపయోగించి దాడులు చేసుకున్నాయి. 2003లో జరిగిన ఒప్పందం ప్రకారం ఇరు దేశాల సైన్యాలు శతఘ్నుల వినియోగాన్ని నిలిపివేశాయి. కానీ గత సోమవారం యురి సెక్టార్‌లోని హాజీపీర్‌లో ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయి. ఇవి క్రమంగా పెరుగుతూ మోర్టార్ షెల్స్‌ను ప్రయోగించుకున్నాయి. శనివారం పరిస్థితి మరింత దిగజారింది. భారీ శతఘ్నులను రంగంలోకి దించాయి. దీంతో అక్కడ నివసించే దాదాపు 8000 మంది ప్రజలు భయం గుప్పిట బతుకుతున్నారు. యురి సెక్టార్‌లో అత్యంత అప్రమత్తత ప్రకటించారు. ఇక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 11.50 సమయంలో పాక్ సైన్యం ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారని శ్రీనగర్‌లోని రక్షణశాఖ ప్రతినిధి రాజేష్ ఖలియా తెలిపారు. దీనికి భారత బలగాలు ధీటుగా జవాబిచ్చినట్లు చెప్పారు. గత వారం ప్రారంభంలో పాక్ దళాల కాల్పులకు దిగాయి. దీనికి ప్రతిగా హాజీపీర్ వద్ద భారత బలగాలు పాకిస్థాన్ బంకర్‌ను ధ్వంసం చేశాయి. దీంతో పాక్ బలగాలు ఎల్‌వోసీ వెంట పలు భారత బంకర్లపై దాడులను ప్రారంభించాయి. సిలికోట్‌లో పాక్ బలగాల దాడిలో రెండు ఇళ్లు దెబ్బతిన్నాయి. పాక్ బలగాలు ఆదివారం తెల్లవారుజాము నుంచే మసీదుల్లోని లౌడ్‌స్పీకర్లను వినియోగించి సరిహద్దుల్లోని గ్రామాలు ఖాళీ చేయాలంటూ హెచ్చరికలు జారీ చేశాయి.

వసంత కోకిల వెళ్లిపోయింది


మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి పద్మశ్రీ అవార్డును స్వీకరిస్తున్న శ్రీదేవి

ముంబై : అందాల నటి శ్రీదేవి(54) దుబాయ్‌లో గుండెపోటుతో శనివారం రాత్రి కన్నుమూశారు. ఒక పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు ఆమె దుబాయ్ వెళ్లారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో శ్రీదేవి గుండెపోటుతో మృతి చెందినట్లు సంజయ్ కపూర్ ట్వీట్ చేశారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమలో ఆమె 200లకు పైగా సినిమాల్లో నటించారు. శ్రీదేవి హఠాన్మరణంతో సినీ లోకం మూగబోయింది. ఆమె మృతి పట్ల టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలిపారు. బాలీవుడ్ నిర్మాత, హీరో అనిల్ కపూర్ సోదరుడు బోనీ కపూర్‌ను1996లో శ్రీదేవి వివాహం చేసుకున్నారు. ఈమెకు ఇద్దరు కూతుళ్లు జాహ్నవి, ఖుషి.

1963, ఆగస్టు 13న శివకాశిలో జన్మించిన శ్రీదేవి 1967లో బాలనటిగా సినీరంగ ప్రవేశం చేశారు. ఆమె అసలు పేరు శ్రీఅమ్మయ్యంగర్ అయ్యప్పన్. ఆమె తండ్రి అయ్యప్పన్ తమిళనాడువాసి కాగా, తల్లి రాజేశ్వరి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. 1969లో తునైవన్‌లో నాలుగేళ్ల వయస్సులో బాలనటిగా శ్రీదేవి సినీరంగ ప్రవేశం చేశారు.

హీరోయిన్‌గా శ్రీదేవి తొలి చిత్రాలు తెలుగులో పదహారేళ్ల వయసు, హిందీలో సోల్వాసావన్. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన మూండ్రు ముడిచులో కమల్‌హాసన్, రజనీకాంత్‌లతో కలిసి నటించి ఆవిడ స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుని పలువురి ప్రశంసలు పొందారు. 1975-85 మధ్య కాలంలో తెలుగు, తమిళంలో ఆమె అగ్ర కథనాయిక స్థానానికి ఎదిగారు. అయితే 1997లో తన కుటుంబంపై దృష్టిసారించేందుకు చిత్రాలకు బ్రేక్ ఇచ్చారు. 2012లో ఇంగ్లీష్-వింగ్లీష్ చిత్రంతో శ్రీదేవి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించారు. ఇటీవలే మామ్ చిత్రంతో నటించి అందరిని అలరించారు. గత ఏడాది అక్టోబరులో షారూఖ్ ఖాన్ హీరోగా నటించిన 'జీరో'లో ఆమె అతిథి పాత్రలో నటించారు. ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబరులో విడుదల కానుంది.

తెలుగులో అగ్రనటులందరితోనూ నటించారు. తెలుగు 85, తమిళం 72, మళయాళం 26, హిందీ 71 సినిమాల్లో నటించి లక్షల సంఖ్యల్లో అభిమానులను సంపాదించుకున్నారు. 15 ఫిలింఫేర్ అవార్డులు ఆమెను వరించాయి. 2013లో శ్రీదేవిని పద్మశ్రీ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించింది. చాందిని, లమ్హే, మిస్టర్ ఇండియా, నాగిన వంటి బ్లాక్‌బ్లాస్టర్ సినిమాల్లో నటించి అందరి మన్ననలు పొందారు. చివరిసారిగా మామ్ చిత్రంలో నటించారు. కొండవీటి సింహం, వేటగాడు, సర్దార్ పాపరాయుడు, బొబ్బిలిపులి, ప్రేమాభిషేకం, జగదేకవీరుడు అతిలోకసుందరి, క్షణక్షణం, గోవిందా గోవిందా సినిమాల్లో శ్రీదేవి నటించారు.

స్టీవెన్ స్పీల్‌బర్గ్ కూడా అడిగాడు..

భారత సినీరంగ మహిళా సూపర్‌స్టార్‌గా పేరొందిన అందాల నటి శ్రీదేవి ఒక అరుదైన అవకాశం కూడా వచ్చింది. 1993లో జురాసిక్ పార్కు సినిమాలో నటించాల్సిందిగా ఆ చిత్ర దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ ఆఫర్ ఇచ్చాడు. అయితే బాలీవుడ్‌పై దృష్టిసారించేందుకు ఆమె ఆ ఆఫర్‌ను నిరాకరించారు.

మరణానికి కొన్ని గంటల ముందు శ్రీదేవి ఇలా..

శ్రీదేవి దుబాయ్‌లో మేనల్లుడు మోహిత్ పెళ్లికి వెళ్లారు. మృతి చెందడానికి కొన్ని గంటల ముందు పెళ్లి వేడుకలో ఆమె పాల్గొన్న వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

శ్రీదేవికి ఎప్పుడూ గుండెపోటు రాలేదు : సంజయ్‌కపూర్

ముంబై : శ్రీదేవి హఠాన్మరణంతో తమ కుటుంబం మొత్తం షాక్‌కు గురైందని, ఆమెకు ఎలాంటి గుండె జబ్బులూ లేవని ఆమె మరిది, బాలీవుడ్ నటుడు సంజయ్ కపూర్ తెలిపారు. దుబాయ్‌లోని జుమేరియా ఎమిరేట్స్ టవర్ హోటల్లో శ్రీదేవితోపాటు ఆమె కుటుంబం బస చేసింది. అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో ఆమె బాత్‌రూమ్‌లోనే స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే దగ్గర్లోని రషీద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు చెప్పారు. రాత్రి 11 గంటల సమయంలో ఆమెకు హార్ట్ అటాక్ వచ్చినట్లు సంజయ్ కపూర్ ఖలీజ్ టైమ్స్‌కు చెప్పారు.

శ్రీదేవి చివరి డ్యాన్స్ వీడియో



శ్రీదేవి (చివరి క్షణాల్లో) దుబాయ్‌లో జరిగిన మోహిత్‌మార్వా-అంటారా పెళ్లి వేడుకలో ఎంతో సంతోషంగా తనకిష్టమైన పాటకు డ్యాన్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. శ్రీదేవి తన భర్త బోనీకపూర్‌తో కలిసి హుషారుగా కాలా ఛష్మా సాంగ్‌కు స్టెప్పులేసిన వీడియో వైరల్‌గా మారింది. ఐదు పదుల వయసులో కూడా తనదైన డ్యాన్స్‌తో హుషారెత్తించారు శ్రీదేవి.

కోట్లాది గుండెలు కొల్లగొట్టి నిష్క్రమించారు

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం




న్యూఢిల్లీ : సీనియర్ నటి శ్రీదేవి(54) మృతి పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీ ట్విట్టర్‌లో సంతాపం తెలియజేశారు. శ్రీదేవి మృతి వార్త విని షాక్‌కి గురయ్యా. కోట్లాది అభిమానుల గుండెబద్దలు కొట్టేసి ఆమె వెళ్లిపోయారు. మూండ్రమ్ పిరై, లమ్హే, ఇంగ్లీష్ వింగ్లీష్ లాంటి చిత్రాలు ఎందరికో ఆదర్శంగా నిలిచాయి. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా అని రాష్ట్రపతి ట్విట్టర్‌లో పేర్కొ న్నారు. నటి శ్రీదేవి మరణం బాధాకరం. చిరస్మరణీయ పాత్రలతో అలరించిన దిగ్గజ నటి. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ... ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా అని ప్రధాని నరేంద్ర మోడీ తెలియజేశారు. శ్రీదేవి మృతిపట్ల బాలీవుడ్ పరిశ్రమ దిగ్భ్రాంతి చెందింది. అమితాబ్‌తో సహా నటీనటులందరూ ఆమె హఠాన్మరణం పట్ల సంతాపంవ్యక్తం చేశారు. అలాగే కేంద్రమంత్రులు వివిధ రాజకీయ పార్టీల నేతలు తమ సంతాప సందేశాలలో ఆమె నటనా కౌశల్యాన్ని కొనియాడారు.



సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పం

జాన్వి 'ధడక్' చూడకుండానే..

▶ అప్పుడు మొదటి భార్య.. ఇప్పుడు శ్రీదేవి



ముంబై : శ్రీదేవి కన్నా ముందు బోనీకపూర్‌కు మోనాషౌరీతో వివాహం జరిగింది. ఆ తరువాత కొన్ని కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. అనంతరం బోనికపూర్ శ్రీదేవిని పెళ్లి చేసుకోవడం జరిగిపోయాయి. భర్త లేరనే బాధతో మోనా అనారోగ్యంతో చనిపోయారు. అప్పటికే ఆమె కుమారుడు అర్జున్ కపూర్ 'ఇషక్ జాదే' చిత్రంలో నటిస్తున్నారు. అర్జున్ నటించిన మొదటి సినిమా ఇది. అయితే ఈ చిత్రం 2012 మేలో విడుదల కావాల్సి ఉండగా, అర్జున్ తల్లి మార్చిలో మరణించారు. దాంతో ఆమె తన కుమారుడు నటించిన మొదటి సినిమా చూడలేకపోయారు. ఇప్పుడు శ్రీదేవి విషయంలోనూ ఇదే జరిగింది. శ్రీదేవి మొదటి కుమార్తె జాన్వి కపూర్ ప్రస్తుతం 'ధడక్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా జూన్‌లో విడుదల కావాల్సి ఉంది. శ్రీదేవి సలహాతోనే జాన్వి ఈ సినిమాకు ఒప్పుకొన్నారు. అమ్మ ఉంటేనే ధైర్యంగా షూటింగ్ చేస్తాననేవారు. దాంతో ఉదయం నుంచి శ్రీదేవి జాన్వి కోసం సెట్‌లోనే ఉండేవారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైనప్పుడు జాన్వి..అచ్చం తన తల్లిలాగే ఉన్నారంటూ అభిమానులు మురిసిపోయారు. తొలి సినిమాతో జాన్వికి మంచి గుర్తింపు వస్తుందని ఎన్నోసార్లు చెప్పిన శ్రీదేవి తన కూతురిని తెరపై చూసుకోకుండానే వెళ్లిపోయింది.


వివాహ సమయంలో


భర్త, కూతుళ్లతో


బాపు, రమణలతో


వేటగాడు సినిమాలో


డా॥ సినారేతో..

బిగ్‌బీకి ముందే తెలిసిందా?



ముంబై : భారత సినీరంగ మహిళా సూపర్‌స్టార్‌గా వెలుగొందిన శ్రీదేవి పెళ్లి వేడుక కోసం దుబాయ్ వెళ్లి గుండెపోటుతో అక్కడే తుదిశ్వాస విడిచారు. ఆమె మరణం చిత్ర పరిశ్రమను, అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అతిలోక సుందరి మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్‌కు ముందే తెలిసినట్లు ఉంది. ఆమె మృతి చెందడానికి కొన్ని గంటల ముందు అమితాబ్ ట్వీట్ చేశారు. 'గుండెల్లో ఏదో తెలియని అలజడిగా ఉంది' అని పేర్కొన్నారు. బహుశా శ్రేయోభిలాషుల నుంచి ఆయనకు శ్రీదేవి అస్వస్థతకు గురయ్యారని తెలిసినట్లు సమాచారం. అమితాబ్, శ్రీదేవి కలిసి జంటగా 'ఇంక్విలాబ్', 'ఆఖరి రాస్తా', 'ఖుదాగవా' సినిమాల్లో నటించారు. 2012లో శ్రీదేవి ప్రధాన పాత్ర పోషించిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమాలో అమితాబ్ అతిథి ప్రాతలో కనిపించారు. ఆ కొన్నేళ్ల విరామం తర్వాత శ్రీదేవి నటించిన చిత్రమిది. తర్వాత 2017లో 'మామ్'తో పూర్తిస్థాయి పాత్రలో కనిపించారు. 'దేవకన్య' ప్రాణాలతో ఉండి ఉంటే 'జీరో' అనే చిత్రంలో నటించేవారు. కానీ విధి ఇలా ఆమెను దూరం చేసింది.

ప్లీజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాలి

కేంద్ర వాణిజ్య శాఖామంత్రి సురేష్‌ప్రభు

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుండి ప్లీజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాలని కేంద్ర వాణిజ్య శాఖామంత్రి సురేష్‌ప్రభు చెప్పారు. స్థానిక ఏపిఐఐసి గ్రౌండ్స్‌లో భారత పరిశ్రమల సమాఖ్య, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు రెండవ రోజైన ఆదివారం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రోత్సాహం అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి కేంద్రమంత్రి సురేష్‌ప్రభు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి సురేష్‌ప్రభు మాట్లాడుతూ వాణిజ్య అవసరాలకు సరిపడా ప్రకృతి వనరులు, విశాలమైన కోస్తా తీరం ఉండడంతోపాటు మానవ వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. భారతదేశ సంతతికి చెందిన ప్రజలు ఎంతో మేధావులని వారు ఏ ప్రాంతానికి వెళ్లినా విజయవంతం అవతున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోడి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల కారణంగా గత మూడు సంవత్సరాల నుండి భారతదేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విజయవంతమైందని, ప్రజలను సత్వరమే అత్యుత్తమ పరిపాలన అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి సఫలీకృతం అవడంపట్ల ముఖ్యమంత్రిని అభినందించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పరిశ్రమలు ఎక్కువగా స్థాపిస్తే రాష్ట్రంలోని యువతకు, భావితరాలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. జీవన ప్రమాణాల స్థాయి మెరుగుపడడంతో ప్రజలలో సంతృప్తిస్థాయి పెరుగుతుంది. రాష్ట్రంలో ప్రపంచ బ్యాంక్ నిబంధనలను అనుసరించి పరిశ్రమలకు అనుమతులను సింగిల్‌విండో విధానంలో అందించడంలో ఆంధ్రపదేశ్ రాష్ట్రం అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను ప్రపంచ బ్యాంకు కొనియాడిం దన్నారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన పారిశ్రామికవేత్తలను ఏపీలో పెట్టుబడి పెట్టాల్సిం దిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాకినాడలో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐయఫ్‌టి) ప్రాంగణానికి, కాకినాడలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ ప్రాంగణానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి సురేష్‌ప్రభు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏపీకి చెందిన ఇ-స్పేస్ బజార్ వెబ్‌పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపెడా ఆధ్వర్యంలో ఆక్వా రైతుల నమోదు గుర్తింపు కార్డులను పంపిణీ చేసారు. అనంతరం విశాఖపట్టణం యన్ఆర్‌డిసి-ఐపియఫ్‌సిలో ఏర్పాటుచేసే టెక్నాలజీ, ఇన్నోవేషన్ సపోర్ట్ సెంటర్ -టిఐయస్ ఇ ఏర్పాటుకు సంబంధించి సిఐపిఏయం మరియు యన్ఆర్‌డిసి మధ్య జరిగిన ఒప్పంద పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి సురేష్‌ప్రభు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖామంత్రి యన్.ఆదినారాయణరెడ్డి, పార్లమెంట్ సభ్యులు కె.హరిబాబు, శాసనమండలి సభ్యులు యం.వి.వి. యస్.మూర్తి ప్రభృతులు పాల్గొన్నారు.






శ్రీదేవి పెయింటర్ కూడా..!

ముంబై : శ్రీదేవి ఓ నటిగా మాత్రమే మనందరికి సుపరిచితం. కానీ శ్రీదేవికి పెయింటింగ్ అంటే చాలా ఇష్టమట. గత ఐదేళ్లుగా ఎవరికీ తెలియకుండా పెయింటింగ్స్ వేస్తుందట. నచ్చిన వాళ్ళకి బహుమతిగా కూడా వీటిని ఇస్తుంది. తన మరిది కూతురు సోనమ్ కపూర్‌కి అందమైన పెయింటింగ్ వేసి గిఫ్ట్‌గా ఇచ్చింది శ్రీదేవి. దీనికి ఫుల్ ఖుష్ అయిన సోనమ్ తన రూమ్‌లో ఇష్టమైన ప్రదేశంలో ఉంచినట్టు తెలుస్తుంది. ఇక సల్మాన్ ఖాన్, డిజైనర్ మనీష్ మల్హోత్రా వంటి సెలబ్రిటీలకు కూడా తన పెయింటింగ్స్ గిఫ్ట్‌గా ఇచ్చినట్టు సమాచారం. శ్రీదేవి గీసిన పెయింటింగ్స్‌లో మైకేల్ జాక్సన్, తన గారాల పట్టీలు జాన్వి, ఖుషీలు కూడా ఉన్నాయట. అయితే త్వరలో దుబాయ్‌లో ఒక అంతర్జాతీయ ఎగ్జిబిషన్ సంస్థ శ్రీదేవి పెయింటింగులతో ఓ షో ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేసిందని ఇటీవల వార్తలు వచ్చాయి. ఇది ఓ చారిటీ నిధి కోసం అని అన్నారు.

శ్రీదేవికి ప్రయాణాలు అంటే చాలా ఇష్టం. గ్యాప్ దొరికితే పిల్లలతో కలిసి విదేశాలకి వెళుతూ ఉంటుంది. రోమ్, ఇటలీ తనకి బాగా నచ్చుతాయని శ్రీదేవి ఒక ఇంటర్వ్యూలో తెలిపింది. లేతరంగు చీరలంటే శ్రీదేవికి చాలా ఇష్టం. చిన్నతనంలోనే ఎలా కట్టుకోవాలో వాళ్ళ అమ్మ శ్రీదేవికి నేర్పించిందట. మ్యూజిక్ వింటూ పనులు మొదలు పెట్టే శ్రీదేవి తెలుగు, తమిళం, హిందీ పాటలు ఎక్కువగా వింటుంది. శ్రీదేవికి భక్తి కూడా చాలా ఎక్కువే. ఏ పని ప్రారంభించిన ముందు పూజ చేయడం అలవాటు. హీరోయిన్‌గా ఉన్నప్పుడు కూడా ఇంటి నుండి బయలు దేరే ముందు పూజ చేసి బయటకు వెళ్లేదట.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.